విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, ఆదివారం 21, సెప్టెంబర్ 2025

ఓటీపీ విధానాన్ని రద్దు చేయాలి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: నంద్యాల దస్తావేజు లేఖర్ల సమ్మె శనివారం మూడో రోజుకు చేరుకుంది. స్థానిక సబ్ రిజిస్టర్ కార్యాలయం నుండి నినాదాలు చేస్తూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట దీక్షల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నంద్యాల జిల్లా స్టాంప్ రైటర్స్ అండ్ వెండర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఫరూక్, రమేష్ లు మాట్లాడుతూ తమ పనులకు స్వస్తి పలికి పెన్ డౌన్ ప్రకటించి సమ్మె చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ప్రభుత్వం అనుసరిస్తున్న 2.0 విధానంలోని ఆధార్ ఓటిపి, మొబైల్ ఓటిపి, పిడీఎఫ్ ఫీడింగ్ సమస్యలు, ప్రైవేట్ అటెండెన్స్ తదితర సమస్యల వల్ల ప్రజల రిజిస్ట్రేషన్ వ్యవహారాలకు అనేక ఇబ్బందులు ఎదురవు తున్నాయని, ఈ సమస్యలను ప్రభుత్వం త్వరితగతిన పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జిల్లాకు చెందిన యావత్తు దస్తావేజు లేఖర్లు సమ్మెను చేపడుతున్నట్లు వారు పేర్కొన్నారు. ప్రభుత్వం దిగివచ్చి తమ సమస్యలను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. ఇందుకు పట్టణ, గ్రామ ప్రజలు సహకరించవలసినదిగా కోరుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో అసోసియేషన్ నాయకులు మాలిక్, శివరాం, సుబ్రహ్మణ్యం, ప్రసాద్, బాష, ఆది నారాయణ రెడ్డి, హుసేన్, హబీబ్, నాగలక్ష్మి దేవి, సత్యం, అస్లాం, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

రోబోట్లపై విద్యార్థులు నైపుణ్యం పెంచుకోవాలి

విశాలాంధ్ర - పాణ్యం: విద్యార్థులు రోబోట్లపై నైపుణ్యం పెంపొందించుకోవాలని బెంగుళూరు డీఆర్డీఓ శాస్త్రవేత్త నాని మేడిచర్ల అన్నారు. శనివారం ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాలలో ఏఐఎంఎల్ విభాగం ఆధ్వర్యంలో జాతీయ సాంకేతిక సదస్సు అమోఘ 2కే 25ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థుల ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు తమ భవిష్యత్తును, ఉద్యోగ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని కోరారు. ఏఐఎంఎల్ విభాగానికి సంబంధించి ఆర్ఓఎస్ ల్యాబ్‌లో ఉత్తమ సాంకేతికత ఉన్న రోబోట్లపై నైపుణ్యం పెంచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా సదస్సులో రోబోట్ ను ప్రదర్శించారు. హైదరాబాద్ డెల్ టెక్నాలజీస్ శాస్త్రవేత్త నరేష్ బిల్లా, ప్రిన్సిపాల్ జయచంద్ర ప్రసాద్, హెచ్ఓడి కిషోర్ కుమార్, కోఆర్డినేటర్ హరగోపాల్, హైదరాబాద్ రోబో మిరాకిల్ నిర్వాహకులు రియాజ్ షేక్ అహ్మద్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రంథాలయాన్ని తనిఖీ చేసిన గ్రంధాలయ సెక్రెటరీ

విశాలాంధ్ర - బనగానపల్లె: పట్టణంలోని శాఖ గ్రంథాలయని జిల్లా గ్రంథాలయ సంస్థ సెక్రెటరీ కే ప్రకాష్ తనిఖీ చేశారు. శనివారం నాడు గ్రంథాలయం ఆవరణంలో ప్రకాష్ మొక్కలు నాటారు. తరువాత గ్రంథాలయంలో స్వర్ణాంధ్ర స్వచంద్ర ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాల అధికారి మధు శేఖర్, గ్రంథాలయ సిబ్బంది అరుణగీతామని, బిడిసి ఆర్గనైజర్స్, పాఠకులు పాల్గొన్నారు.

ది గెలివి వేంకటేశ్వర విద్యాలయం సిల్వర్ జూబిలీ లోగో ఆవిష్కరణ

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: ది గెలివి వేంకటేశ్వర విద్యాలయం తన స్థాపనకు 25 ఏళ్లు పూర్తి చేసుకుని సిల్వర్ జూబిలీ వేడుకల దిశగా అడుగుపెట్టింది. ఈ ప్రత్యేక సందర్భాన్ని గుర్తిస్తూ రూట్స్ టు వింగ్స్ అనే థీమ్‌తో ప్రత్యేక లోగో రూపొందించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థుల కోసం నిర్వహించిన లోగో డిజైన్ పోటీలో ఉత్తమ లోగోను ఘనంగా ఆవిష్కరించారు. జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియ కలెక్టర్ కార్యాలయంలో ఈ లోగోను ఆవిష్కరించారు. డా.గెలివి సహదేవుడు, గెలివి రామక్రిష్ణ, గెలివి శరత్, పాఠశాల మేనేజ్ మెంట్ నుండి గెలివి శ్రీకాంత్, గెలివి వశిష్ఠ, శుభశ్రీ, ప్రిన్సిపాల్ నోబుల్ మాథ్యూ, కోఆర్డినేటర్లు అమల, మౌనిక, వసంత్ కుమార్, ఉమైజా అఫియా తదితరులు పాల్గొన్నారు. కలెక్టర్ పోటీలో పాల్గొన్నవారిని అభినందిస్తూ, ది గెలివి వేంకటేశ్వర విద్యాలయానికి సిల్వర్ జూబిలీ ఏడాది శుభారంభం సందర్భంగా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల: మండలంలోని తిమ్మనాయునిపేట గ్రామంలో ఉన్న ఆకాంక్ష స్పోర్ట్స్ అకాడమీకి చెందిన పలువురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు సంస్థ కార్యదర్శి రాజేష్ తెలిపారు. ఈనెల 19వ తేదీన కర్నూల్ లో నిర్వహించిన జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో పలు క్రీడల్లో అండర్-16, -14 నందు 6 మంది విద్యార్థులు మంచి ప్రతిభా కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. అండర్-16 బాలికల విభాగంలో రేస్ వాక్ నందు ఆర్ షాలిని, పరుగు పందెంలో టి.లక్ష్మి శాంతి, షాట్ పుట్‌లో అనిత, హై జంప్, హార్డ్ లెస్ విభాగాలలో యక్షశ్రీ, ప్రథమ స్థానంలో నిలువగా, అండర్-14 బాలికల విభాగంలో అథ్లెటిక్ నందు అవంతిరాణి, బాలుర విభాగంలో అథ్లెటిక్‌లో రాహుల్ రెండో స్థానంలో నిలిచారు. ప్రథమ ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థులందరూ ఈ నెల 27వ తేదీన ఏలూరులో నిర్వహించే రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలలో పాల్గొంటారని తెలిపారు.

లారీ అసోసియేషన్‌పై వైసీపీ ఆరోపణలు అవాస్తవం

విశాలాంధ్ర-ఆళ్లగడ్డ: లారీ అసోసియేషన్‌పై వైసీపీ నాయకులు చేసిన ఆరోపణలు అవాస్తవమని లారీ అసోసియేషన్ సభ్యులు అన్నారు. శనివారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ వైసీపీ నాయకులు చేస్తున్న అసత్య ప్రచారాలు తప్పు అని, ఇక్కడ ఎవరూ ఎక్కువ డబ్బులు వసూలు చేయడం లేదన్నారు. లారీ అసోసియేషన్‌కి పార్టీలకు, రైతులకు ఎలాంటి సంబంధం లేదన్నారు. గత ప్రభుత్వంలో ఎంతైతే వసూలు చేసారో అంతకంటే తక్కువనే వసూలు చేస్తున్నామని, రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగదని, ఇది కేవలం లారీ అసోసియేషన్ మెయింటెనెన్స్‌కు మాత్రమే తీసుకోవడం జరుగుతుందన్నారు. రాజకీయాలకు ఎలాంటి సంబంధం లేదని, దీనిపై బురదజల్లే రాజకీయాలు చేయొద్దని తెలిపారు. గత ప్రభుత్వంలో గ్రీన్ టాక్స్ కింద రూ.20 వేలు తీసుకోవడం జరిగిందన్నారు. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత మూడు వేలకు తగ్గించడం చాలా సంతోషమన్నారు.

మన పరిశుభ్రతే మన ఆరోగ్యం

విశాలాంధ్ర - వెలుగోడు: మన ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం వల్ల మనం ఆరోగ్యాంగా ఉంటామని ఆత్మకూరు ఆర్డీఓ నాగజ్యోతి అన్నారు. వెలుగుడు గ్రామపంచాయతీ నందు ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి నెల మూడవ శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రజలకు అవగాహన కల్పించడం జరిగింది. సర్పంచ్ జయపాల్ అధ్యక్షతన పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అందరిచేత పరిశుభ్రత పాటిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. గ్రామ పంచాయతీ ఆవరణలో మొక్కలు నాటారు. మండలం ప్రత్యేక అధికారి ఫిషరీస్ జాయింట్ డైరెక్టర్ హిరా నాయక్ రెవెన్యూ డివిజనల్ అధికారి నాగజ్యోతి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి మధు సూదన రెడ్డి, మండల తహసిల్దార్ శ్రీనివాసులు గౌడ్, అసిస్టెంట్ ఎంపిడిఓ మురారి, కార్యదర్శి నరేంద్ర, సచివాలయ సిబ్బంది, మండల అధికారులు గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్య పరిరక్షణకు స్వస్థనారి స్వశక్తి పరివార అభియాన్

విశాలాంధ్ర - మిడుతూరు: మహిళల ఆరోగ్య పరిరక్షణకు స్వస్థనారి స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కడుమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాజు, డాక్టర్ హేమకేష్ అన్నారు. శనివారం మండల పరిధిలోని కడుమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వస్థ నారి స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం పై మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజు మాట్లాడుతూ ఆరోగ్య శిబిరంలో మహిళలకు, చిన్నారులకు వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. బాలింతలు, చిన్నారుల్లో పోషకార లోపాన్ని తగ్గించడంతోపాటు నెల రోజులపాటు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. టిడిపి నాయకులు సల్కోటి గోవర్ధన్ రెడ్డి, కమతం వీరారెడ్డి, హెల్త్ సూపర్వైజర్ ఏసేపు, వైద్య సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

స్వచ్ఛ నంద్యాల లక్ష్యానికి ప్రతి ఒక్కరి కృషి అవసరం

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: జిల్లాను స్వచ్ఛ నంద్యాల జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరి కృషి అవసరమని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ అన్నారు. శనివారం నంద్యాల పట్టణం మున్సిపల్ పరిధిలోని భీమవరం రోడ్డు డంప్ యార్డ్‌లో నిర్వహించిన స్వర్ణాంధ్ర, స్వచ్ఛంధ్ర కార్యక్రమంలో మంత్రి ఫరూక్ పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి, మున్సిపల్ కమిషనర్ శేషన్న, తెలుగుదేశం పార్టీ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్, మున్సిపల్ కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ జిల్లాను స్వచ్ఛ రహిత నంద్యాల జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరి కృషి అవసరమన్నారు. ప్రజలందరూ స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమాలలో భాగస్వాములై చురుకుగా పాల్గొనాలని సూచించారు. పట్టణంలో 17 ఎకరాల డంపింగ్ యార్డ్ ఉందని, ఇందులో ముందు భాగంలోని ఆరు ఎకరాలలో 500 మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 19 వేల కుక్కలు, నంద్యాల పట్టణంలో దాదాపు 2 వేల వీధి కుక్కలు ఉన్నాయని, వీటి వల్ల ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవడంతో పాటు సంతానోత్పత్తిని నియంత్రించేందుకు స్టెరిలైజేషన్ ఆపరేషన్లు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వివరించారు. అంతకుముందు ప్రజలందరిచే స్వచ్ఛంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మంత్రి ఫరూక్‌తో కలిసి పారిశుద్ధ్య కార్మికులను శాలువాలతో సన్మానించారు.

పశువుల సంతను ఎత్తివేయాలి : సీపీఐ

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: నంద్యాలలోని పాత రాణి, మహారాణి థియేటర్ల దగ్గర కుందూ నది పక్కన శనివారం పూట జరిగే జీవాల సంతను ఎత్తివేయాలని సిపిఐ పట్టణ కార్యదర్శి కె.ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుందూనది పక్కన జీవాల సంత ప్రతి శనివారం జరుగుతూ ఉంటుందని, కుందూ నదిపై దశాబ్దాల కాలం నాడు ఒక పాత వంతెన నిర్మించినారని, అది ఇప్పుడు శిధిలావస్థకు చేరిందని, ఆ వంతెనపై ఎస్ఆర్బిసి, నందమూరినగర్, వైయస్సార్ నగర్, రాయమాల్పురం, పులిమద్ది, మునగాల, పోలూరు ఇలా అనేక గ్రామాల నుండి ఆ వంతెనపై రాకపోకలు సాగిస్తూ ఉంటారని, శనివారం వచ్చిందంటే జీవాల సంత వల్ల అక్కడ ట్రాఫిక్ జామ్ అయ్యి వాహనదారులు, పాదచారులు గంటల కొద్దీ ఆ వంతెనపై నిలిచిపోవడం జరుగుతుందన్నారు. ఆ వంతెన దశాబ్దాల కాలం నాటిది కాబట్టి ఎక్కువ తూకం పడితే ఎక్కడ కూలిపోతుందో అని ట్రాఫిక్ జామ్ అయిన వాహనదారులు అరచేతిలో ప్రాణాలు పెట్టుకోవడం జరుగుతుందన్నారు. పక్కన కొత్తగా నిర్మిస్తున్న వంతెన ఏళ్లు గడుస్తున్నా కూడా ప్రజాప్రతినిధులు, అధికారులు పూర్తి చేయలేకపోతున్నారని, ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు అక్కడ శనివారం జరిగే జీవాల సంతను ఎత్తివేసి ట్రాఫిక్ లేని దగ్గర దూర ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని, కొత్తగా నిర్మిస్తున్న వంతెనను త్వరగా పూర్తి చేయాలని ప్రసాద్ కోరారు.

వీఆర్ఏలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

విశాలాంధ్ర - ఆత్మకూరు రూరల్ : వీఆర్ఏలకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేసి వారికి ఉద్యోగ భద్రత కల్పించేంతవరకు పోరాటం కొనసాగిస్తామని వీఆర్ఏల తరుపున ఏఐటియుసి నిలుస్తుందని ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఎం.రమేష్ బాబు, వీఆర్ఏల సంఘం అధ్యక్షులు మహేష్‌లు హెచ్చరించారు. శనివారం రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా ఆత్మకూరు ఆర్డీఓ కార్యాలయం ఎదుట వీఆర్ఏల నిరసన ధర్నా చేసి ఆర్డీఓ నాగజ్యోతికి వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎం.రమేష్ బాబు హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా వీఆర్ఏలు అనేక ఏళ్లుగా కనీస వేతనం లేక గ్రామీణ ప్రాంతాల్లో అటవీ ప్రాంతాల్లో అనేక ఇబ్బందులకు గురై పనిచేస్తున్నారని వారి సంక్షేమానికి పాటు పడడంలో ప్రభుత్వాలు విఫలం చెందుతున్నాయని వారన్నారు. సుప్రీం కోర్ట్ ఆదేశాల మేరకు కనీస వేతనం 26,000 అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. వారితో ప్రభుత్వాలు వెట్టి చాకిరి చేయించుకుంటున్నాయని వారి పట్ల సానుభూతి చూపడం లేదన్నారు. ఇప్పటికే అనేక రూపాల్లో ఆందోళనలు చేసినప్పటికీ వారి సమస్యలు ఎక్కడికి అక్కడ నిలిచిపోయాయన్నారు. వీఆర్ఏల సమస్యల పట్ల ప్రభుత్వం చిత్తశుద్ధి నిరూపించాలన్నారు. అధికార ప్రతిపక్ష పార్టీలు వీరి సమస్యల పట్ల తీవ్ర నిర్లక్ష్యంగా ఉన్నాయని, వీరి సమస్యలు

పరిష్కరించకపోతే రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తామని, అవసరమైతే చలో అసెంబ్లీ కార్యక్రమానికి పిలిపిరిస్తామని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ వీఆర్ఏల సంఘం నాయకులు మహేష్, పరమేశ్వరుడు, మధు, రమేషు, నాగరాజు, దేవన్న, తదితరులు పాల్గొన్నారు.

వరద నీటిలో చిక్కుకున్న ట్రావెల్స్ బస్సు

విశాలాంధ్ర - ఉయ్యాలవాద: ఉయ్యాలవాడ మండలంలో శనివారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. భారీ వర్షానికి గోవింద వల్లె సమీపంలోని రూపనగుడి చెరువు పొంగి ప్రవహిస్తుంది. భారీ వర్షంతో చెరువు నీరు రహదారిపైకి చేరింది. నాలుగు అడుగుల మేరా ప్రవహిస్తుంది. కోవెలకుంట్ల నుంచి జమ్మలమడుగుకు వెళ్తున్న పిఆర్ఎల్ ప్రైవేట్ బస్సు వంతెన దాటుతుండగా మధ్యలోనే వరద నీటిలో చిక్కుకుంది. దీంతో బస్సులో ప్రయాణిస్తున్న 24 మంది ప్రయాణికులు జల దిగ్బంధంలో ఉండిపో యారు. బస్సు వరద నీటిలో చిక్కుకోవడంతో ప్రయాణికులు ఆందోళన చెందారు. విషయం తెలిసిన వెంటనే ముందుగా గ్రామస్తులు అక్కడికి చేరుకున్నారు. ఎస్ఐ రామిరెడ్డి, తహసీల్దార్ ప్రసాద్ బాబు సిబ్బందితో వచ్చి ఒక రోప్ ఏర్పాటు చేసి ప్రయాణికులను రక్షించాలని ప్రయత్నం చేశారు. సాధ్యం కాకపోవడంతో జెసిబిలను తెప్పించి బస్సు సమీ పంలోకి తీసుకెళ్లి జెసిబి బకెట్లో ప్రయాణికులను నిలబెట్టించి, సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. మూడు గంటల పాటు కష్టపడి, బస్సులోని 24 మంది ప్రయాణికులను సురక్షితంగా బయటకు తీసుకు వచ్చారు. కోవెలకుంట్ల, జమ్మల మడుగు ప్రధాన రహ దారిలో రాకపోకలకు అంతరాయం కలిగింది. ప్రయాణికులను అధికారులు సురక్షితంగా గమ్య స్థానాలకు పంపారు. తహసీల్దార్ ప్రసాద్ బాబు, ఎస్సై రామిరెడ్డి సిబ్బందితో కలిసి క్రేన్ సహాయంతో బస్సు ను ఒడ్డుకు చేర్చారు. వరద నీరు ఉధృతంగా ప్రవ హిస్తున్నా డ్రైవర్ నిర్లక్ష్యంగా వెళ్లడం చర్చనీయాంశమైంది.

కామినీ వేణుగోపాల్ సేవలు మరువలేనివి

విశాలాంధ్ర- కోవెలకుంట్ల: కుందూ నదిని జీవ నదిగా మార్చేందుకు కామినీ వేణుగోపాల్ రెడ్డి చేసిన సేవలు అమోఘమని పలువురు ప్రజాసంఘ నాయకులు కొనియాడారు. శనివారం కోవెలకుంట్ల పట్టణంలోని పేరా ఫంక్షన్ హాల్ లో ప్రముఖ వైద్యులు డాక్టర్ పేర శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో సాగునీటి సాధన ఉద్యమకారుడు దివంగత కామిని వేణుగోపాల్ రెడ్డి సంస్మరణ సభ జరిగింది. మొదటగా కామిని వేణు గోపాల్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి పలు వురు ఘన నివాళులర్పించారు. అనంతరం ఈ సభకు ముఖ్యఅతిథిగా హాజరైన కేసీ కెనాల్ డిస్ట్రిబ్యూటర్ మాజీ చైర్మన్ చంద్రమౌళి రెడ్డి మాట్లాడుతూ కామీనీ వేణుగోపాల్ రెడ్డి కుందూ నది పరిరక్షణ కొరకు కుందూ పోరాట సమితి అనే సంస్థను ఏర్పాటు చేసి రాయలసీమలో సాగునీటి ప్రాజెక్టుల సాధన కొరకు అనేక ఉద్యమాలు చేయడం జరిగిందన్నారు. రేనాటి ప్రాంతంలో కుందూ నదిని జీవ నదిగా మార్చేందుకు కామినీ వేణుగోపాల్ రెడ్డి సాగునీటి ఉద్యమకారు లతో కలిసి అనేక పోరాటాలు చేశారని కొనియాడారు. కామిని వేణుగోపాల్ రెడ్డి కుటుంబ సభ్యులతో పాటు టిడిపి రాష్ట్ర కార్యదర్శి గడ్డం రామ కృష్ణారెడ్డి, కోవెలకుంట్ల యువ సమైక్య అధ్యక్షులు కరీం బాష, ప్రజా సంఘ నాయకులు బీసీ సంఘం అధ్యక్షుడు వడ్డే సుబ్బ రాయుడు, బనగానపల్లె సిపిఎం డివిజన్ కార్యదర్శి సుధాకర్, బిజెపి నాయకులు అప్పపోగు వెంకట సుబ్బయ్య, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు నవీన్, రాయలసీమ స్టూడెంట్ నాయకుడు బండెల ఓబులేసు పాల్గొన్నారు.

విద్యార్థులు సేవా గుణం కలిగి ఉండాలి

విశాలాంధ్ర - రుద్రవరం: ప్రతి విద్యార్థి సమాజం పట్ల సేవాగుణం అలవర్చుకోవాలని ఐసిడిఎస్ పిడి లీలావతి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ రాష్ట్రీయ పోషణ మాసం కార్యక్రమాన్ని ఐ సి డి ఎస్ పిడి లీలావతి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు విద్యతోపాటు సమాజం పట్ల సేవా భావం కలిగి ఉండాలన్నారు. ప్రతిరోజు పోషకాలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని తెలిపారు. ప్రతిరోజు ఏదో ఒక సమయంలో తప్పనిసరిగా వ్యాయామం చేయాలని తెలిపారు.అలా చేస్తే మీ ఆరోగ్యం పదిలంగా ఉండి మీరు ఎంతో శక్తివంతంగా ఉంటారన్నారు . వ్యాయా మం చేయడం వల్ల మీలో ఏకాగ్రత పెరిగి జీవితంలో ఉల్లాసంగా ఉత్సాహంగా అనుకున్న లక్ష్యాలను చేరడానికి దోహదపడుతుందన్నారు. సమాజంలో జరిగే మార్పులను గమనిస్తూ మీ జీవితాలను మీరే కాపాడుకోవాలని అన్నారు. 18 సంవత్సరముల లోపు ఆడపిల్లలపై అత్యాచారానికి పాల్పడిన వారిపై పోక్సో చట్టం కింద 20 సంవత్సరములు జైలు శిక్ష లేక యావజ్జీవ కారాగార శిక్ష పడుతుం దన్నారు. బాలికలపై ఎలాంటి అత్యాచారాలకు పాల్పడకూడదన్నారు. అంగన్వాడి సిబ్బంది ఇలాంటి వాటిపై ప్రజలలో అవగాహన కల్పించాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ తేజేశ్వరి, ఎంపీడీవో సుబ్రహ్మణ్యం, ప్రధానోపాధ్యాయులు వెంకటరమణ, సూపర్వైజర్ రషీదా బేగం, సీనియర్ అసిస్టెంట్ షద్రక్ బాబు, ఉపాధి హామీ ఈసి సుబ్బన్న, అంగనవాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థిని శ్రావణికి అండగా ఈటీఎఫ్ టీం సభ్యులు

విశాలాంధ్ర - ఆత్మకూరు టౌన్: మహానందికి చెందిన నాసారి శ్రావణి నర్సింగ్ చదువుకునే కల సాకారమైంది. ఏకలవ్య ట్రైబ్స్ ఫెడరేషన్ స్టేట్ ప్రెసిడెంట్ నల్లబోతుల కొండయ్య, స్టేట్ మహిళా సెక్రటరీ, ఏకలవ్య ప్రగతి ఐక్యవేదిక గ్రూప్ వ్యవస్థాపకురాలు నల్లగొండ్ల శైలజ సహకారంతో ప్రొద్దుటూరులోని శ్రీ లక్ష్మి వెంకటేశ్వర కాలేజీలో ఆమెకు అడ్మిషన్ కల్పించారు. స్వయంగా కాలేజీ, హాస్టల్‌ను పరిశీలించి శ్రావణి, ఆమె నానమ్మ నాసారి సరస్వతికి పరిసరాలు, సదుపాయాలు సంతృప్తికరంగా ఉన్నాయని తెలిపారు. నాసారి సరస్వతి మాట్లాడుతూ శ్రావణి చదువుకు తగిన సహాయం చేసి మంచి కాలేజీలో సీటు కల్పించి అన్ని వసతులు ఏర్పాటు చేసినందుకు ఏకలవ్య ప్రగతి ఐక్యవేదిక నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఏకలవ్య ట్రైబ్స్ ఫెడరేషన్ బాధ్యత తీసుకోవడంతో శ్రావణి విద్యకు మరింత ఉపయోగకరంగా ఉంటుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు.

ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలి

విశాలాంధ్ర - చాగలమర్రి : మానవాళి మనుగడకు ఎంతో ప్రయోజనం చేకూర్చే మొక్కలను ప్రతి ఒక్కరూ నాటాలని జిల్లా బీసీ సంక్షేమ శాఖాధికారి, మండల ప్రత్యేకాధికారి జగ్గయ్య అన్నారు. శనివారం స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణ ఆంధ్రలో భాగంగా మండలంలోని ముత్యాలపాడులో సచివాలయాల వద్ద మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పచ్చని చెట్లు ప్రకృతి ఆహ్లాదాన్ని పంచడమే కాకుండా వీటి ద్వారా ఎన్నో ఆరోగ్యకరమైన ప్రయోజనాలు ఉన్నాయని, ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చి ఇంటికొక మొక్క నాటే విధంగా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షుడు హుసేన్‌రెడ్డి, నీటి సంఘం అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్, ఏఈలు కొండారెడ్డి, జగ్గయ్య, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సుశీల, ఎంసీఓ రాజ్‌కుమార్, టిడిపి నాయకులు మాజీ సర్పంచ్ లక్ష్మిరెడ్డి, రమణారెడ్డి, బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రికి సీలింగ్ ఫ్యాన్స్ అందజేత

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఎంసిహెచ్ బ్లాక్‌లో రోగులు వేచి ఉండే హాల్‌లో ఏర్పాటు చేయడానికి నంద్యాల ఐఎంఏ ఆధ్వర్యంలో మధుమణి నర్సింగ్ హోం, మధుమణి చారిటబుల్ సొసైటీ తరపున రూ.15 వేల విలువ చేసి ఆరు సీలింగ్ ఫ్యాన్లు శనివారం అందజేశారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మల్లీశ్వరికి ఐఎంఏ నంద్యాల అధ్యక్షులు, మధుమణి చారిటబుల్ సొసైటీ చైర్మన్ డాక్టర్ మధుసూదనరావు, ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ ప్రభుత్వాసుపత్రి క్యాజువాలిటీ విభాగం దగ్గర అందజేశారు. డాక్టర్ మల్లీశ్వరి ఐఎంఏకు ధన్యవాదాలు తెలిపారు.

పరిసరాల పరిశుభ్రతలో భాగస్వాములు కావాలి

విశాలాంధ్ర - రుద్రవరం: పరిసరాల పరిశుభ్రత లో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని ప్రతి మండల ప్రత్యేక అధికారి లీలావతి అన్నారు. శనివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుంచి గ్రామంలోని పలు వీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహిం చారు. ఈ ర్యాలీలో దోమలను నివారించుకోవాలని, ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ అవగాహన ర్యాలీ కార్యక్రమంలో ఎంపీడీవో సుబ్ర హ్మణ్యం, ఐసిడిఎస్ సిడిపిఓ తేజేశ్వరి, ఆయా శాఖలకు చెందిన అధికారులు సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

22 నుండి దసరా ఉత్సవాలు

విశాలాంధ్ర- కోవెలకుంట్ల: పట్టణం లోని కన్యకా పరమేశ్వరి దేవాలయం నందు రేపటి నుండి దేవీ నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్న యని స్థానిక ఆర్య వైశ్య సంఘం అధ్యక్షులు పెండేకంటి సుబ్రహ్మణ్యం, ఆర్యవైశ్య సంఘం యువ జన అధ్యక్షులు కర్నాటి అభిలాష్ తెలిపారు. ఈనెల 22 నుండి అక్టోబర్ మూడో వరకు 12 రోజులపాటు ఈ ఉత్సవాలు జరగనున్నాయని వారు తెలిపారు. 22వ తేదీ రాజ రాజేశ్వరి దేవి అలంకరణ 23న శ్రీక త్యాగాయిని దేవి అలం కరణ 24న శ్రీ అన్నపూర్ణ దేవి అలంకరణ 25న బాల త్రిపుర సుందరి దేవిగా 26న ధనలక్ష్మి దేవి అలంకరణ 27న శ్రీ నాగలక్ష్మి దేవి అలంకరణ 28న శ్రీ గజలక్ష్మి దేవి అలంకరణ, 29న సరస్వతి దేవి అలంకరణ మరియు బింద సేవ, 30న శ్రీ మహిషాసుర మర్ధిని దేవి అలంకరణ అక్టోబరు 1న కామాక్షి దేవి అలంకరణ, 2న విజయలక్ష్మి దేవిగా అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారని, 3న వసంతాలు జరుగుతాయని ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు తెలిపారు.

స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ ఆరోగ్య శిబిరం

విశాలాంధ - పాములపాడు : స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఎర్రగూడూరు గ్రామంలోని సచివాలయంలో మరియు పాములపాడు గ్రామంలోని ఆయుర్వేద వైద్య శాల ఆవరణలో కార్యక్రమాన్ని శనివారం ఏర్పాటు చేశారు. ఎర్రగూడూరు గ్రామంలోని ఆరోగ్య శిబిరాన్ని మండల స్పెషల్ ఆఫీసర్-ఎంఎస్ యు.రాజు, మండల అభివృద్ధి అధికారి-ఎన్. చంద్రశేఖర్ లు పర్యవేక్షించడం జరిగింది. ముందుగా స్వస్త్య నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం గురించి ప్రతిజ్ఞ చేయించడం జరిగింది.ఈ సందర్భంగా వైద్య నిపుణులు మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ జి.మల్లికార్జున, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ముర్తుజాబీ, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చల్ల దామోదర్ రెడ్డి మండల నాయకుడు మురళి, ఆరోగ్య కార్యకర్త బి.సునీత రాణి, పంచాయతి కార్యదర్శి-వినీల, అంగన్వాడి సూపర్వైజర్ లలిత ప్రభావతమ్మ పాల్గొన్నారు.

రెజ్లింగ్ రాష్ట్ర పోటీలకు ఆదర్శ పాఠశాల విద్యార్థుల ఎంపిక

విశాలాంధ్ర-రుద్రవరం: రాష్ట్రస్థాయి రెజ్లింగ్ క్రీడలకు ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఎంపిక కావడం జరిగిందని పాఠశాల ప్రిన్సిపల్ నాగేశ్వరరావు తెలిపారు. శనివారం ఆయన వివరాల మేరకు ఇటీవల అండర్ 19 ఎస్‌జిఎఫ్‌లో భాగంగా కర్నూలు ఔట్ డోర్ స్టేడియంలో జిల్లా స్థాయి రెజ్లింగ్ పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచి ఏడుగురు విద్యార్థులు, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం జరిగిందని ఆయన తెలిపారు. జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయిలో జరిగే క్రీడలలో మెరుగైన ప్రదర్శన ఘనపరిచి, తల్లిదండ్రులకు, పాఠశాలకు పేరు ప్రఖ్యాతలను తీసుకురావాలన్నారు. రాష్ట్ర స్థాయిక్రీడలకు ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయ బృందం అభినందించారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి : మంత్రి

విశాలాంధ్ర - బనగానపల్లె: ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు డాక్టర్లు సకాలంలో మెరుగైన వైద్యం అందించాలని రోడ్లు భవనాలు పెట్టుబడులు మౌలిక సదుపాయాలశాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి అన్నారు. శనివారం బనగానపల్లె ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. బనగానపల్లె ప్రభుత్వ ఆసుపత్రిలో కల్పించాల్సిన కనీస మౌలిక సదుపాయాలు, వైద్య పరికరాలు, సిబ్బంది కొరత వంటి అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి సూపర్డెంట్ ప్రభుత్వ ఆసుపత్రిలో ముఖ్యంగా గైనకాలజిస్ట్, స్టాఫ్ నర్సుల కొరత, హై వోల్టేజ్ సమస్య మంత్రి దృష్టికి తీసుకు వచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ నరసింహులు, టంగుటూరు సీనయ్య, ఆసుపత్రి కమిటీ సభ్యులు, డిహెచ్ఎస్ లలిత, సూపరిండెంట్ డా.శైలజ, ఇతర వైద్యాధికారులు, సీఐ ప్రవీణ్ కుమార్ తదితరులు.

షాపుల్లో ఫార్మసిస్టులే విక్రయాలు జరపాలి

విశాలాంధ్ర-అవుకు: మెడికల్ షాపులలో ఫార్మసిస్టులే విక్రయాలు జరపాలని డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు జయరాముడు, హనుమన్న అన్నారు. శనివారం అవుకు పట్టణంలోని మెడికల్ షాపులను కర్నూలు రూరల్, నంద్యాల డ్రగ్ ఇన్స్పెక్టర్లు జయరాముడు, హనుమన్నలు తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో భాగంగా నాలుగు షాపులను తనిఖీ చేయగా ఒక దుకాణంలో మాత్రం ఫార్మసిస్టు కాకుండా ఇతరులు విక్రయాలు జరుగుతున్నట్లు గుర్తించామని, షాపును ఫార్మసిస్టు వచ్చి విక్రయాలు జరిపే వరకు తాత్కాలికంగా మూసి వేయడం జరిగిందని తెలిపారు.

విద్యుదాఘాతంతో బాలుడు మృతి

విశాలాంధ్ర - ఆత్మకూరు రూరల్: మండల పరిధిలోని ముష్టపల్లి గ్రామంలో యుగంధర్ నాయక్ (12) విద్యుధాఘాతానికి బలై మృతి చెందాడు. ఇంటి ముందర ఉన్న జామచెట్టు ఎక్కి, జామకాయలు కోస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. బాలుడుని హుటాహుటిన ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించేలోపే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. చేతికొచ్చిన కొడుకు కళ్లముందే మృతి చెందడంతో శోకసముద్రంలో కుటుంబ సభ్యులు మునిగారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

విశాలాంధ్ర - కోవెలకుంట్ల : అప్పుల బాధలు తాళలేక ఆత్మహత్య చేసుకున్న ఘటన కోయిలకుంట్ల పట్టణంలో శుక్రవారం మధ్యరాత్రి చోటు చేసుకుంది. కోవెలకుంట్ల ఎల్లంకమ్మను చెందిన ఎల్ఎం కాంపౌండ్ చెందిన చంద్రశేఖర్ (50) మద్యంలో గడ్డి మందు కలుపుకొని, తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై మల్లికార్జున రెడ్డి తెలిపారు. శనివారం ఎస్సై వతెలిపిన వివరాల మేరకు అప్పుల బాధలు ఎక్కువై ఆత్మహత్యకు పాల్పడ్డాడని, 20 ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకొని వ్యవసాయం చేశాడు. దిగుబడి రాక, వచ్చిన దిగుబడికి గిట్టుబాటు ధరలేక సుమారు రూ.16 లక్షల అప్పు అయ్యింది. చేసిన అప్పు తీర్చే మార్గం తెలియక, మదనపడుతూ ఆత్మహత్య పాల్పడ్డాడని మృతునికి కుమారుడు రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇచ్చిన ఫిర్యాదు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మల్లికార్జున రెడ్డి తెలిపారు.

బావి నీటి శుభ్రత కోసం చర్యలు

విశాలాంధ్ర - వెలుగోడు: మండలంలోని వేల్పనూరు గ్రామం ఓసి కాలనీ రౌండ్ వెల్ బావిలో నీటిని శుభ్ర పరుచుటకు వైద్యులు చర్యలు చేపట్టారు. ఇంటి అవసరాల కోసం ప్రజలు బావి నీటిని వాడటం జరుగుతుంది. అయితే అందులో లార్వాలు ఉండటం వలన శానిటరీ ఇనిస్పెటర్ ఆఫీసర్ ఆదేశాల మేరకు వేల్పనూరు ఓసి కాలనీలలో రౌండ్ వెల్ బావిలో గంబుసియా చేపలను వదలినట్లు వైద్యులు తెలిపారు. గంబుసియా చేపలన వలన దోమ రాల్వాను తిని మలేరియా డెంగ్యూ వ్యాధులను కలగకుండా ఇవి నిరోధిస్తాయని చెప్పారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జహీర్ వలి, ఎంపిహెచ్ఈఓ శ్రీనివాసులు హెల్త్ అసిస్టెంట్, ఏఎన్ఎంలు ఆశాలు, గ్రామపెద్ద నరసింహారెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. మెడికల్ ఆఫీసర్ సీజనల్ డిసీస్‌ల పట్ల డెంగు మలేరియా రోగాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు.

మొక్కల సంరక్షణ మనందరి బాధ్యత

విశాలాంధ్ర - మిడుతూరు: మొక్కల సంరక్షణ మనందరి బాధ్యత అని మండల ప్రత్యేక అధికారి జాకీర్ హుస్సేన్ అన్నారు. శనివారం మండల కేంద్రమైన మిడుతూరులో గ్రీన్ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేక అధికారి మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. టీడీపీ మండల కన్వీనర్ కాతా రమేష్ రెడ్డి, ఎంపీడీవో దశరథ రామయ్య, డిప్యూటీ ఎంపీడీవో సంజన్న, పంచాయతీ కార్యదర్శి కళ్యాణ్ సింగ్, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

విశాలాంధ్ర కర్నూలు
www.visalaandhra.com
కర్నూలు, ఆదివారం 21, సెప్టెంబర్ 2025

ఉల్లి, టమోటా, పత్తి పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి

విశాలాంధ్ర-పత్తికొండ: ఉల్లి, టమోటా, పత్తి పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య, ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం, జిల్లా కార్యదర్శి పంపన్న గౌడ్ డిమాండ్ చేశారు. శనివారం సీపీఐ, ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రతినిధి బృందం రైతులు సాగుచేసిన పంటల పరిశీలనలో భాగంగా మద్దికేర మండలం పెరవలిలో జీపు జాతను ప్రారంభించి తుగ్గలి, పత్తికొండ మండలాలలో ఉల్లి, టమోటా, పత్తి పంటలను పరిశీలించి, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ లో రైతులు ఉల్లి, టమోటా, పత్తి, వేరుశనగ, పచ్చిమిర్చి, కంది, మొక్కజొన్న, ఆముదం, కొర్ర, సజ్జ తదితర పంటలను విస్తారంగా సాగు చేశారని, పండిన పంటలకు గిట్టుబాటు ధర లభించక రైతులు తీవ్రంగా నష్టపోవడం జరిగిందన్నారు. ప్రభుత్వం ఉల్లి పంట క్వింటానికి 1200 రూపాయలు, టమోటా కేజీ 8 రూపాయల చొప్పున కొనుగోలు చేస్తామని చెప్పడం వలన రైతులకు ఏమాత్రం గిట్టుబాటు కాదన్నారు. ఉల్లి పంటకు క్వింటానికి మూడు వేలు, పత్తి క్వింటానికి పదివేల రూపాయలు, టమోటా కేజీ రూ.20 ప్రకారం ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. వివిధ రకాల పంటలు సాగు చేసి నష్టపోయిన రైతులకు ఎకరాకు

ఆస్పరిలో..

రూ.50 వేల పంట నష్టపరిహారం చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి డి. రాజా సాహెబ్, శ్రీనివాసరావు, నియోజకవర్గ అధ్యక్షులు ఉమాపతి, గౌరవ అధ్యక్షులు కారన్న, సిపిఐ మండల

దేవనకొండలో..

ఆదోని రూరల్..

కార్యదర్శి కారుమంచి, పట్టణ కార్యదర్శి రామాంజనేయులు, మండల సహాయ కార్యదర్శి జోహారాపురం కాశి, ఎంకే సుంకన్న, రైతు సంఘం నాయకులు నాగిరెడ్డి, రాముడు, మద్దిలేటి, చదువుల కాశీ, ప్రతాప్, వినోద్ పాల్గొన్నారు.

బన్నీ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించాలి

విశాలాంధ్ర - ఆలూరు : మండలం దేవరగట్టులో జరుగనున్న బన్నీ ఉత్సవాల నిర్వహణకు సంబంధించి శనివారం దేవర గట్టులో ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ సమీక్ష సమావేశం నిర్వహించారు. నేరనికి, నేరినికి తండా, కొత్తపేట గ్రామాల గ్రామ పెద్దలు, ప్రతినిధులు, పోలీసు శాఖ, వైద్య, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొ న్నారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ దేవరగట్టు బన్నీ ఉత్సవాలు ప్రతి సంవత్సరం ఎంతో మంది భక్తులు, గ్రామస్తులు ఉత్సాహంగా పాల్గొనే సాంప్రదాయ కార్యక్రమం. గతంలో ఈ ఉత్సవాలలో పెద్ద ఎత్తున గాయాలు సంభవించినప్పటికీ అదృష్టవశాత్తు ప్రాణ నష్టం జరగలేదు. అయితే ఈసారి ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రాణ నష్టం జరగకుండా, గాయాల సంఖ్య తగ్గేలా పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామ స్థాయిలో అవగాహన సదస్సులు ప్రజలకు భద్రతా సూచనలు, శాంతియుత వాతావరణంలో పాల్గొనడంపై అవగాహన కల్పించాలని తెలిపారు. వైద్య సదుపాయాలు తాత్కాలిక వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని. అత్యవసర సేవల కోసం అంబులెన్స్ లు సిద్ధంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పోలీసు బందోబస్తు భక్తుల రాకపోకల సమయంలో ట్రాఫిక్ నియంత్రణ, రాత్రి పూట భద్రత కోసం ప్రత్యేక పోలీసులు మోహరించాలి అని తెలిపారు. బన్నీ ఉత్సవం ఒక సంస్కృతిక ఉత్సవం మాత్రమే గాక ప్రజల ఐక్యతకు ప్రతీక. ప్రతి ఒక్కరూ శాంతి, సౌభ్రాతృత్వం, భద్రతను కాపాడే విధంగా సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ నిజాముద్దీన్, ఎంపీడీవో విజయ లలిత, గ్రామీణ నీటి సరఫరా శాఖ డిప్యూటీ ఇంజనీర్ మల్లికార్జునయ్య, విద్యుత్ శాఖ ఏ.ఈ ఓబులమ్మ, వైద్య అధికారి డాక్టర్ న్యూటన్, డాక్టర్ బిందు మాధవి, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎఫ్డీసీ పథకం నిధులు విడుదల చేయాలి : డీహెచ్‌పీఎస్

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు: కేంద్రప్రభుత్వం ఎన్ఎస్ఎఫ్ డిసీ స్కీం నిధులు విడుదల చేయాలని డిహెచ్ పీఎస్ జిల్లా కార్యదర్శి సి.మహేష్ డిమాండ్ చేశారు. శనివారం దళిత హక్కుల పోరాట సమితి జిల్లా సమితి ఆధ్వర్యంలో ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయం ముందు జరిగిన ధర్నా కార్యక్రమానికి నగర కార్యదర్శి కుమార్ రాజా అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి సి. మహేష్ ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి వి.నాగరాజులు మాట్లాడుతూ గత నాలుగేళ్లుగా ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు విడుదల చేస్తూ వాటిని ఇతర సంక్షేమ పథకాలకు మళ్లించి దళిత గిరిజనులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అన్యాయం చేస్తున్నాయన్నారు. భూమిలేని, ఉండడానికి కనీసం స్థలంలేని దళితులకు ఈ నిధులు ఉపయోగపడే విధంగా రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసేవన్నారు. కూటమి ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధుల గురించి మాట్లాడక పోవడం చాలా దురదృష్టకరమన్నారు. కోనేరు రంగారావు సిఫారస్‌లను అమలు చేయాలని కోరారు. బిజెపి ప్రభుత్వం దళితుల పట్ల గిరిజనుల పట్ల చాలా దుర్మార్గంగా ప్రవర్తిస్తా ఉందని విమర్శించారు. అయితే గత నాలుగు సంవత్సరముల నుంచి కూడా ఎన్ఎస్ఎఫ్డీసీ స్కీముకు సంబంధించిన నిధులను విడుదల చేయడం లేదన్నారు. ఎస్సీఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు విడుదల చేయని పక్షంలో భవిష్యత్తులో దళిత ,గిరిజన, ప్రజా సంఘాలను కలుపుకొని ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షులు ఎస్.రామచంద్ర, కోశాధికారి సి.కుమార్, అశోక్ జిల్లా ఉపాధ్యక్షురాలు కోటమ్మ, నల్లన, అంజి, రమేష్, శీను, ఏసన్న, వై.నాగరాజు పాల్గొన్నారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడండి : జిల్లా కలెక్టర్

విశాలాంధ్ర - క్రిష్ణగిరి: ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని కర్నూలు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి అన్నారు. మండల కేంద్రంలో సర్పంచ్ వరలక్ష్మి అధ్యక్షతన జరిగిన స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ ఉన్నత పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఆంధ్ర రాష్ట్రాన్ని స్వర్ణాంధ్ర రాష్ట్రంగా మార్చాలని ముఖ్యమంత్రి ముఖ్య ఉద్దేశం అన్నారు. పరిసరాలు పరిశుభ్రతతో పాటు ఇల్లు వ్యక్తిగత పరిశుభ్రత ప్రాముఖ్యమైనది అన్నారు. జిల్లాలో అటవీ విస్తీర్ణత ఏడు శాతం మాత్రమే ఉందని, 50శాతానికి పెంచాలని ఆమె తెలిపారు. ప్లాంటేషన్ డ్రైవ్ కింద ఐదు వేల మొక్కలు నాటించారు. అదనంగా మరో 5 వేల మొక్కలు నాటిస్తామన్నారు. పచ్చదనం ఉంటే కాలుష్యం తగ్గుతుంది పరిసరాలు పరిశుభ్రత లేకపోతే డయేరియా, డెంగు మలేరియా వ్యాధులు వస్తాయన్నారు. గ్రామంలో తడి చెత్తను పొడి చెత్తను వేరు చేసి, కేంద్రాల్లో ఉంచాలన్నారు. వర్మి కంపోస్టు తయారై వ్యవసాయానికి పని కొస్తుందన్నారు. అందరూ ప్లాస్టిక్ వాడకం తగ్గించి జ్యూట్ బ్యాగులు స్టీల్ బాటిల్ వాడాలన్నారు.

ప్రోటోకాల్ పాటించడంలో నిర్లక్ష్యం : క్రిష్ణగిరిలో జరిగిన స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ప్రోటోకాల్ పాటించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని జెడ్పిటిసి కేఈ సుభాషిని ఆవేదన వ్యక్తం చేశారు. జడ్పిటిసిని స్టేజ్ మీదకి పిలవడంలో ఆలస్యం చేసి, అవమానించారని ఆమె అన్నారు. మహిళలను అవమానించడమే కూటమి ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని ఆమె విమర్శించారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు విద్యార్థినీలు

విశాలాంధ్ర - నందవరం: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినీలు క్రీడలలో ప్రతిభచాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయులు రామకృష్ణంరాజు తెలిపారు. శనివారం పాఠశాల ఆవరణంలో జరిగిన అభినందన కార్యక్రమంలో మాట్లిడుతూ అండర్ -19 ఫుట్ బాల్ విభాగంలో యు.పూజ, జ్యోతి అండర్-17 ఖట్కా క్రీడా విభాగంలో అప్సనా విద్యార్థినీలు ఎంపికయ్యారన్నారు. వీరు ఎమ్మిగనూరులో ఈనెల 23,24 తేదీలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో పీడీలు, ఉపాధ్యాయులు పాల్గోన్నారు.

22న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : సెప్టెంబర్ 22 వ తేదీ సోమవారం ఉదయం 10 గంటలకు కర్నూలు కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుండి వినతులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో, మునిసిపల్ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అర్జీదారులు తమ దరఖాస్తు పరిష్కారం కాకున్నా, పరిష్కారం ఏ దశలో ఉందో సమాచారం తెలుసుకోవడం కోసం కాల్ సెంటర్ నంబర్ 1100కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అర్జీదారులు వెబ్‌సైట్‌లో వారి అర్జీలు నమోదు చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు.

జియో టవర్‌లో ఆరు బ్యాటరీలు చోరీ

విశాలాంధ్ర -ఆలూరు: హొళగుంద మండలం చిన్నహ్యాట గ్రామంలో జియో టవర్‌లో నిల్వ పెట్టిన ఆరు బ్యాటరీలను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. శనివారం తెల్లవారుజామున చోటు చేసుకున్న ఈ సంఘటన గ్రామానికి జియో టవర్ విద్యుత్తు సరఫరా చేసే బ్యాటరీలు ఉపయోగించే ఆరు బ్యాటరీలను దొంగలు అపహరించారు. వీటి మొత్తం విలువ సుమారు రూ.60 వేలు ఉన్నట్లు అంచనా వేశారు. ఈ బ్యాటరీలు గ్రామ సెల్ టవర్లకు విద్యుత్ పంపిణీలో కీలకమైన పాత్ర పోషిస్తున్నాయి. విలువైన బ్యాటరీలను దొంగలు ఎత్తుకెళ్లారు. టెక్నికల్ శివ సాధారణ వీధుల్లో భాగంగా సెంట్ అవర్ రూమును చూడగా బ్యాటరీలు లేవని, తెలియగానే వెంటనే పోలీస్ స్టేషన్లో టెక్నికల్ శివా ఫిర్యాదు చేయగా కర్నూల్ నుండి క్లూస్ టీం వచ్చి వేలు ముద్రలను సేకరించింది. టెక్నికల్ శివ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ దిలీప్ కుమార్ తెలిపారు. స్థానిక సీసీటీవీలను పరిశీలించి, నిందితుల వివరాలు గుర్తించేందుకు పోలీసులు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వైసీపీ అసత్య ప్రచారాలను రైతులు నమ్మరు

విశాలాంధ్ర-గూడూరు: ఉల్లి రైతుల విషయంలో వైసిపి అసత్య ప్రచారాలు మొదలు పెట్టిందని రైతులు నమ్మే పరిస్థితుల్లో లేరని గూడూరు మండల టిడిపి కన్వీనర్ జె.సురేష్ అన్నారు. టిడిపి అధిష్టానం ఆదేశాల మేరకు శనివారం మండలంలోని కె.నాగలాపురంలో రైతులతో సమావేశమై విలేకరులతో మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం ఎల్లప్పుడు రైతులకు అండగా ఉంటుందని వారి ఆర్థిక అభివృద్ధికి అనేక సంక్షేమలను తీసుకువచ్చిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కిందని అన్నారు. ఉల్లికి మద్దతు ధర రూ.1200 ప్రకటించడంతో పాటు పంట నమోదు చేసుకున్న రైతులందరకి ప్రతి హెక్టార్కు రూ.50 వేల చొప్పున కూటమి ప్రభుత్వం ప్రకటించడం శుభ పరిణామమని అన్నారు. తప్పుడు ప్రచారాలతో వైసిపికి రానున్న రోజుల్లో 11 సీట్లు కూడా రావని ఎద్దేవ చేశారు. బూత్ స్థాయి ఇంచార్జీలు, గ్రామ కమిటీ అధ్యక్షులు గోపాల్ రెడ్డి, నాగ సుంకన్న, తిరుపాలు, యుగంధర్, వసంత కుమారు, సుంకన్న ఉన్నారు.

జీడీపీ నుంచి నీటిని విడుదల చేసిన ఏఈ

విశాలాంధ్ర - గోనెగండ్ల: గాజులదిన్నె ప్రాజెక్టు దిగువ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జీడీపీ ఏఈ మహమ్మద్ అలీ అన్నారు. శనివారం జీడీపీ ఏఈ మహమ్మద్ అలీ విలేకరులతో మాట్లాడుతూ భారీ వర్షాలు, రావడంతో తుగ్గలి, మద్దికేర, పత్తికొండ, తదితర ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరడంతో గాజులదిన్నె ప్రాజెక్ట్ (దామోదరం సంజీవయ్య సాగర్) నిండుకుండలా మారింది. అల్పపీడనంతో కురుస్తున్న వర్షాలకు గాజులదిన్నె జలాశయంలో 376.54 మిల్లీమీటర్ నీరు వచ్చి చేరడంతో శనివారం మధ్యాహ్నం 4వ, ప్రాజెక్ట్ గేట్ ఎత్తి 500 క్యూసెక్కుల నీటిని, హంద్రీకి విడుదల చేసినట్లు ఏఈ మహమ్మద్ అలీ తెలిపారు. గేట్ ఎత్తడంతో సందర్శకులతో కిటకిట లాడుతున్నారు.

అంగన్వాడీ కార్యకర్తలపై ఆగ్రహం వ్యక్తం చేసిన తహసీల్దార్

విశాలాంధ్ర - ఎమ్మిగనూరు రూరల్ : పిల్లలు లేకపోతే అంగన్వాడీ సెంటర్‌లో కార్యకర్తలకు పని లేదు కదా అని, అలాంటప్పుడు సెంటర్ ఎందుకు అంటూ తహసీల్దార్ కె.శ్రీనివాసులు ఆగ్రహ వ్యక్తం చేశారు. శనివారం కనకవీడులో గ్రామంలో అంగన్వాడీ సెంటర్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎంతో శుభ్రంగా ఉండాల్సిన అంగన్వాడీ సెంటర్లు అధ్వానంగా ఉన్నావని, సెంటర్లో పిల్లలు లేనిపక్షంలో సెంటర్ అవసరం లేదని కదా అని టీచర్ల పైన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం నుంచి వచ్చే సొమ్ము నెల జీతం తీసుకుంటూ ఉంటారు కదా పసిపిల్లపై ఇంత నిర్లక్ష్యమా, మెమో జారీ చేస్తానని హెచ్చరించారు. మరోసారి జరిగితే జిల్లా పీడీకి నివేదిన అందిస్తానన్నారు. స్టాక్ లేకపోవడంతో ఎక్కడ పోయిందని అడగ్గా, సరైన సమాధానం ఇవ్వలేక కార్యకర్తలు నీళ్లు నమిలారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

పురస్కారాల కోసం దరఖాస్తుల గడువు పొడిగింపు

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : నేషనల్ హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, యునైటెడ్ కన్స్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ అండ్ లీగల్ రైట్స్ ఫౌండేషన్, అసోసియేషన్ ఆఫ్ అలియన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్, లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూల్ మెల్విన్ జోన్స్, నైస్ యూత్ ఫర్ కల్చర్ అండ్ ఎడ్యుకేషన్ స్వచ్ఛంద సేవా సంస్థలు సంయుక్తంగా అందజేయనున్న సేవా పురస్కారాల కోసం దరఖాస్తుల స్వీకరణ గడువును ఈ నెల 24వరకు పొడిగించినట్లు నిర్వాహకులు లయన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయులు, అధ్యాపకులు, సమాజ సేవా కార్యకర్తలు ఈ నెల 24లోగా తమ బయోడేటా, సేవా కార్యక్రమాల వివరాలు, ఫోటోగ్రాఫ్, ప్రెస్ కటింగ్‌లతో దరఖాస్తులను వెంకటరమణ కాలనీలో నైస్ కంప్యూటర్స్ కార్యా లయంలో అందజేయాలని లేదా 9396861308 నెంబర్‌కు వాట్సప్ ద్వారా పీడీఎఫ్ రూపంలో పంపించాలని కోరారు. అక్టోబర్ 5న సెంట్రల్ లైబ్రరీ సమావేశ భవనంలో జరిగే కార్యక్రమంలో ఎంపికైన వారికి ప్రముఖులు అవార్డుల ను ప్రధానం చేయనున్నట్లు ఆయన తెలిపారు.

ప్రైవేటీకరణ చేసే ఆలోచనను విరమించుకోవాలి

విశాలాంధ్ర-పత్తికొండ: కూటమి ప్రభుత్వం వైద్య విద్యను ప్రైవేటీకరణ చేసే ఆలోచనను విరమించుకోవాలని ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు హనుమేష్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక చదువుల రామయ్య భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేద, మధ్యతరగతి విద్యార్థులకు వైద్య విద్యను అందని ద్రాక్షలా చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రైవేట్ పరం చేసేందుకు పూనుకోవడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. ఎన్నికల ప్రచారంలో విద్యార్థులు, యువకులకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఏఐవైఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఉపేంద్ర, అల్తాఫ్, నాయకులు పెద్దయ్య, రవి, రమేష్, మహమ్మద్, దేవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ సీనియర్ నాయకుడిని పరామర్శించిన ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి

విశాలాంధ్ర - నంద వరం: పూలచింత గ్రామానికి చెందిన వైసీపీ సీనియర్ నాయ కులు సురేష్ గౌడ్ మాతృమూర్తి జె.పార్వ తమ్మ గురువారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైసీపీ తాలూకు సీనియర్ నాయకులు ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి శనివారం పూలచింతలోని సురేష్ గౌడ్ స్వగృహానికి వెళ్లి చిత్రపటానికి పూలమాలు వేసి, నివాళులర్పించారు. ఎర్రకోట మాట్లాడుతూ ఆమె సజ్జనస్వభావం, ప్రేమాభిమానాలు, సేవా భావం ఎల్లప్పుడూ గ్రామ ప్రజలకు ఆదర్శంగా నిలుస్తాయని, పార్వతమ్మ మరణం కుటుంబానికి బాధాకరమైన విషయమన్నారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని, ఈ క్లిష్ట సమయంలో భగవంతుడు సురేష్ గౌడుకు ధైర్యం ప్రసాదించాలని, కుటుంబ పరంగా ఎల్లపుడు అందుబా టులో ఉంటామన్నారు. వైసీపీ నాయకులు గడ్డం నారాయణ రెడ్డి ఉన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ప్రజారోగ్యం

విశాలాంధ్ర - సి.బెళగల్: పరిసరాల పరిశుభ్రత ఉంటేనే ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారని ఏవో శ్రీనివాసులు అన్నారు. శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛ్, ఆంధ్రలో భాగంగా ప్రతినెల మూడో శనివారం నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో అధికారులు మండల అభివృద్ధి కార్యాలయం నుండి బస్టాండు వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం మాట్లాడుతూ మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర ప్రోగ్రాం ఆ గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో కలిసి మొక్కలు పెంచడం వలన ప్రకృతి పచ్చదనం ప్రాముఖ్యతను అవగాహన కల్పించే కార్యక్రమాలు గ్రామాల్లో నిర్వహించడం జరిగింది అలాగే సి బెలగల్ లో బస్టాండ్ ఆవరణంలో ర్యాలీ అనంతరం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బాధ్యతతో మీ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు మొక్కలను పెంచాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులతో పాటు సచివాలయ సిబ్బంది. ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉల్లి రైతులకు ఊరట కల్పించిన రాష్ట్ర ప్రభుత్వం

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : ఉల్లి రైతులకు ఊరట కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, జిల్లాలోని ఉల్లి రైతులకు హెక్టారు కు రూ.50 వేల చొప్పున నేరుగా రైతుల బ్యాంక్ అకౌంట్లలో రాష్ట్ర ప్రభుత్వం జమ చేస్తుందని జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య ఓ ప్రకటనలో తెలి పారు. సోమవారం నుండి రూ.1200లు మద్దతు ధర అమలులో ఉండదని, రైతులు కళ్ళల్లో, లోకల్ ట్రేడర్స్ దగ్గర, ఇతర మార్కెట్లల్లో కాని, తమ ఉల్లి పంటకు ఎక్కడ మంచి ధర వస్తే అక్కడ అమ్ముకోవచ్చని జేసీ తెలిపారు. మార్కెట్ యార్డ్‌లో అమ్ముడు పోని ఉల్లిని రైతులు తీసుకువెళ్లి ఎక్కడైనా అమ్ముకోవచ్చన్నారు. భారీ వర్షాలు లేదా వరదలు వస్తే విపత్తు సాయంగా హెక్టార్‌కు రూ.25 వేలు మాత్రమే మంజూరు చేయడం జరిగేదని, ప్రస్తుతం ఉల్లి రైతులను ఆదుకోవాలనే ఉద్దేశంతో ముఖ్య మంత్రి రెట్టింపు మొత్తంతో హెక్టార్‌కు రూ.50 వేల ఆర్థిక సహాయాన్ని ప్రకటించారన్నారు. సోమవారం నుండి మార్కెట్ యార్డ్‌లో ఉల్లి క్రయవిక్రయాలు ట్రేడర్స్ ద్వారా జరుగుతాయని, పీడీపీఎస్ సిస్టం అమలులో ఉండదని, మార్క్ ఫెడ్ ద్వారా కొనుగోలు జరగవన్నారు. ఆదివారం కర్నూలు మార్కెట్ యార్డ్‌కు సెలవని, రైతులు ఈ విషయాన్ని గమనించి, మార్కెట్ యార్డ్‌కు ఉల్లి తీసుకురావద్దని జేసీ తెలిపారు.

ఉల్లి రైతులను ఆదుకున్న కూటమి ప్రభుత్వం

విశాలాంధ్ర - క్రిష్ణగిరి: కూటమి ప్రభుత్వం రైతుల పక్షంగా నిలబడి ఉల్లి రైతులకు నష్ట పరిహారాన్ని మంజూరు చేసినట్లు పత్తికొండ మార్కెట్ యార్డ్ చైర్మన్ నబి సాహెబ్ అన్నారు. శనివారం మండల కేంద్రమైన క్రిష్ణగిరిలో ఆయన పాత్రికేయులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఉల్లి రైతుల బాధలను గుర్తించి హెక్టర్‌కు రూ.50వేలు నష్ట పరిహాన్ని ప్రకటించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అన్నదాత సుఖీభవ పథకం అమలు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికి ఉందన్నారు. డ్రిప్పు ద్వారా రైతులు పంట సాగు చేసుకునేందుకు 10 ఎకరాలకు సబ్సిడీ ద్వారా ఇస్తుందన్నారు. టమోటా పంటకు నష్టపరిహారాన్ని అందించాలని ఆయన కోరారు. గత వైసిపి ప్రభుత్వం నష్టపరిహారం, మద్దతుధర, సబ్సిడీ ఇవ్వకుండా రైతులను మోసం చేసి నట్టేట ముంచి రోడ్డున పడేసిందన్నారు. అనంతరం మండల అధ్యక్షులు దామోదర్ నాయుడు మాట్లాడుతూ ఏడాది కాలంలోనే మండలాన్ని కూటమి ప్రభుత్వం అభివృద్ధి చేసి చూపించిందన్నారు. రైతు సంక్షేమాన్ని కాపాడి వారి శ్రేయస్సును కోరే మన ముఖ్యమంత్రికి ప్రత్యేకమైన ధన్యవాదాలు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మర్రి శ్రీరాములు, కార్యదర్శి గురుస్వామి, సోమలింగడు, చక్రపాణి నరసింహయ్య తదితరులు పాల్గొన్నారు.

బైక్‌ల బాగోతంలో కానిస్టేబుల్ సస్పెన్షన్

విశాలాంధ్ర - కోడుమూరు: స్థానిక పోలీసు స్టేషన్‌లో బైక్‌లు మాయమైన ఘటన కలకలం రేపింది. బైక్‌లను అమ్ముకొని సొమ్ము చేసుకున్నడనే ఆరోపణలపై జగదీష్ అనే కానిస్టేబుల్‌పై సస్పెన్షన్ వేటు పడింది. కోడుమూరు సీఐ తబ్రేజ్ తెలిపిన మేరకు వివరాలు వివిధ కేసుల్లో పట్టుబడి స్టేషన్ ఆవరణలో ఉంచిన బైకులను పోలీస్ స్టేషన్ సిబ్బంది జగదీష్, పట్టణానికి చెందిన కొందరు వ్యక్తులకు అమ్ముకున్నట్లు తెలిసింది. అయితే ఈ ఘటనపై గత మూడు రోజుల నుంచి శాఖాపరమైన విచారణ చేపట్టరు. కానిస్టేబుల్ అమ్మిన బైకుల యజమానులు, వాటి వివరాలు సేకరించి, పూర్తి నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు పంపించారు. దీంతో జిల్లా ఉన్నతాధికారులు కానిస్టేబుల్ జగదీష్‌పై సస్పెన్షన్ వేటు వేశారు. కాగా కానిస్టేబుల్ జగదీష్ అమ్మిన 5 బైకులను కొన్న వారి వద్ద నుంచి రికవరీ చేసినట్లు ఆయన తెలిపారు. బైకులు అమ్మిన వ్యవహారంపై తదుపరి దర్యాప్తు కొనసాగుతుందని ఆయన తెలిపారు.

ఘనంగా జాతీయ షూటింగ్ బాల్ క్రీడా దినోత్సవం

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్ : జాతీయ షూటింగ్ బాల్ క్రీడా దినోత్సవం సందర్భంగా కర్నూలు పట్టణంలోని డిస్టిక్ స్పోర్ట్స్ అథారిటీ అవుట్డోర్ స్టేడియంలో నిర్వహించిన ఆహ్వానిత షూటింగ్ బాల్ పోటీలకు ముఖ్యఅతిథిగా డాక్టర్ కెవి సుబ్బారెడ్డి విద్యాసంస్థల అధినేత డాక్టర్ కెవి సుబ్బారెడ్డి హాజరై పోటీలను ప్రారంభించి, అనంతరం క్రీడాకారులను ఉద్దేశించే ప్రసంగిస్తూ తాను ప్రతిపక్కల క్రీడాకారులని ప్రోత్సహించడానికి ఎల్లప్పుడూ సిద్ధమేనని చదువుతోపాటు క్రీడలు కూడా ఎంతో ప్రాధాన్యత కల్పించాలని ప్రభుత్వం ఇచ్చే రాయితీని సక్రమంగా వాడుకోవాలని గుర్తింపు క్రీడలను ఇష్టంగా ఆడి అందులో విజయం సాధించే విధంగా కృషి చేయాలని తెలిపారు. అన్ని క్రీడలతో పాటు షూటింగ్ బాల్ కూడా అభివృద్ధి చేసే విధంగా అసోసియేషన్ చేసే కార్యక్రమాలు నిజంగా అభినందించదగ్గ విషయం అన్నారు. షూటింగ్ బాల్ క్రీడ అభివృద్ధికి కృషి చేస్తున్న పరుశ రాముడిని ప్రత్యేకంగా అభినందించారు. ఆంధ్ర ప్రదేశ్ షూటింగ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పరుశ రాముడు, కర్నూలు జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు రామాంజనేయులు, కర్నూలు జిల్లా స్కూల్ గేమ్స్ నిర్వాహకార్యదర్శి రాఘవేంద్ర, సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు సుభాన్ బాష, ప్రభాకర్, కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

సీఎంను కలిసిన ఎమ్మెల్సీ బీటీ నాయుడు

విశాలాంధ్ర-ఆదోని: ఆంధ్ర ప్రదేశ్ శాసనమండలి ప్రివిలేజ్ కమిటీ చైర్మన్‌గా ఎమ్మెల్సీ బీటీ నాయుడును నియమించడంతో శనివారం ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నివాసంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ బీటీ నాయుడు మాట్లాడుతూ ఏపీ శాసనమండలి ప్రివిలేజ్ కమిటీ చైర్మన్‌గా నియమించడంతో శాసనమండలి సభ్యుల గౌరవాన్ని కాపాడేందుకు సమర్థవంతమైన విధానాలను అనుసరిస్తానని అన్నారు. టీడీపీ నమ్ముకొని పార్టీ కోసం అహర్నిశలు పాటుపడితే కార్యకర్తలకు అందలమెక్కిచ్చే పార్టీనని అన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా సూపర్ సిక్స్ సూపర్ హిట్ పథకాలను అమలు చేస్తూ, ప్రజల నమ్మకంతో పాటు రాష్ట్ర అభివృద్ధికి సీఎం చంద్రబాబు నాయుడు అహర్నిశలు కృషి చేస్తున్నారని తెలిపారు. పార్టీనీ నమ్ముకున్నందుకు రెండుసార్లు ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చి, రెండుసార్లు ఎంపీగా, రాష్ట్రస్థాయి పదవులను, కర్నూలు జిల్లా అధ్యక్షుడిగా అవకాశం కల్పించడం జరిగిందని గుర్తు చేసుకున్నారు.

మట్కా బీటర్లు అరెస్టు..

విశాలాంధ్ర - మంత్రాలయం: మండలంలోని మాధవరం పోలీస్ స్టేషన్ పరిధిలో లచ్చుమారి గ్రామానికి చెందిన పింజారి నవాబు, బోయ ఈరన్న, బోయ నర్సిరెడ్డిలు మట్కా నిర్వహిస్తుండగా సమాచారం అందుకున్న మాధవరం ఎస్సై విజయ్ కుమార్ తన సిబ్బందితో కలిసి దాడిచేసి వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి దగ్గర నుంచి రూ.38,450 నగదు, మూడు సెల్ ఫోన్లు స్వాధీన పరుచుకొని, కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మొక్కలు నాటుదాం.. కాలుష్యాన్ని నిర్మూలిద్దం

విశాలాంధ్ర -చిప్పగిరి: మొక్కలు నాటుదాం వాతావరణ కాలుష్యం నిర్మూలిద్దాం అని చిప్పగిరి గ్రామ సర్పంచ్ దాసరి గోవిందరాజులు అన్నారు. శనివారం స్వచ్ఛభారత్ స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా మండల హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ కృష్ణ కుమార్ ఆధ్వర్యంలో స్థానిక గృహ నిర్మాణ కార్యాలయం వద్ద మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు.

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్టు : సీఐ

విశాలాంధ్ర -గోనెగండ్ల: ద్విచక్ర వాహనాల దొంగను పట్టుకొని సీఐ ఒ.విజయ భాస్కర్ అరెస్టు చేశారు. శనివారం సాయంత్రం పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరులతో సీఐ మాట్లాడుతూ గాజులదిన్నె ప్రాజెక్ట్ క్రాస్ రోడ్ దగ్గర ద్విచక్ర వాహనాల తనిఖీలో ఉప్పరి వీరేష్ పోల్ కల్ గ్రామానికి చెందిన బైక్ తీసుకొని ఎమ్మిగనూరు వెళుతున్నాడు. బైక్ మోటర్‌కు ఆర్‌సి, లైసెన్స్ లేనందున ద్విచక్ర వాహనం తిసుకొని పోలీసు స్టేషన్ తీసుకొని వచ్చి విచారించగా, మరో మూడు ద్విచక్ర వాహనాలు వెలుగులోకి వచ్చాయి. తాను దొంగతనం చేశాను ఉప్పరి వీరేష్ ఒప్పుకున్నాడని, ఉప్పరి వీరేష్ వద్ద ఉన్న రూ.5 లక్షలు విలువ చేసే నాలుగు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడు జేసిపి డ్రైవర్‌గా పని చేసేవాడని, నిందితుడు నిత్యం మద్యం, పేకాట, జూదం, తదితర చెడు అలవాట్లు బానిసైనట్లు సీఐ తెలిపారు. కూలీ పనుల నుండి వచ్చే ఆదాయం తన జల్సాలకు, ఖర్చులకు సరిపోయేవి కావని, ఎలాగైనా సులువుగా డబ్బులు సంపాదించాలని నిర్ణయించుకొని మోటార్ బైక్‌లను, దొంగిలించడం చాలా సులభమని దొంగతనాలకు పాల్పడుతున్నట్లు ఆయన తెలిపారు.

విశాలాంధ్ర కర్నూలు/నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, ఆదివారం 21, సెప్టెంబర్ 2025

కొత్తపేట గ్రామంలో స్వర్ణ ఆంధ్ర.. స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం

విశాలాంధ్ర - బనగానపల్లె: మన ఇంటిని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పర్యావరణాన్ని కాపాడవచ్చునని రాష్ట్ర రోడ్లు భవనాలు పెట్టుబడులు శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి అన్నారు. మండలంలోని ఇల్లూరు కొత్తపేట గ్రామంలో అధికారులు నిర్వహించిన స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, గ్రామ ప్రజలతో కలిసి మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి మొక్కలు నాటారు. మంత్రి, ఉపాధ్యాయులు విద్యార్థులు, కూటమినేతలు , ప్రజలు ర్యాలీలో పాల్గొని స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేశారు. అనంతరం మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ప్రతీ మూడో శనివారం స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం విజయవంతంగా నిర్వహిస్తున్నామన్నారు. చాలా మంది చెత్తను తీసుకొచ్చి, ఇండ్ల బయట, రోడ్ల మీద వేయడం వల్ల వర్షాకాలం కావడంతో అపరిశుభ్రతతో అంటు వ్యాధులు ప్రబలి అనారోగ్యం పాలవుతున్న పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ప్లాస్టిక్ రహితంగా రాష్ట్రాన్ని మార్చాలన్న ఆలోచనలో భాగంగా బనగానపల్లెను ప్లాస్టిక్ రహితంగా మార్చేందుకు తన సతీమణి బీసీ ఇందిరా రెడ్డి కంకణం కట్టుకుని పని చేస్తుందన్నారు. ప్రతి ఒక్కరు మొక్కను నాటి సంరక్షించేందుకు తన వంతుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం గ్రామంలోని ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ డిఈ నాగ శ్రీనివాసులు, ఎంపీడీవో నాగరాజు, మండల స్పెషల్ ఆఫీసర్ చంద్రశేఖర్ రెడ్డి, ఏఈ వెంకటరమణ, ఏవో సుబ్బారెడ్డి, మంత్రి పిఏలు మురళీమోహన్ రెడ్డి, రామ లింగారెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, కళ్యాణి, సీఐ ప్రవీణ్ కుమార్, మాజీ సర్పంచ్ రామిరెడ్డి, మనోహర్ రెడ్డి,ఎంపిటిసి బాల నాయుడు, శెట్ల శేఖర్, రామ్మోహన్ రెడ్డి, కురువం రామ మద్దిలేటి రెడ్డి, మదన్మోహన్ రెడ్డి, మనోహర్ రెడ్డి, గోధుల సుదర్శన్, రామచంద్రుడు, చాంద్ బాష గ్రామ సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రవీంద్ర పాఠశాలలో ఘనంగా దసరా ఉత్సవం

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్ : స్థానిక అబ్బాస్ నగర్ లోని రవీంద్ర పాఠశాలలో విజయదశమి పర్వదినాన్ని వివిధ పూలతో, రంగు రంగుల అలంకరణలతో కళకళలాడగా, విద్యార్థులు, ఉపాధ్యాయులు సంప్రదాయ వస్త్రధారణలో పాల్గొని ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. రవీంద్ర విద్యా సంస్థల వ్యవస్థాపకులు జి.పుల్లయ్య అకాడమిక్ అడ్వైజర్ డాక్టర్ మమతా మోహన్ వైస్ చైర్మన్ జి.వంశీధర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రవీంద్ర విద్యా సంస్థల వ్యవస్థాపకులు జి.పుల్లయ్య విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ మన పండుగలు మన ప్రాచీన సాంప్రదాయాలను గుర్తుచేస్తాయని, ప్రతి పండుగకు పురాణ చరిత్ర తప్పక ఉంటుందన్నారు. దసరా ఉత్సవం మనలోని చెడు అలవాట్లను తొలగించి, సత్ప్రవర్తనకు మార్గం చూపే విజయాల దశమి మన విజయదశమి అని తెలిపారు. పాఠశాల సమన్వయ కర్తలు సౌమ్య, జ్యోతిర్మయి, ఉపాధ్యాయులు సృష్టించారు.

క్రమశిక్షణ గల యువత దేశానికి అవసరం

విశాలాంధ్ర - బనగానపల్లె: క్రమశిక్షణ గల యువత దేశానికి అవసరమని కర్నూలు ఎన్సిసి గ్రూప్ కమాండర్ అలోక్ త్రిపాఠి అన్నారు. పట్టణంలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలను వన్ ఆంధ్ర మెడికల్ కంపెనీ విభాగంలోని 145వ జూనియర్ డివిజన్ విభాగమును కర్నూల్ ఎన్సిసి గ్రూప్ కమాండర్ కల్నల్ అలోక్ త్రిపాఠి సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సిపి చీఫ్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, వన్ ఆంధ్ర మెడికల్ కమాండింగ్ ఆఫీసర్ మేజర్ వైవిసికే రెడ్డి, 28 ఆంధ్ర బెటాలియన్ ఆడం ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ శశి కుమార్, హవల్దార్ రవి, పాఠశాల ఉపాధ్యాయులు వేణుగోపాల్, సురేష్ కుమార్ రెడ్డి, వెంకట్ రెడ్డి, ఇబ్రహీం, మహమ్మద్, రఫీలు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బండి జయరాజు కుటుంబాన్ని పరామర్శించిన మాండ్ర

విశాలాంధ్ర - నందికొట్కూరు: నియోజవర్గ పరిధిలోని పగిడ్యాల మండలం నెహ్రూనగర్ గ్రామంలో నియోజకవర్గ సీనియర్ టీడిపి నాయకులు బండి జయరాజు తల్లి ఇటీవల మరణించడం జరిగింది. విషయం తెలుసుకున్న టీడిపి నంద్యాల పార్లమెంట్ ఇంచార్జ్ మాండ్ర శివానందరెడ్డి, ఎమ్మెల్యే జయ సూర్య వారి స్వగ్రామానికి వెళ్లి బండి భాగ్యమ్మ చిత్రపటానికి నివాళులు అర్పించి వారి కుటుంబాన్ని పరామర్శించడం జరిగింది. వీరితోపాటు నందికొట్కూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ ప్రసాద రెడ్డి పాల్గొన్నారు.

శరన్నవరాత్రి ఉత్సవ పుస్తకావిష్కరణ

విశాలాంధ్ర - చాగలమర్రి: మండలంలోని ముత్యాలపాడు గ్రామంలోని శ్రీ కన్యకా పరమేశ్వరిదేవి ఆలయంలో శనివారం శరన్నవరాత్రి మహోత్సవ పుస్తకావిష్కరణ చేశారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు ముడియం నరసింహరావు, కోశాధికారి మాదవ నరసింహయ్యల ఆధ్వర్యంలో పుస్తకాలను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ఈ నెల 22వ తేదీ నుంచి వచ్చే నెల 4వ తేదీ వరకు దసరా ఉత్సవాలు నిర్వహిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు ముడియం రామకృష్ణ, మంచికంటి సురేష్, కార్యదర్శి ముడియం గోపాలకృష్ణ, ఉపకార్యదర్శి వెంకటరమేష్‌లు పాల్గొన్నారు.

రెండ్రోజుల జెనరేటీవ్ ఏఐ బూటా క్యాంప్

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ ఆధ్వర్యంలో ఆశోక మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో సెప్టెంబర్ రెండు రోజుల జెనరేటివ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విజయవంతంగా నిర్వహించబడింది. ఈ శిబిరంలో విద్యార్థులకు కొత్త తరం కృత్రిమ మేధస్సు సాంకేతికతలు పరిచయం చేసి, వాటిని ఎలా ఉపయోగించుకోవాలో ప్రాయోగిక శిక్షణ ఇచ్చారు. జెనరేటివ్ ఏఐ మౌలికాలు, ఎల్ఎల్ఎంల పని విధానం, ప్రాంప్ట్ ఇంజినీరింగ్, విభిన్న రంగాల్లో వినియోగాలు వంటి అంశాలను టీసీఎస్ నిపుణులు విద్యార్థులకు వివరించారు. క్యాంప్లో భాగంగా లైవ్ డెమోలు, ఇంటరాక్టివ్ సెషన్లు, కోడింగ్ ప్రాక్టీస్ నిర్వహించడం ద్వారా విద్యార్థులు ప్రత్యక్ష అనుభవాన్ని పొందారు, అదనంగా, ఆరోగ్యం, ఆర్థిక రంగం, విద్య, సాఫ్ట్‌వేర్ అభివృద్ధి వంటి విభాగాల్లో ఏఐ ప్రాముఖ్యతపై చర్చించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఇలాంటి శిక్షణా కార్యక్రమాలు విద్యార్థులను భవిష్యత్ పరిశ్రమ అవసరాలకు సిద్ధం చేస్తాయి అన్నారు. విద్యార్థులు తమ ప్రాజెక్టులు, పరిశోధనలలో ఏఐ వినియోగంపై విశ్వాసం పెరిగిందని తెలిపారు.

మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ గడపలో సంబరాలు

విశాలాంధ్ర - ఆదోని రూరల్: నూతనంగా మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్‌గా ఎన్నికైన ఆదూరి విజయకృష్ణకు తన నివాసంలో బిజెపి నాయకులు రమాకాంత్, శ్రీనివాస ఆచారి, చంద్ర, నాయకులు వాల్మీకి సాయి ప్రసాద్, జిందే సాయి కుమార్, సాకరే రాఘవేంద్ర, ధను, రసూల్, ఎమ్మార్పీఎస్ నాయకులు అనిల్, రవి, కేశవ్, శంకర్, నరసింహులు, కాశి తదితరులు శాలువా కప్పి పూలమాలతో ఘనంగా సన్మానం చేసి మిఠాయిలు పంచుకుని సంబరాలు చేసుకున్నారు. ముందుగా ఇంటి ముందు టపాసులు పెల్చారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డ్ నూతన వైస్ చైర్మన్ ఆదూరి విజయ్ కృష్ణ మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనలో నిర్వీర్యమైన మార్కెట్ యార్డ్ వ్యవస్థను పునరుద్ధరిస్తామని, రైతులకు న్యాయం జరిగేలా చర్యలు చేపడుతమన్నారు. అడ్డుకున్న వ్యవసాయ మార్కెట్ యార్డ్ అభివృద్ధి పూర్తి చేసేలా మార్కెట్ యార్డ్ కమిటీ కృషి చేస్తుందని భరోసా ఇచ్చారు. రైతుల కళ్లల్లో ఆనందం కనిపించేలా నిజాయితీగా పని చేస్తామని, మార్కెట్ యార్డును అభివృద్ధి పథంలో నడిపిస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని కల్పించిన శాసనసభ్యులు డాక్టర్ పార్థసారధి వాల్మీకికి, మీనాక్షి నాయుడు, మల్లప్పలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తనతో పాటు కమిటీలో నియమితులైన బిజెపి, తెలుగుదేశం, జనసేన నూతన డైరెక్టర్లకు అభినందనలు తెలిపారు. అనంతరం కిలిచిన పేటలోని పంచయ్య స్వామి ఆశీర్వాదం తీసుకున్నారు.

కాళికామాత నవరాత్రి ఉత్సవాలకు ఆహ్వానం

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ: పట్టణంలోని విశ్వరూప నగర్‌లోని కాళికామాత ఆలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవములు ఈ నెల 22వ తేదీ నుండి ప్రారంభమవుతున్నాయి. ఇందులో భాగంగా నవరాత్రి ఉత్సవాలకు ఆళ్లగడ్డ తాలూకా సీనియర్ నాయకులు భార్గవ రామ్‌ను కాళికామాత ఆలయ కమిటీ విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు ఆహ్వానించారు. ఆయనను కార్యాలయంలో కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ కార్యక్రమంలో కృష్ణమాచారి, భద్రయ్య ఆచారి, సాయన్న ఆచారి, రవి ఆచారి, బాణాల పుల్లయ్య ఆచారి, రామాచారి విశ్వకర్మ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ ఆంధ్రలో భాగస్వాములు కావాలి

విశాలాంధ్ర - నందవరం: స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛంధ్రలో అధికారులు, ప్రజలందరూ భాగస్వామి కావాలని తహసీల్దార్ కె.శ్రీనివాసులు, డిప్యూటీ ఎంపిడిఓ సందీప్‌లు కోరారు. నెలలో మూడో శనివారంలో భాగంగా స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్రను కనకవీడు గ్రామంలో నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఇంటి పరిసరాలు, గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడం వల్ల అందరూ ఆరోగ్యంగా ఉంటారని, పరిశుభ్రత పాటించడం అందరి భాద్యత అన్నారు. గ్రామంలో చెట్లు నాటించడం ద్వారా పచ్చదనం- పరిశుభ్రతలపై గ్రామ ప్రజలందరిచే ప్రతిజ్ఞ చేయించి, ఎంపిపి స్కూల్లో మధ్యాహ్న భోజనం నాణ్యతపై తనిఖీ చేసి, మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. స్కూల్ ఆవరణలో చెట్ల ప్లాంటేషన్ చేసి, విద్యార్థులు గ్రామ ప్రజలు అందరితో పచ్చదనం- పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏవో కృష్ణమూర్తి, ఎంఈఓ రఘునాథ్, ఆర్డబ్ల్యూఎస్ ఏఇ బాలకృష్ణ, ఏపియం రాఘవేంద్ర, ఏపీఓ శ్రీనివాసులు, టిడిపి నాయకులు దబ్బా ఈరన్న, డీలర్లు దుబ్బన్న, నరసింహుడు, మునిస్వామి, హనుమంతు, పంచాయతీ కార్యదర్శి రామారావు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

పెంచికలపాడులో స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర

విశాలాంధ్ర- గూడూరు: మండలంలోని పెంచికలపాడు గ్రామంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, టిడిపి నేతలు స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని చేపట్టారు. శనివారం గ్రామంలోని పలు కాలనీలలో పరిసరాలను కార్మికులచే శుభ్రం చేసి చెత్త చెదాలను తొలగించారు. మాజీ ఎంపిటిసి కృష్ణుడు, ఎంపిటిసి మద్దిలేటి మాట్లాడుతూ అధికారులు ఎప్పటికప్పుడు పరిసరాలను శుభ్రపరిస్తే సీజన్ వ్యాధులు సంభవించవని తద్వారా ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉంటారని గుర్తు చేశారు. అనంతరం గ్రామంలోని పలుచోట్ల చెట్లను నాటి నీరు పోశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు కరణం గిడ్డయ్య, బ్రహ్మయ్య, యుగంధర్, అలీఫ్, భాస్కర్ రెడ్డి, వీఆర్వో కృష్ణ తదితరులు ఉన్నారు.

పచ్చని చెట్లే - ప్రగతికి మెట్లు

విశాలాంధ్ర - కర్నూలు వైద్యశాల: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఇచ్చిన పిలుపుమేరకు కర్నూలు మెడికల్ కళాశాలలో శనివారం ఉదయం స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా గ్రీన్ ఏపీపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్య క్రమాన్ని కర్నూల్ మెడికల్ కాలేజీ యందు శనివారం అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ మరియు ప్రిన్సిపల్ డా కె.చిట్టి నరసమ్మ ఆధ్వర్యంలో ఈ నెల ప్రభుత్వం ఇచ్చిన థీమ్ గ్రీన్ ఏపీకు అనుగుణంగా వివిధ కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పచ్చని చెట్లే ప్రగతికి మెట్లు అనే కార్యక్రమంలో ప్రతి విద్యార్థి కాలేజీలో ఒక మొక్క నాటాలని విద్యార్థులకి పిలుపునిచ్చారు. తాము నాటిన మొక్కలను పర్యవేక్షణ చేయాలని సూచించారు. కాలేజీ చదువులు ముగిశాఖ ఎప్పుడైనా కాలేజీకి వచ్చినపుడు తాము నాటిన మొక్కలు పెరిగి పెద్ద ఆయన చెప్పను చూస్తే వచ్చే సంతోషం చాలా గొప్పగా ఉంటుందని, ప్రతి విద్యార్థి ఆ అనుభూతి చెందాలని కోరారు. రూఫ్ గార్డెన్ గురించి కిచెన్ వేస్ట్ ద్వారా కంపోస్టు తయారీ ఆవశ్యకత గురించి వివరించారు. మొక్కలు నాటడం, విద్యార్థులందరిచే ర్యాలీ చేయించి అనంతరం విద్యార్థులు సిబ్బందిచే గ్రీన్ ఏపీ పై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సాయి సుధీర్, డా.రేణుకా దేవి, డా.సింధియా శుభప్రద, ప్రొఫెసర్ డా.రాజేశ్వరి, ఎన్ఎస్ఎస్ కార్యక్రమ అధికారి అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ అరుణ, అసోసియేట్‌లు డా.రజనీ కాంత్, డా.విజయలక్ష్మి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ ప్రవీణ, డా.నాగార్జున, లెక్చరర్ సురేష్ కుమార్, యూజీ, పిజి వైద్య విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించడం అందరి బాధ్యత

విశాలాంధ్ర - పెద్దకడబూరు: పర్యావరణాన్ని పరిరక్షించడం అందరి సామాజిక బాధ్యతగా గుర్తించుకోవాలని టిడిపి రైతు విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంతరెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని చిన్నతుంబలం, హెచ్.మురవణి, పెద్ద కడబూరు తదితర గ్రామాల్లో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని, మరుగుదొడ్లను ఉపయోంచుకునేలా తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉంటామన్నారు. అనంతరం విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. పాఠశాల, సొసైటీ ఆవరణంలో మొక్కలు నాటారు. మొక్కలు నాటడం వల్ల వాతావరణ కాలుష్యాన్ని నివారించి, సకాలంలో వర్షాలు కురవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉమా రాజేశ్వరమ్మ, సొసైటీ చైర్మన్లు మీసేవ ఆంజనేయ, కందనాతి నరసప్ప, సాగునీటి సంఘం అధ్యక్షులు సత్యన్న గౌడ్, పాఠశాల విద్యాకమిటి చైర్మన్ స్వామి రాజ్, ఏపీఓ చంద్రశేఖర్, ఏపీఎం శ్రీనివాసులు, ఐసీడీఎస్ సూపర్ వైజర్ విజయకుమారి, ఈసీ ఖాదర్ బాష, స్వచ్ఛ భారత్ మండల రిసోర్స్ కో ఆర్డినేటర్ నారాయణ, నాయకులు మల్లికార్జున, వీరేష్ గౌడ్, దాసప్ప రెడ్డి, నర్సింహులు, హనుమంతు, చంద్ర, నాగప్ప, నాగరాజు, బొగ్గుల నరసన్న, ఇమ్మానియేలు, సుధాకర్, సందీప్, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు కాన్సర్‌పై అవగాహన పెంచుకోండి

విశాలాంధ్ర - కర్నూలు వైద్యశాల: క్యాన్సర్ బర్డెన్ రాబోయే కాలంలో దేశంలో అధికమవుతుందని ప్రతి మహిళ క్యాన్సర్ గురించి అవగాహన కలిగి ఉండడం చాలా అవసరమని, దేశ గౌరవ ప్రధాని మోడీ మహిళల కోసం ప్రత్యేకంగా స్వస్త్ నారీ-సశక్త్ పరివార్ అభియాన్ అనే కార్యక్రమం చేపట్టారని, మహిళలని అన్ని రంగాల్లో చైతన్య పరచడం, వ్యాధుల పట్ల అవగాహన కలిగించడం లాంటి కార్యక్రమాలు పొందుపరచారు. ఈ అవగాహన కార్యక్రమం సందర్భంగా అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్, కర్నూలు మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డా.కె.చిట్టి నరసమ్మ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఈమె మాట్లాడుతూ ప్రజల జీవనశైలిలో మార్పులు వచ్చాయని, తీసుకునే ఆహార ఆహార పదార్థాలు హానికర కారకాలతో కూడి వుంటున్నాయని, వివిధ రకాల క్యాన్సర్‌లు వస్తున్నాయని తెలిపారు. కుటుంబంలో మహిళల ఆహారం పదార్థాల విషయంలో అవగాహన పెంచు కోవాలని, ఆరోగ్యం విషయంలో చిన్నపాటి తేడాలు కనిపించిన వెంటనే వైద్యుల సలహాలు తీసుకోవాలని సూచించారు. హాస్పిటల్ వైద్యు లకు, నర్సింగ్ సిబ్బందికి, పారామెడికల్ సిబ్బందికి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించడం జరిగింది. క్యాన్సర్ ఇన్స్టిట్యూట్ డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రకాష్, నోడల్ ఆఫీసర్ డాక్టర్ మాధవి శ్యామల, సిఎస్ఆర్ఎంఓ డాక్టర్ హేమనళిని పాల్గొన్నారు.

శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలకు ఆహ్వానం

విశాలాంధ్ర - బనగానపల్లె: జిల్లాలో ప్రముఖ శక్తి క్షేత్రమైన నందవరం శ్రీ చౌడేశ్వరి దేవి ఆలయంలో దసరా పండుగ సందర్భంగా నిర్వహించే శ్రీదేవి శరన్నవరాత్ర మహోత్సవాలకు రాష్ట్ర రోడ్లు రవాణా, భవనముల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి, జనగానపల్లి పట్టణ మాజీ సర్పంచ్ బిసి రాజారెడ్డిని ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఈ మేరకు ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పివి కుమార్ రెడ్డి, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డిలు శనివారం మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి, మాజీ సర్పంచ్ బీసీరాజా రెడ్డిలను కలిసి శ్రీదేవి శరన్నవరాత్ర మహోత్సవ ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈనెల 22వ తేదీ నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు శ్రీదేవి శరన్న వరాత్ర మహోత్సవాలను ఆలయంలో ఘనంగా నిర్వహిస్తామన్నారు. ఉత్సవాలకు బిసి రాజారెడ్డిని తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పివి కుమార్ రెడ్డి, ఆలయ అర్చకులు ప్రదీప్ స్వామి, టిడిపి నాయకులు నుసి లక్ష్మి రెడ్డి, బోయ వెంగన్న పాల్గొన్నారు.

పురుషుల డిగ్రీ కళాశాలలో స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్ : బి.క్యాంప్‌లోని డాక్టర్స్ కాలనీలో గల ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ నెల థీమ్ గ్రీన్ ఆంధ్ర ప్రదేశ్‌కు అనుగుణంగా కళాశాల ఆవరణలో ప్రిన్సిపాల్ డా.ఎం.ఇందిరా శాంతి ఆధ్వర్యంలో కళాశాల అధ్యాపకులు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు కలసి 46 మొక్కలు నాటారు. మొదట కళాశాల ప్రాంగణంలో ప్లాస్టిక్ కవర్లు, సీసాలు, పేపర్లు వంటి చెత్త సేకరించి, దానిని చెత్త సేకరించే మునిసిపల్ సిబ్బందికి అందజేసి, తదనంతరం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. కళాశాల ప్రాంగణంలోని నూతన భవనాలు, కళాశాల మైదానం ప్రాంతంలో మొక్కలు నాటారు. మిద్దె తోటలు పెంపకంలో భాగంగా కళాశాల భవనం ఉపరితలంలో కుండీలలో పెంచుతున్న మొక్కలకు ఎరువు, నీరు అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్స్ హేమంత్, సత్యనారాయణ, ఎన్ఎస్ఎస్ అధికారులు సోమశేఖర్, రోషన్న, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ ఫక్రున్నిసా బేగం, అకడమిక్ కోఆర్డినేటర్ వెంకటస్వామి, అధ్యాపకులు నాగన్న, మాదన్న, సిప్పీ ఐజాక్, వింధ్యావాసిని దేవి, సుజాత, సాజిదాబీ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు విద్యార్థినీలు

విశాలాంధ్ర - నందవరం: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి నీలు క్రీడలలో ప్రతిభచాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయులు రామ కృష్ణం రాజు తెలిపారు. శనివారం పాఠశాల ఆవరణంలో జరిగిన అభినందన కార్యక్రమంలో మాట్లిడుతూ అండర్ -19 ఫుట్ బాల్ విభాగంలో యు.పూజ, జ్యోతి అండర్-17 ఖట్కా క్రీడా విభాగంలో అప్సనా విద్యార్థినీలు ఎంపికయ్యారన్నారు. వీరు ఎమ్మిగనూరులో ఈనెల 23,24 తేదీలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

పరిసరాల పరిశుభ్రతలో భాగస్వాములు కావాలి

విశాలాంధ్ర -గోనెగండ్ల: పరిసరాల పరిశుభ్రతలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని ఎంపీడీవో మణి మంజరి అన్నారు. శనివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛంధ్ర కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని పలు వీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో దోమలను, నివారించుకోవాలని, ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని నినాదాలు చేస్తూ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ అవగాహన ర్యాలీ కార్యక్రమంలో, జిల్లా మైనారిటీ అధికార ప్రతినిధి బేతాళ బడేసా, సర్పంచ్ పూజారి హైమవతి, అడ్వకేట్ చంద్రశేఖర్, టిడిపి మండల కన్వీనర్ తిరుపతయ్య, టౌన్ ప్రెసిడెంట్ మహేళ రహిమ్ తుల్లా, పంచాయతీ కార్యదర్శి సతీష్ కుమార్, మాజీ సర్పంచ్ రంగముని, అక్బర్, జనసేనా నాయకులు గానిగ బాష, మాలిక్ బాష, కాశీంవలి, కటకం ఉత్తేజ్, బిజెపి నాయకులు గద్వాల రవి, కడపల రమేష్, ఆయా శాఖలకు చెందిన అధికారులు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో స్వచ్ఛంద స్వర్ణాంధ్ర..

విశాలాంధ్ర - పాములపాడు : మండలంలోని జూటూరు గ్రామ పంచాయతీ మజర గ్రామమైన ఆనందాపురం గ్రామం నందు మూడవ శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛ్ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా కంపోస్ట్ పిట్ వనులను మండల స్పెషల్ ఆఫీసర్ రాజు, ఎంపీడీవో చంద్రశేఖర్ శనివారం పరిశీలించారు ఈ పనులపై ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం పాములపాడు మండల పరిషత్ ఆవరణం నందు స్వర్ణాంధ్ర స్వచ్ఛ్ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్, మండల అభివృద్ధి అధికారిగారు, ఏపీఓ, ఈసి, ఎపిఎం, టీఏ, ఎఫ్ఏ, సచివాలయ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

షరీఫ్ నగర్‌లో స్వస్త్ నారీ.. స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం

విశాలాంధ్ర - కర్నూలు వైద్యశాల: నగరంలో శనివారం ఉదయం శరీన్ నగర్‌లో పట్టన ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డెమో శ్రీనివాసులు శెట్టి పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వ్యాధి నిరోధక టీకాల గురించి తల్లులతో మాట్లాడుతూ కొన్ని టీకాలు వేయించినప్పుడు జ్వరం రావడం, నొప్పులు కలగడము ఇవన్నీ సర్వసాధారణమైనవని, రెండు రోజుల్లో జ్వరం తగ్గకుండా వస్తుంటే వైద్యునికి చూపించాలి అని తెలిపారు. వ్యాధి నిరోధక టీకాలు ఎప్పుడు ఇస్తారో, ఎక్కడ ఇస్తారో తెలుసు కోవడానికి ఆరోగ్యకార్యకర్తలకు, ఆశా, అంగన్వాడీ కార్యకర్తలకు సంప్రదించాలని కోరారు. తర్వాత డాక్టర్.చంద్రకళ మాట్లాడుతూ గర్భిణీ మొదలుకొని ఒక సంవత్సరం వయస్సు ఉన్న బిడ్డ తల్లులకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, ఎలాంటి ఆహారము ఇవ్వాలి, ఎలాంటి వైద్య పరీక్షలు చేయించుకోవాలి, బాలింత బిడ్డకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి లాంటి విషయాలపై ఆరోగ్య సలహాలు, సూచనలు, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలన్న సమాచారాన్ని తెలిపే కిల్కారి కాల్స్ మీద అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమములో ఆరోగ్య కార్యకర్తలు బి.కల్యాణి, లక్ష్మీదేవి, వైద్యసిబ్బంది ప్రొజెక్షనిస్ట్ ఖలీల్ పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

విశాలాంధ్ర - ఆత్మకూరు రూరల్: మండల పరిధిలోని కురుకుంద గ్రామంలో స్వచ్ఛ్ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ తులసి దేవి హాజరయ్యారు. ఎస్సీ కార్పొరేషన్ ఈడీ తులసి దేవి, వరదరాజ స్వామి ప్రాజెక్టు చైర్మన్ పోచ మల్లికార్జున రెడ్డి, ఎంపీడీవో ఉమర్, గ్రామ పంచాయతీ కార్యదర్శి జీవన్ మొక్కలు నాటారు. కురుకుంద జడ్‌పిహెచ్ఎస్ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్ వాడవద్దని,పర్యావరణాన్ని కాపాడాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు గ్రామ సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఉన్నతమైన ఆరోగ్యం

విశాలాంధ్ర - పాణ్యం: ఇంటి పరిసరాలను ప్రతి ఒక్కరూ పరిశుభ్రంగా ఉంచుకున్నట్లయితే ఆరోగ్యవంతమైన ఉన్నత జీవనం సాధ్యమని మండల ఎంఈఓ సుబ్రహ్మణ్యం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర ప్రోగ్రాంలో భాగంగా ప్రతినెల మూడో శనివారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామాలలో ప్రోగ్రాం నిర్వహించాలి.అందులో భాగంగా ప్రకృతి పచ్చదనం ప్రాముఖ్యతను, హరితాంధ్రప్రదేశ్‌పై అవగాహన కలిగించే కార్యక్రమాలు నిర్వహించారు. మండల పరిధిలోని మద్దూరు గ్రామంలో శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర ప్రోగ్రాం గ్రామ నోడల్ ఆఫీసర్, ఎంఈఓ సుబ్రహ్మణ్యం అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జయరాం రెడ్డి, సచివాలయ సిబ్బంది, మద్దూర్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు మరియు పాఠశాల సిబ్బంది, సచివాల ఆవరణములో వివిధ రకాలైన పండ్ల మొక్కలు నీడనిచ్చే మొక్కలు నాటడం జరిగింది. తదనంతరం హైస్కూలు విద్యార్థుల ద్వారా ర్యాలీ నిర్వహించడం జరిగినది.

లారీ అసోసియేషన్‌పై వైసీపీ ఆరోపణలు అవాస్తవం

విశాలాంధ్ర-ఆళ్లగడ్డ: లారీ అసోసియేషన్‌పై వైసీపీ నాయకులు చేసిన ఆరోపణలు అవాస్తవమని లారీ అసోసియేషన్ సభ్యులు అన్నారు. శనివారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ వైసీపీ నాయకులు చేస్తున్న అసత్య ప్రచారాలు తప్పు అని, ఇక్కడ ఎవరూ ఎక్కువ డబ్బులు వసూలు చేయడం లేదన్నారు. లారీ అసోసియేషన్‌కి పార్టీలకు, రైతులకు ఎలాంటి సంబంధం లేదన్నారు. గత ప్రభుత్వంలో ఎంతైతే వసూలు చేసారో అంతకంటే తక్కువనే వసూలు చేస్తున్నామని, రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగదని, ఇది కేవలం లారీ అసోసియేషన్ మెయింటెనెన్స్‌కు మాత్రమే తీసుకోవడం జరుగుతుందన్నారు. రాజకీ యాలకు ఎలాంటి సంబంధం లేదని, దీనిపై బురదజల్లే రాజకీయాలు చేయొద్దని తెలిపారు. గత ప్రభుత్వంలో గ్రీన్ టాక్స్ కింద రూ.20 వేలు తీసుకోవడం జరిగిందన్నారు.

సంపాదకీయం

దసరా ఉత్సవాలకు మతం రంగు చెల్లదు

మతంకన్నా సంస్కృతి చాలా విస్తృతమైంది. మతం సంస్కృతిలో భాగం కావొచ్చు కానీ సంస్కృతికన్నా మించిన స్థానం మతానికి ఉండదు. సంస్కృతికి ఒక మతంతో బంధం ఉండొచ్చు. కానీ మతమే సంస్కృతి కాదు. కానీ సంస్కృతీ సంప్రదాయాలకు మతం ముసుగు కప్పి విచ్ఛిన్నం చేసే ప్రయత్నాలు ఈ మధ్య కాలంలో మితిమీరి పోయాయి. సంఘ్ పరివార్, దానికి అనుబంధమైన భారతీయ జనతా పార్టీలది ఈ ధ్వంస రచనలో గురుపీఠం. దీనికి తాజా ఉదాహరణ చూస్తే ఈ పన్నాగాలు రాను రాను ఎంత తీవ్రమవుతున్నాయో, మతాధిపత్యాన్ని సర్వవ్యాప్తం చేసే కుట్రలు జరుగుతున్నాయో తేలిపోతోంది. ఇలాంటి వారికి మతాభినివేశం కన్నా మతతత్వం ఎక్కువ. సంస్కృతి మీది వారికి కనీస అవగాహన ఉన్నట్టు కూడా కనిపించదు. మన దేశంలో రెండు రాష్ట్రాలలో ప్రభుత్వమే నిర్వహించే సంస్కృతిక ఉత్సవాలు ఉన్నాయి. ఒకటి బెంగాల్‌లో దుర్గా ఉత్సవాలు. రెండు మైసూరులో దసరా ఉత్సవాలు. ఈసారి మైసూరు దసరా ఉత్సవాలకు ఇటీవలే బుకర్ ప్రైజ్ అందుకున్న బానూముస్తాఖ్‌ను ఆహ్వానించాలని కర్నాటక ప్రభుత్వం నిర్ణయించింది. బానూముస్తాఖ్ బుకర్ ప్రైజ్ సాధించడం కన్నడ సాహిత్యానికి, కర్నాటక ప్రజలకు మాత్రమే గర్వకారణం కాదు. రచయిత్రిగా బానూ ముస్తాఖ్‌కు బుకర్ ప్రైజ్ రావడం దేశవాసులందరూ గర్వించదగ్గ విషయం. బానూ ముస్తాఖ్‌ను మైసూరు దసరా ఉత్సవాలకు ముఖ్య అతిథిగా ఆహ్వానిస్తున్నామని, ఆ ఉత్సవాలను ఆమే ప్రారంభిస్తారని మైసూరు జిల్లా పాలనా విభాగం గత మూడో తేదీన ప్రకటించింది. మత దృష్టి తప్ప సాంస్కృతిక దృక్కోణం ఎంత మాత్రం లేని వారికి ఇది విపరీతంగా అభ్యంతరకరం అయిపోయింది. ఇక అంతే! సింహప్రతాప్ అనే బీజేపీ నాయకుడి అధ్వర్యంలో నిరసన ప్రదర్శనలు మొదలైనాయి. ఆమెను ఆహ్వానించడాన్ని వ్యతిరేకిస్తూ నిరసన తెలియజేస్తున్న వారు కర్నాటక హైకోర్టుకెక్కారు. గత 15 న హైకోర్టు ఈ పిటిషన్‌ను కొట్టేసింది. కానీ మతతత్వం నషాళానికి ఎక్కిన వారు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. శుక్రవారం ఈ వ్యవహారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు విక్రంనాథ్, సందీప్ మెహతాతో కూడిన బెంచి ముందుకు వచ్చింది. బానూ ముస్తాఖ్‌ను ఆహ్వానించడాన్ని వ్యతిరేకిస్తున్న వారి తరపు న్యాయవాది సురేశ్ ఈ అంశాన్ని ప్రస్తావించగానే న్యాయమూర్తి విక్రంనాథ్ ఈ పిటిషన్‌ను కొట్టేస్తున్నాం అన్నారు. ఆ న్యాయవాది తన వాదనలు వినిపించడానికి మూడు నిముషాల వ్యవధి ఇవ్వాలని కోరారు. న్యాయమూర్తి సరేనన్నారు. ముస్తాఖ్‌ను ఆహ్వానించడం రాజ్యాంగంలోని 25 వ అధికరణానికి వ్యతిరేకం అని న్యాయవాది సురేశ్ అన్నారు. వెంటనే న్యాయమూర్తి విక్రంనాథ్ మళ్లీ "కొట్టేస్తున్నాం" అన్నారు. మళ్లీ ఆ న్యాయవాది మాట్లాడడం మొదలు పెట్టి ముస్తాఖ్‌ను దసరా సమారోహాలకు ఆహ్వానించడం హిందువుల ఆరాధనా పద్ధతులకు విఘాతం కలిగించడం అన్నారు. మళ్లీ విక్రమనాథ్ "కొట్టేస్తున్నాం" అన్నారు. మీరు రాజ్యాంగ పీఠిక చదవారా అని సదరు న్యాయవాదిని నిలదీశారు. మైసూరు దసరా ఉత్సవాలు చాముండేశ్వరీ ఆలయం వేదికగా జరుగుతాయి. ఆ ఆలయంలో దీపారాధన, హారతి లాంటివి ఉంటాయి. ఇవి మతాచారాలే తప్ప సెక్యులరిజంలో భాగం కావు అని న్యాయవాది రెట్టిస్తే న్యాయమూర్తి విక్రంనాథ్ మళ్లీ "కొట్టేస్తున్నాం, కొట్టేస్తున్నాం, కొట్టేస్తున్నాం" అని మూడు సార్లు చెప్పారు. బానూముస్తాఖ్ అనేక సార్లు హిందువులకు వ్యతిరేకంగా మాట్లాడారన్న సురేశ్ వాదనను కూడా న్యాయమూర్తులు ఖాతరు చేయలేదు. న్యాయమూర్తులు ఇలా వ్యవహరించడానికి రాజ్యాంగ పీఠికలో ఉన్న "సెక్యులరిజం" అన్న భావనకు కట్టుబడి ఉండాలన్న సంకల్పమే ప్రధాన కారణం.

భానూముష్తాఖ్‌ను దసరా ఉత్సవాలకు ఆహ్వానించడం సాహిత్యం, సంస్కృతికి ఎత్తిపట్టిన నివాళిగా కర్నాటకలోని రచయితలు, మేధావులు, ఆలోచనాపరులు భావించారు. ఉత్సవాలు దసరా పండగ సందర్భంలో జరుగుతాయి. కానీ ఇవి హిందూ మతానికి పరిమితమైనవి కావు. దసరా ఉత్సవాలు అక్కడి సంస్కృతికి చిహ్నం. సోమవారం మొదలయ్యే ఈ ఉత్సవాలలో జరిగే పూజాదికాలు హిందూ ఆచారాల్లో భాగం కనక ఓ ముస్లింకు వీటిని ప్రారంభించే అవకాశం ఇవ్వడం కుదరదని సంఘ్ పరివార్ వారి వాదన. ఇందులో దీపం వెలిగించడం, కుంకుమ, పసుపు, పళ్లు, పూలు ఉంటాయి కనక ఇది హిందూ సంప్రదాయమేనని వితండవాదానికి దిగుతున్నారు. వాస్తవం ఏమిటంటే ఈ దసరా ఉత్సవాలు ఎప్పటి నుంచో ప్రభుత్వమే ఒక వేడుకగా నిర్వహిస్తోంది. ఈ ఉత్సవాలలో ఇతర మతాల వారు పాల్గొనడం రాజ్యాంగోల్లంఘున కాదని సుప్రీంకోర్టు న్యాయమూర్తులు భావించారు. ఈ అభిప్రాయానికి నిబద్ధులై ఉన్నారు. న్యాయమూర్తులు బీజేపీ నాయకులు పిటిషన్‌ను కొట్టి వేయడం అంటే రాజ్యాంగ పీఠికకు, అందులో ఉన్న "సెక్యులర్" అన్న మాటకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వడమే. ఏ ఉత్సవాలలోనైనా అన్య మతస్థులు పాల్గొనడం ఏ మత భావాలకూ విరుద్ధమైంది కాదు. మొహర్రం సందర్భంగా పీర్లు మోసేది సాధారణంగా హిందువులు అన్న వాస్తవం తెలియని వారు దసరా ఉత్సవాలలో భానూముస్తాఖ్ పాల్గొనడాన్ని సహించడం లేదు. బెంగాల్‌లో దుర్గా ఉత్సవాల సందర్భంగా వేల సంఖ్యలో అమ్మవారి విగ్రహాలు ఏర్పాటు చేస్తారు. విగ్రహాలు ఎవరు తయారు చేసినా అమ్మవారి కేశాలంకరణ చేసేది మాత్రం ముస్లింలే. ఇదంతా హౌరాలోని ఓ బస్తీలో జరుగుతుంది. ఆ బస్తీ పేరు పార్వతీపురం. కానీ అక్కడ విగ్రహాలను దిద్ది తీర్చడంలో ప్రధాన పాత్ర ముస్లింలదే. అవే విగ్రహాలను బెంగాల్ అంతటా ఏర్పాటు చేస్తున్నారు కదా. ముస్లింలు కేశాలంకరణం చేసినంత మాత్రాన ఆ విగ్రహాలకు అదనపు సొబగులు అద్దినట్టు అయిందే తప్ప అవి మైలపడి పోలేదు. మతాంతరీకరణకూ గురి కాలేదు. ఉత్తరప్రదేశ్‌లోని బహ్రైచ్ పట్టణంలో మాతా మందిరం ఉంది. ఆ మందిరం మేనేజింగ్ ట్రస్టీ (నిర్వాహక ధర్మ కర్త) మహమ్మద్ అలీ. హిందూ దేవాలయానికి ఓ ముస్లిం ధర్మకర్తగా ఉండడం మన సెక్యులర్ విధానాల ఫలితమే. మహమ్మద్ అలీ నిష్ఠా గరిష్ఠుడైన ఇస్లాం మతానుయాయి. రోజుకు అయిదు సార్లు నమాజ్ చేస్తారు. సాయంత్రం దేవికి హారతి ఇస్తారు. ఇది భారత్ అన్న భావనకు సంకేతం. రాజ్యాంగ నిర్మాతల ఆశయానికి ప్రబల నిదర్శనం. కర్నాటక ప్రభుత్వం బానూ ముస్తాఖ్‌ను ఆహ్వానించడాన్ని వ్యతిరేకించే వారిలో కేవలం ముస్లిం వ్యతిరేకతే లేదు. మహిళ ఎదుగుదలను సహించే తత్వం బొత్తిగా లేదు. ఒక మహిళ, అందునా ముస్లిం స్త్రీ ఇంత ఉన్నత స్థాయికి వెళ్లడం సంఘ్ పరివార్ వారికి మింగుడు పడడం లేదు. కానీ రాజ్యాంగాన్ని, రాజ్యాంగ పీఠికలోని అంశాలను పరిరక్షించే పట్టుదల ఉన్న న్యాయమూర్తులు ఇంకా మిగిలే ఉన్నారు. అందుకు అందరం గర్వపడాల్సిందే. బుకర్ ప్రైజ్ తెచ్చిపెట్టిన "హార్ట్ లాండ్" ను బానూముస్తాఖ్ రాసింది కన్నడంలో అన్న జ్ఞానం కూడా లేకపోవడం జుగుప్స కల్గిస్తోంది.

ఇండియాపై ట్రంప్ మరో దెబ్బ

టి.ఎస్. అశోక్

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇండియా తదితర దేశాలపై మరో గట్టి దెబ్బ కొట్టాడు. భారతదేశంపై కక్ష కొద్దీ 50 శాతం సుంకాలు విధించినా భారత ప్రభుత్వం ముఖ్యంగా ప్రధాని మోదీ మౌనం వహించారే గాని తీవ్రంగా స్పందించలేదు. ఇప్పుడు హెచ్-1బి వీసా దరఖాస్తుకు లక్ష డాలర్ల సర్‌ఛార్జీని విధించి ఇండియా తదితర దేశాలలోని యజమానులకు విదేశీ ఉద్యోగులకు ఆశ్చర్యం కల్పించాడు. ఉన్నత విద్యారంగంలో ఉన్నవారు సైతం లక్ష డాలర్ల సర్‌ఛార్జీని చెల్లించవలసిందే. 2025 సెప్టెంబరు 19న ట్రంప్ ఎగ్జిక్యూటివ్ ఉత్తర్వులు జారీ చేశారు. వీసా ఫీజులను సాధారణంగా సర్దుబాటు చేయడంలేదు. అమెరికాలో భారతదేశం నుంచి వెళ్లి టెక్ కంపెనీల్లో పనిచేసే ఉద్యోగులు ఉన్నత స్థాయి విద్యనభ్యసించే విద్యార్థులు పెంచిన సర్‌ఛార్జీని చెల్లించవలసిందేనని ప్రకటించారు. ఇతర దేశాల నుంచి వచ్చి ఇక్కడ పనిచేసే వారి సంఖ్యను తగ్గించడమే ట్రంప్ లక్ష్యం. ఎక్కువ వేతనాలను తీసుకొని పనిచేసే వారిని తమ సొంత దేశాలకు పంపించి తమ దేశంలో ఉండే ఉద్యోగులను, కార్మికులను ఆయా కంపెనీలు తీసుకోవాలని వీరికి తక్కువ వేతనాలు ఇవ్వవచ్చునని అమెరికాకు చెందిన వారిని రక్షించాలని ఈ పని చేసినట్టుగా ట్రంప్ చెబుతున్నాడు. విదేశాల నుంచి వచ్చే వారి సంఖ్యను గణనీయంగా తగ్గించడమే వ్యూహమని హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ డిపార్టుమెంట్, వైట్‌హౌస్‌లు విదేశాల నుంచి వచ్చే ఉద్యోగులు, విద్యార్థుల సంఖ్యను గణనీయంగా తగ్గిస్తామని తెలిపారు. అమెరికాలో నెలకొల్పిన కంపెనీల యాజమాన్యాలకు కూడా తీవ్రమైన ప్రభావం పడుతుందని చెప్తున్నారు. ఇంతకాలం అమెరికా ఇతర దేశస్థులకు ఎంతో ఆకర్షణీయంగా ఉంది. ప్రపంచంలోని అనేక దేశాల నుంచి నైపుణ్యం గల టెక్నాలజీ ఉద్యోగలను అమెరికా ఎక్కువగా ఆకర్షిస్తోంది.

సిలికాన్ వ్యాలీలో కంపెనీలలో చేరే ఇతర దేశస్థులు ప్రత్యేకించి ఇండియా, చైనా, దక్షిణాసియాల నుంచి వచ్చే వారిని చౌకగా తీసుకోవాలనేది ట్రంప్ లక్ష్యం. అలాగే దేశంలోని వారిని తక్కువ వేతనాలు ఇచ్చి తీసుకోవాలన్నది కూడా ఆలోచన. హెచ్-1బి వీసా కార్యక్రమం కింద అమెరికా కంపెనీలు విదేశీ వృత్తి నిపుణులను ప్రత్యేక వృత్తులలో ఉన్న నిపుణులను సిలికాన్ వ్యాలీలోని కంపెనీలు తీసుకోవాలని కూడా ట్రంప్ చెబుతున్నారు. సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మేథమెటిక్స్‌లోని ప్రత్యేక వృత్తులలో విదేశీ నిపుణులను చేర్చుకున్నారు. ప్రస్తుతం హెచ్-1బి వీసాలకు ఏడాదికి 65 వేలు ఫీజు ఉన్నది. అమెరికా మాస్టర్స్ డిగ్రీ లేదా ఉన్నత స్థాయి డిగ్రీకి అదనంగా మరో 20 వేలు దరఖాస్తులకి వసూలు చేస్తున్నారు. ఆకస్మికంగా తీసుకున్న ఈ నిర్ణయంపై భారతదేశం ఇంకా ప్రకటన చేయలేదు. ఉద్యోగాలలో కొనసాగించడానికి అలాగే అదనపు కాలాన్ని అనుమతించేందుకు మొత్తం ప్రోగ్రాం చాలా భారీగా ఉంది. ఇటీవల సంవత్సరాలలో ఏడాదికి దాదాపు 40 వేల హెచ్-1బి దరఖాస్తులను అంగీకరించారు. వీటిలో ఎక్కువగా ఇండియా, చైనాల నుంచి అంగీకరించిన దరఖాస్తులు ఉన్నాయి. ముఖ్యంగా టెక్ రంగానికి ఇండియా నుంచి వచ్చే వాళ్ల సంఖ్య చాలా ఎక్కువగా ఉంది. అమెజాన్, మైక్రోసాఫ్ట్, గూగుల్, యాపిల్, ఐబీఎం, టాటా కన్సల్టెన్సీ సర్వీసులు ఎక్కువ పిటిషన్లను స్వీకరించాయి. తాజా దరఖాస్తులకు ఫీజు లక్ష డాలర్లు చెల్లించాలి. ఇంతవరకు 1700 డాలర్లు నాలుగు వేల ఐదువందల డాలర్ల మధ్య ధర ఉంది. అయితే వేగంగా పిటీషన్లను అంగీకరించే దానిని బట్టి వసూలు చేస్తున్నారు. కొద్దిమంది సీనియర్ ఇంజినీర్లు లేదా పరిశోధన శాస్త్రవేత్తలు భారీ కంపెనీలు అధిక ధరను చెల్లించి దరఖాస్తులను అనుమతిస్తున్నాయి. మధ్యతరహా వాణిజ్య కంపెనీలు సర్‌ఛార్జీలు చెల్లించడానికి తీవ్రంగా ఇబ్బందులు పడతాయి. అలాగే భారీ టెక్ కంపెనీలు కూడా ఒకొక్క ఉద్యోగికి లక్ష డాలర్లు చెల్లించవలసి ఉంటుంది. అయితే కెనడా, బ్రిటన్ లేదా యురోపియన్ యూనియన్ దరఖాస్తులకు చాలా తక్కువ ఫీజును చెల్లించడానికి అనుమతించారు. ఇకపైన ఇతర దేశాల నుంచి వచ్చే దరఖాస్తులు గణనీయంగా తగ్గిపోతాయి.

కార్పొరేట్లకు భూములు అభివృద్ధికా...?

ప్రొఫెసర్ పేటా బాబీ వర్ధన్

దేశంలోనైనా, రాష్ట్రంలోనైనా అభివృద్ధి జరగాలంటే పరిశ్రమలు కావాలి. కొత్త ప్రాజెక్టులు రావాలి. అయితే ఆ ప్రాజెక్టులు, పరిశ్రమల స్థాపన వల్ల ఒరిగేమేలెంత? జరిగే కీడెంత? ఇవన్నీ బేరీజు వేసుకుని ప్రభుత్వాలు భూకేటాయింపులు జరపాలి... సరళీకృత ఆర్థిక విధానం వల్ల కార్పొరేట్ కంపెనీలు క్యూలు కడుతున్నాయి. ప్రభుత్వాలు కూడా కార్పొరేట్లకు రెడ్‌కార్పెట్ వేసి మరీ ద్వారాలు తెరుస్తున్నాయి. కొన్ని కంపెనీలు భూముల కేటాయింపులు జరిగాక పరిశ్రమల ఏర్పాటులో తీవ్ర జాప్యం చేస్తున్నాయి. ప్రభుత్వం విధించిన షరతులను సైతం బేఖాతరు చేస్తూ ఏళ్లు గడిపేస్తున్నారు. ఒక ప్రభుత్వం కేటాయించిన భూములను మరో ప్రభుత్వం ఏర్పడ్డాక రద్దు చేయడం కూడా చూస్తున్నాం. ఇటీవల కాలంలో 'లూలూ' కంపెనీకి కూటమి ప్రభుత్వం మరోసారి భూకేటాయింపులు చేసింది. తగిన సమయంలో మాల్స్ ప్రారంభించకపోవడం వల్ల వైసీపీ పాలనలో లూలూ కంపెనీ భూముల కేటాయింపును రద్దు చేయడంతో లూలూ వెనక్కు వెళ్లిపోయింది. ఈ సందర్భాన్ని ఆసరాగా చేసుకుని తెలుగుదేశం నేతలు జగన్‌మోహన్ రెడ్డిని దుమ్మెత్తి పోశారు. కార్పొరేట్ కంపెనీలను రాష్ట్రం నుంచి తరిమేసినట్లుగా ప్రచారం చేశారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి 2024లో విజయం సాధించాక మళ్లీ కార్పొరేట్ సంస్థలు సంప్రదింపులు ప్రారంభించాయి. కూటమి ప్రభుత్వం భాగస్వామ్య సదస్సులు నిర్వహించి కార్పొరేట్ కంపెనీలను రాష్ట్రానికి రావాలని పిలుపునిచ్చింది. అడిగిన వారందరికీ భూముల కేటాయింపులు చేస్తోంది.

కారుచౌకగా భూములు

చాలా కంపెనీలు దరఖాస్తు చేసుకున్నాయి. కేటాయింపులు జరుగుతున్నాయి. అయితే, అవసరాన్ని మించి ఎకరాలు లెక్కన భూకేటాయింపులు చేయడం వివాదాస్పదంగా మారింది. ప్రభుత్వ భూములు తీసుకున్న కార్పొరేట్ కంపెనీలు ఏయే పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్నాయి? పెట్టుబడులు ఎంత మేరకు పెడుతున్నాయి? ఎంత మందికి ఉపాధి అవకాశాలు కనిపిస్తున్నాయి? వంటి అంశాల పట్ల అంచనాలు రూపొందించడం తప్పనిసరి కాగా, ఆ మేరకు కార్యాచరణ లేనట్టు కన్పిస్తోంది. ఈ మధ్య కాలంలో ఉత్తరాంధ్రకు సంబంధించిన భూములను అనేక కార్పొరేట్ కంపెనీలకు కేటాయింపులు జరిపారు. వాటిల్లో టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) ప్రముఖమైంది. ఈ సంస్థకు ఎకరం భూమి 99 పైసల నామమాత్రపు ధరకు 26.16 ఎకరాలు కేటాయించారు. ఈ సంస్థ 1370 కోట్ల రూపాయల పెట్టుబడులతో డేటా సెంటర్ ఏర్పాటు చేయబోతున్నట్లు ప్రకటించింది. 13 వేల మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చింది. ఈ ప్రాజెక్టు పట్టాలు ఎక్కితే వనగూడే లాభాల సంగతి ఎలావున్నా, ఉపాధి లేక వలస బాట పడుతున్న ఉత్తరాంధ్ర యువతకు ఏమాత్రం ఉపయోగపడుతుందన్నదే సమస్య. డేటా సెంటర్లో పనిచేసే నైపుణ్యం స్థానిక నిరుద్యోగులకు ఉంటుందా అనేది చిక్కు ప్రశ్న. పైగా కృత్రిమ మేధ (ఏఐ) పరిజ్ఞానం అభివృద్ధి చెందిన నేపథ్యంలో, ఇటీవలే టాటా కంపెనీ 12 వేల మందికి ఉద్వాసన పలికింది. మరి విశాఖలో నెలకొల్పబోయే డేటా సెంటర్ నియామకాలు ఏ మేరకు జరుగుతాయో వేచి చూడాల్సిందే. టాటా సంస్థతో పాటు మరికొన్ని టెక్నాలజీ ఆధారిత కార్పొరేట్ సంస్థలకు కూడా భూకేటాయింపులు జరిపారు. ఇందులో ప్రధానమైనది సిఫీ ఒకటి. ఇది ఏఐ ఆధారిత ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సంస్థను విశాఖలోని పరదేసి పాలెంలో నెలకొల్పేందుకు ముందు కొచ్చింది. దీనికి 25 ఎకరాల భూములు కేటాయించారు. ఎకరానికి యాభై లక్షలు చొప్పున 99 సంత్సరాల లీజు పద్ధతిలో కేటాయింపులు చేశారు. ఇక అనకాపల్లి జిల్లాలోని రాంబిల్లిలో లారస్ ఫార్మా కంపెనీకి 532 ఎకరాలు కేటాయించారు. దశలవారీగా ఈ కంపెనీ ఆరు వేల కోట్ల పైన పెట్టుబడులు పెడతామని తెలిపింది. 600 మందికి ఉపాధి కల్పిస్తామని నమ్మబలుకుతోంది. సత్య టెక్నాలజీ పేరుతో మరో సంస్థ విశాఖపట్నం శివారు మధురవాడలో తమ సంస్థను ఏర్పాటు చేస్తామని ముందుకొచ్చింది. దీనికి కూడా ఖరీదైన భూములు కారుచౌకగా లీజుకు ఇచ్చారు. పదిహేను వందల కోట్ల పెట్టుబడుల అంచనాతో పాతిక వేల మందికి ఉద్యోగాలు ఇచ్చేలా ఒప్పందం కుదిరింది. ఇది ఏ మేరకు సఫలీకృతం అవుతుందో భవిష్యత్‌లో తేలుతుంది.

లూలూ మాల్-గోల్ మాలేనా ?!

మిగతా కంపెనీల విషయం ఒక ఎత్తు. లూలూ మాల్‌కి భూకేటాయింపులు మరో ఎత్తు. ఇది 'పేరుగొప్ప- ఊరు దిబ్బ' చందాన ఏర్పాటు చేయబోతున్న మెగామాల్ (పెద్ద పచారీ దుకాణం).హోల్‌సేల్ దుకాణం. ఇప్పటికే డీమార్ట్, రిలయెన్స్, మోర్, మెట్రో, స్పెన్సర్స్ వంటి దిగ్గజ వ్యాపార సంస్థలు విశాఖలో వ్యాపార కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. కానీ లూలూ పట్ల 'అపార'మైన శ్రద్ధ కనబరిచింది కూటమి సర్కారు. విశాఖకి గుండెకాయలా పరిగణించే బీచ్ రోడ్డులోని హార్బర్ పార్క్ భూములు 13.5 ఎకరాలను కేటాయించింది. దీనికి కూడా 99 సంత్సరాల లీజు పద్ధతిలోనే ఒప్పందం కుదిరింది. నిర్మాణం పూర్తయ్యాక మూడేళ్ల పాటు ఎలాంటి అద్దె వసూలు చేయరు. ఆ తర్వాత వేలం పద్ధతిలో దుకాణాలు విక్రయిస్తారు. దీని ద్వారా వెయ్యి కోట్ల రూపాయల మేర ఆదాయం వస్తుందని అంచనా వేస్తున్నారు. దుకాణ సముదాయాలు, సినిమా హాళ్లు, హోటళ్లు నిర్మిస్తున్నారు?

1989లో యూఏఈలోని అబుదాబి కేంద్రంగా ఏర్పాటైన లూలూ సంస్థ అంచలంచెలుగా తన వ్యాపార సామ్రాజ్యాన్ని ఇతర దేశాలకు విస్తరించింది. ఆసియాతో పాటు, యూరోప్, ఆఫ్రికా, మధ్యప్రాచ్య ప్రాంతం, అమెరికాలో వివిధ వ్యాపారాలు నిర్వహిస్తోంది. విశాఖలో హైపర్ మార్కెట్ మాల్ మాత్రమే ఏర్పాటు చేయబోతోంది. తయారీ యూనిట్లను ఏర్పాటు చేయబోవడం లేదు కనుక, అంతా దిగుమతుల మీద ఆధారపడి రిటైల్ వ్యాపారం చేస్తుంది. ఒకవేళ, సినిమా హాళ్లు, హోటళ్లు నిర్మించినా ఎంత మందికి ఉద్యోగాలు కల్పిస్తుంది? ఎలాంటి ఉపాధి కల్పిస్తుంది? సేల్స్‌మెన్, సేల్స్ గాల్స్, మహాఅయితే సూపరువైజర్లు, ఇద్దరు ముగ్గురు మేనేజర్లు. ఇంతకు మించి ఉద్ధరించేదేముంది? ఈ ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్ చదువున్న వాళ్లు సరిపోతారు కదా ? అంత ఖరీదైన భూములు కేటాయిస్తే ఒనగూడే ప్రయోజనం ఇదేనా ? 3500 కోట్ల ఖరీదు చేసే భూమిని ఇంత తేలిగ్గా ఇచ్చేస్తారా? నిర్మాణం పూర్తి అయ్యాక చదరపు అడుగు రూపాయిన్నరకే ఇచ్చేలా ఒప్పందం కుదిరింది.

ప్రభుత్వ భూములను కారుచౌకగా కార్పొరేట్ కంపెనీలకు కేటాయించే బదులు ఎన్నో తరాల ప్రజలకు ముఖ్యంగా యువతకు ఉపయోగకరమైన సైన్సు సిటీ ఏర్పాటు చేయాలన్న డిమాండ్ పెరుగుతోంది.' విశాఖ ప్రజా వనరుల పరిరక్షణ వేదిక' పేరుతో ఉద్యమం మొదలయింది. లూలూ భూముల కేటాయింపుల విషయంలో అనేక ఉల్లంఘనలు జరిగినట్లు ఈ 'వేదిక' స్పష్టం చేస్తోంది. తీర నియంత్రణ జోన్ (సీఆర్‌జడ్) నియమాల ప్రకారం సముద్ర తీరానికి 500 మీటర్లలోపు ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడదు. కానీ, లూలూమాల్‌కి కేటాయించిన భూములు సముద్ర తీరానికి అతి సమీపంలోనే ఉన్నాయి. ప్రభుత్వ స్థలాలను ప్రజా, ప్రభుత్వ అవసరాలకు ఉపయోగించాలి మినహా ప్రైవేటు సంస్థలకు కాదన్నది వేదిక వాదన. హైదరాబాద్‌తో పాటు అనేక ప్రాంతాల్లో లూలూ తమ వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తోంది. అయితే వాటిల్లో ఎక్కువ శాతం భూములు ప్రైవేటు వ్యక్తులకు చెందినవి కావడం విశేషం. బీచ్‌లో నిర్మిస్తున్న లూలూ మాల్ వల్ల పర్యావరణ సమస్యలు వస్తాయని నిపుణులు చెబుతున్నారు. సముద్రం కోతకు గురైతే పెద్ద ప్రమాదం ఏర్పడుతుంది. లూలూమాల్ భారీ ఎత్తున నిర్మిస్తున్నారు కనుక ట్రాఫిక్ రద్దీ పెరిగి సమస్యలు తలెత్తే ప్రమాదం లేకపోలేదు. పబ్‌లకు పర్మిషన్లు ఇస్తే పరిసర ప్రాంతాల ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయి. అహ్మదాబాద్, హైదరాబాద్ వంటి చోట్ల జరుగుతున్న చేదు అనుభవాలు పునరావృతం కావు అన్న భరోసా లేదు.

జర్నలిజం పూర్వపు విభాగాధిపతి &డీన్
ఆంధ్ర విశ్వవిద్యాలయం., 9393100566

భారత-అమెరికా సంబంధాలు ఎటు?...



పతకముూరు దామోదర్ ప్రసాద్

రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తూ ఉక్రెయిన్ యుద్ధానికి ఆజ్యం పోస్తోందనే కుంటిసాకుతో, భారత్ అధిక సుంకాలు విధిస్తూ "సుంకాల రారాజు"గా నిలిచిందని ఆరోపిస్తూ ప్రతీకారంగా అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ 50 శాతం దిగుమతి సుంకాలు విధించడంతో వాణిజ్యంలో తీవ్ర ప్రతిష్టంభన నెలకొంది. ఈ విషయమై యమై బ్రెండెన్ ల్లించ్ నాయకత్వంలో కొత్త ఢిల్లీకి వచ్చిన అమెరికా ప్రతినిధి బృందానికి, భారత వాణిజ్య శాఖ ప్రత్యేక కార్యదర్శి భారత బృందానికి మధ్య జరిగిన చర్చల్లో పెద్ద పురోగతి కనిపించలేదు. అయితే భారత ప్రధాని నరేంద్రమోదీకి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఫోన్ చేసి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేయయడం, దృశ్య మాధ్యమాల ద్వారా చర్చలు కొనసాగించి త్వరలోనే ఒక అంగీకారానికి రావాలని నిర్ణయించడమే ఓ సానుకూల పరిణామంగా భావిస్తున్నారు. భారత్‌కు పత్తి, మొక్కజొన్న, సోయాబీన్ వంటి వ్యవసాయోత్పత్తులు, పాలు, వివిధ రకాల వెన్నలు, పాలపొడి వంటి పాడి ఉత్పత్తులు ఎగుమతి చేయాలని, 146 కోట్ల అతి పెద్ద జనాభా గల మార్కెట్‌ను చేజిక్కించుకోవాలని అమెరికా తహతహలాడుతోంది. అందుకు సరళమైన సుంకాలతో అనుమతి ఇవ్వాలని దశాబ్దాలుగా మన దేశంపై ఒత్తిడి తెస్తోంది. అయితే 86 శాతం చిన్న, సన్నకారు రైతులు, 8కోట్ల పాడిరైతుల జీవితాలపై దుష్ప్రభావము పడుతుందని భారత ప్రభుత్వం అందుకు అంగీకరించడంలేదు. అదీగాక పాల అధికోత్పత్తికి వాడే దాణాలో కలిపిన ఎంజైములుమ మాంసకృత్తులు అధికంగా ఉండటం, ఆరోగ్యానికి హానికరమని భావించడం, అవి భారత ఆచారాలు, సంప్రపదాయలు, ఆహార అలవాట్లకు విరుద్ధంగా ఉండటం వల్ల ప్రభుత్వం వాటికి అనుమతించడం లేదు. దీంతో దాలర్ ప్రభువు ట్రంప్‌కు పట్టరాని ఆగ్రహం కలిగి భారత్‌ను ఆర్థికంగా దెబ్బతీయడానికి 50 శాతం సుంకాలు విధించడంతో, జౌళీ వస్త్రాలు, రెడీమేడ్ దుస్తులు, వజ్రాలు, స్వర్ణాభరణాలు, టోలువస్తువులు, పాదరక్షలు, సుగంధ ద్రవ్యాలు రబ్బర్, రొయ్యలు, చేపలు, ఇతర మత్స్య సంపద ఉత్పత్తిలో భాగస్వాములైన లక్షలాదిమంది మహిళలు ఇతర శ్రామికుల జీవనోపాధులపై తీవ్ర ప్రభావం పడింది. పనులు, ఆదాయాలు కోల్పోయి వారు వీధినపడి జీవనమెలా అని ఆక్రోశిస్తున్నారు. రొయ్యల ఎగుమతులలో 80 శాతం, చేపలు, సముద్రఉత్పత్తులో 39 శాతం ఆంధ్రప్రదేశ్ నుంచి జరుగుతున్నాయి. ట్రంప్ సుంకాల దెబ్బకు వాటి ఎగుమతులు ఆగిపోయి 25 వేలల కోట్లనష్టం వాటిల్లనుందని అంచనా. అమెరికాను మళ్లీ గొప్ప దేశంగా అభివృద్ధి చేస్తానని, తయారీ రంగంలో మేటిగా నిలుపుతానని, అన్నింటా అమెరికాయే ఫస్ట్ అని నినదిస్తూ, శ్వేతజాతి దురహంకారాన్ని రెచ్చగొట్టి రెండో దఫా అమెరికా అధ్యక్షుడైన ట్రంప్ ఇంటా బయటా పెట్రేగి పోతున్నాడు. భారత్ పైనే గాక బ్రెజిల్, అర్జెంటీనా, మెక్సికో, కెనడా తదితర దేశాలపై భారీ సుంకాలు విధించి అమెరికా మళ్లీ సామ్రాజ్యవాద పెత్తనాన్ని, ప్రాబల్యాన్ని పెంచడానికి చేస్తున్న యత్నాలు అంతర్జాతీయ వ్యవస్థలను అతలాకుతలం చేస్తున్నాయి. అమెరికాలో సేద్యంపై ఆధారపడి జీవిస్తున్న వారు 2శాతం, యూరోపియన్ దేశాలలో కేవలం 4శాతం కాగా, చైనాలో 22 శాతం మందికి వ్యవసాయమే జీవనాధారం. అమెరికాలో వేల ఎకరాల వ్యవసాయ క్షేత్రాలను కంపెనీలు అత్యాధునిక యంత్రాలు, నూర్పిడి పరికరాలతో చేయడం వల్ల సాగు ఖర్చు తక్కువ. యూరోప్ చైనా తదితర దేశాలలో కూడా యంత్రాల వాడకం వల్ల సాగు ఖర్చు తక్కువ, ఉత్పాదకత ఎక్కువ. భారత్ ఇంకా అభివృద్ధి చెందుతున్న దేశం కనుక ఉత్పత్తి, ఉత్పాదకత పెంచడానికి, సేద్యాన్ని లాభసాటి చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గట్టి ప్రయత్నాలు చేయడం అవసరం. చైనా, అమెరికా వ్యవసాయ రంగంలో ముందున్నా భారీగా వ్యవసాయోత్పత్తులను దిగుమతి చేసుకుంటున్నాయి. 2024లో చైనా 100 బిలియన్ డాలర్లు, అమెరికా 59 బిలియన్ డాలర్ల వ్యవసాయోత్పత్తులను దిగుమతి చేసుకున్నాయి. అమెరికా భారీగా మొక్కజొన్న, పత్తి వంటి 182.8బిలియన్ డాలర్ల వ్యవసాయోత్పత్తులను ఎగుమతి చేసింది. అమెరికా, చైనా అనుభవాలను భారత ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుని పోటీతత్వాన్ని పెంపొందించుకోవాలి. పంట సీజన్‌లో యూరియా తదితర ఎరువులను సరఫరా చేయలేని స్థితి భారత ప్రభుత్వానిది. మన దిగుమతులలో మూడోవంతు వంటనూనెలే. వాటిపై 10 శాతం సుంకం. పత్తిపై సున్నా, పచ్చబఠానీలపై నామమాత్రంగా సుంకాలున్నాయి. అమెరికా కోడికాళ్లపై, వాల్‌నట్స్‌పై 100శాతం, యాపిల్స్‌పై 50శాతం, పాలపొడిపై50 శాతం సుంకాలు విధిస్తున్నది. మన దేశం అతి పెద్ద బియ్యం ఎగుమతిదారు. బియ్యం దిగుమతిపై 70 శాతం ఉంది. మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 2047 నాటికి వందేళ్లు అవుతుంది కనుక అప్పటికి అభివృద్ధి చెందిన దేశంగా ఎదగాలనే భారత ప్రభుత్వ లక్ష్యానికి చేరాలంటే వివిధ రంగాలలో ఎన్నో మార్పులు తేవాలి. అమెరికా సుంకాలు ఆ దేశానికి కూడా నష్టం కలిగిస్తాయని, ద్రవ్యోల్బణం పెరుగుతుందని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. రెండోసారి అధ్యక్షుడైన తర్వాత ట్రంప్ సుంకాల విషయంలో కరకుగా వ్యవహరించడమే గాక అక్కడ పనిచేస్తున్న భారతీయులను ఇబ్బందులకు గురిచేసే నిర్ణయాలెన్నో తీసుకున్నారు. హెచ్1బి వీసాలపై ఎన్నో ఆంక్షలు విధించాడు. భారత్ అమెరికాలో మితవాద ప్రభుత్వాలే అధికారంలో ఉన్నా ప్రధాని మోదీ దేశ ప్రయోజనాల కోసం గళం వినిపించక తప్పటంలేదు. నిజానికి ప్రచ్ఛన్న యుద్ధకాలం నుంచి భారత్ అమెరికా సంబంధాలలో ఎన్నో ఒడిదుడుకులు తప్పడం లేదు. అమెరికా పాకిస్థాన్ పాలకులను దువ్వుతూ ఆయుధ, ఆర్థిక సాయం అందిస్తూ వస్తోంది.1971లో ఎన్నికైన షేక్ ముజిబుర్ రహమాన్‌కు పాక్ సైనిక పాలకులు అధికారం అప్పగించకపోవడం, సైనికదమనకాండతో ఆగ్రహించిన బంగ్లా ప్రజలు విముక్తి పోరాటాన్ని ప్రారంభించగా భారత్ నైతిక మద్దతు ఇచ్చి ఆయుధ సహాయం చేసింది. లక్షలాదిమంది శరణార్థులకు ఆశ్రయమిచ్చి ఆదుకుంది. అప్పుడు అమెరికా అధ్యక్షుడుగా ఉన్న రిచర్డ్ నిక్సన్ పాక్‌కు మద్దతుగా తమ సప్తమ నౌకా దళాన్ని పంపారు. అప్పటి సోవియట్ యూనియన్ భారత్‌కు మద్దతుగా నిలవడంతో వెనుదిరగక తప్పలేదు. అలా యెన్నో అవాంతరాలు, విభేదాలతో నడిచిన భారత అమెరికా సంబంధాలు 2000సంవత్సరంలో అప్పటి అధ్యక్షుడు క్లింటన్ భారత్ పర్యటనకు రావడంతో కొత్త మలుపు తిరిగాయి. తర్వాత అధికారంలోకి వచ్చిన భారత్, అమెరికా ప్రభుత్వాల నేతలు కూడా యధాశక్తి చేసిన కృషితో రెండు దేశాల సంబధాలు ఈ స్థాయికి వచ్చాయి. 2003లో అమెరికా మానవహనన ఆయుధాలున్నాయనే కుంటి సాకుతో ఇరాక్‌పై దురాక్రమణకు పాల్పడినప్పుడు భారత సైన్యాన్ని పంపమని కోరగా మన దేశం నిరాకరించింది. భారత మిత్రుడైన సద్దాం హుస్సేన్‌ను అమెరికా సేనలు వెంటాడి, వేటాడి దారుణంగా హతమార్చాయి. ఒసామా బిన్ లాడెన్‌ను తొలుత పెంచిపోషించింది అమెరికా. ఇస్లామిక్ మత చాందసవాదం పెచ్చుపెరిగి ఉగ్రవాదులు న్యూయర్క్, వాషింగ్టన్‌లో ఆకాశ హర్మ్యాలను పేల్చివేశాకగానీ విషభుజంగాలను చేరదీస్తే కలిగే ముప్పు అగ్రరాజ్యానికి బోధపడలేదు. ఆ తర్వాత పాక్‌లో నక్కిన బిన్‌లాడెన్‌ని అమెరికా గుట్టుగా మట్టుపెట్టింది. ఇరాక్‌పై అమెరికా దాడిని వాజపేయి ప్రభుత్వం ఖండించింది. ఇందిరాగాంధీ, వాజపేయి ప్రధానులుగా ఉన్నప్పుడు శాంతియుత ప్రయోజనాల కోసం జరిపిన అణు పరీక్షలను అమెరికా వ్యతిరేకించింది.ఫలితంగా తారాపూర్ అణువిద్యుత్ కేంద్రానికి యురేనియం సరఫరాను అమెరికా నిలిపి వేసింది. అణ్వస్త్ర వ్యాప్తి ఒప్పందం, అణుపరీక్షల నిషేధ ఒప్పందాలపై సంతకం చేయాలనే అమెరికా డిమాండ్‌ను భారత్ ఖాతరు చేయలేదు. చైనా బలీయమైన దేశంగా ,తయారీ కేంద్రంగా ఎదగడాన్ని సహించలేని అమెరికా భారత్ తో చెలిమి చేసి ఎదుర్కొనే వ్యూహం లో ఉంది. ఇప్పుడుఎన్నికయిన పాక్ ప్రధానిని పక్కనపెట్టి మతవాది అయిన సైన్యాధ్యక్షుడు ఆసిమ్ మునీర్ ను శ్వేత భవనానికి ఆహ్వానించి విందులివ్వడం ఏ పజాస్వామ్య స్ఫూర్తి. భారత్‌లో ఆర్థిక సంస్కరణలు మొ దలయ్యాక విద్యావంతులైన మధ్య తరగతి వర్గం అభివృద్ధి చెంది వారి సంతానాన్ని ఉన్నత విద్య ఉద్యోగాల కోసం కోటి ఆశలతో అమెరికా పంపడం అధికమైనది. ఇప్పుడు ట్రంప్ నిలకడ లేని నిర్ణయాల వల్ల వారి భవిష్యత్ అగమ్య గోచరంగా వుంది. ఏ దేశంతో సంబంధాలైనా, వాణిజ్యమైనా పరస్పర ప్రయోజానాల ప్రాతిపదికగానే జరగాలి. ట్రంప్ నిర్ణయాలు అమెరికాకు నష్టం కలిగిస్తాయని ఆయుధ తదితర పరిశ్రమ వర్గాలు ఆందోళనవ వ్యక్తం చేయటంతో పెంటగన్ సూచనపై కంపెనీలునీలు తమకు అవసరమైన నిపుణులను ఉద్యోగాలలోకి తీసుకోవచ్చుననీ, మినహాయింపు ఇవ్వడం కొంత ఊరట. భారత్-అమెరికా ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై జరుగుతున్న చర్చలు త్వరలో ఒక కొలిక్కి రాగలవని ఆశాభావం వ్యక్తం అవుతోంది. మోదీ తన మిత్రుడని, భారత్ గొప్ప దేశమని ట్రంప్ కొత్త రాగం ఆలపించగా, అమెరికా సహజ మిత్రదేశం అని మోదీ స్పందన. భారత్ తొలి నుంచి స్వతంత్ర విదేశాంగ వాణిజ్య విధానాలను అనుసరిస్తోంది. సోవియట్ కుప్పకూలాక ఏకధ్రువ ప్రపంచంగా కొన్నాళ్లు, అమెరికాకు తిరుగులేదని ఊదరగొట్టారు. చైనాలో పుతిన్, మోదీ,షి జిన్ పింగ్ సమావేశం తర్వాత అమెరికా తత్తరరపడి కొంత తగ్గింది. ప్రాచీన సంస్కృతి, నాగరికత గల భారత్ చైనా దగ్గరైతే ఉభయ తారకంగా వుంటుంది. సుదీర్ఘ సరిహద్దు వివాదం, పాకిస్థాన్‌కు చైనా మద్దతు అవరోధనలుగా వున్నాయి. చైనాకు మన ఎగుమతులు పెంచాలి. ప్రస్తుతం దిగుమతులే ఎక్కువ. భారత్‌లో తయారీ అనేది మోదీ నినాదంగా మిగిలింది. నాయకత్వం మన ప్రజల బహుళ ప్రయోజనాలు దృష్టిలో ఉంచుకుని దృఢంగా వ్యవహరించినప్పుడే మన ఎగుమతులను వివిధ దేశాలకు విస్తరించినప్పుడే లక్షలాది మంది ఉద్యోగ ఉపాధులను కాపాడగలం. భారత్ అన్ని రంగాలలో రానున్న కాలంలో అభివృద్ధి చెందిన దేశంగా ఎదగడానికి ఎంతో శ్రమించాల్సి వుంది.

- సీనియర్ జర్నలిస్టు.,9440990381

స్వదేశానికి వచ్చేయండి: రాధికాగుప్తా

న్యూఢిల్లీ: హెచ్-1బీ వీసా ఫీజును డొనాల్డ్ ట్రంప్ యంత్రాంగం పెంచడంపై ఎడెల్‌వీస్ మ్యూచువల్ ఫండ్ సీఈఓ రాధికాగుప్తా స్పందించారు అమెరికాలో భారతీయ విద్యార్థులకు మారిపోతున్న అవకాశాల గురించి మాట్లాడారు. తాను 2005లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన సమయంలో హెచ్-1బీ వీసా నిబంధనలు అంతర్జాతీయ విద్యార్థులకు చాలా అనుకూలంగా ఉండేవని గుర్తుచేసుకున్నారు. '2008లో సంభవించిన ఆర్థికమాంద్యంతో అంతా మారిపోయింది. అది ఎంతో మంది జీవితాలను మలుపు తిప్పింది. ఆ సమయంలో భారతీయ విద్యార్థులు కొందరు స్వదేశానికి తిరిగివచ్చారు. వీసా ఉన్నవారు కూడా అలాగే చేశారు. అలా తిరిగి వచ్చినవారు భారత్‌లో సంతృప్తికరమైన జీవితాన్ని నిర్మించుకున్నారు. వ్యక్తిగతంగా, వృత్తిగతంగా ఎదగడమేగాకుండా దేశానికి సహకరిస్తున్నామనే సంతృప్తిని సొంతం చేసుకున్నారు. ప్రస్తుతం అమెరికాలో చదువుకుంటున్న విద్యార్థుల ఆలోచనలు ఎలా ఉంటాయో నేను అర్థం చేసుకోగలను. కానీ ఇక్కడ ఒక విషయం గుర్తుంచుకోవాలి. ఒక తలుపు మూసుకుంటే... స్వదేశానికి తిరిగి వచ్చేందుకు ఎన్నో తలుపులు తెరుచుకుంటాయి. 2025 నాటి భారతం... 2005 నాటికంటే ఎంతో ఉత్తేజకరంగా ఉంది' అని తన అనుభవాన్ని వెల్లడించారు.

భారత టెక్ కంపెనీలపై తీవ్ర ప్రభావం: నాస్కామ్

న్యూఢిల్లీ: హెచ్-1బీ వీసా రుసుమును లక్ష డాలర్లకు పెంచుతూ అమెరికా తీసుకున్న నిర్ణయం భారత టెక్ కంపెనీలపై తీవ్ర ప్రభావం చూపిస్తుందని నేషనల్ అసోసియేషన్ ఆఫ్ సాఫ్ట్‌వేర్ అండ్ సర్వీస్ కంపెనీస్ (నాస్కామ్) ఆందోళన వ్యక్తంచేసింది. ఈ పరిణామాలతో ఆఫ్‌షోర్ ప్రాజెక్టులకు అంతరాయం కలుగుతుందని తెలిపింది. అంతేకాకుండా 24 గంటల్లోనే దీనిని అమలు చేస్తున్నట్లు చెప్పడం కూడా ప్రపంచవ్యాప్తంగా ఉన్న వ్యాపార సంస్థలు, నిపుణుల్లో మరింత అనిశ్చితికి కారణమైందని పేర్కొంది. 'హెచ్-1బీ వీసా రుసుము ఆదేశాలకు సంబంధించిన వివరాలను విశ్లేషిస్తున్నాం. ఇటువంటి ధోరణి అమెరికా ఆవిష్కరణల వ్యవస్థతోపాటు ఉద్యోగాలపైనా తీవ్ర ప్రభావం చూపిస్తుంది. ఈ వీసాలపై అంతర్జాతీయ, భారత కంపెనీల కోసం అమెరికాలో పనిచేస్తున్న భారతీయులపైనా ప్రభావం చూపుతుంది"అని నాస్కామ్ వెల్లడించింది. తాజా ప్రకటనతో మార్పులకు సంబంధించి క్లయింట్‌లతో ఆయా కంపెనీలు కలిసి పనిచేస్తున్నాయని తెలిపింది. మరోవైపు హెచ్-1బీ వీసా రుసుము సాధారణంగా 2 వేల నుంచి 5 వేల డాలర్లుగా ఉంటుంది. ప్రస్తుతం దీన్ని లక్ష డాలర్లకు పెంచుతూ అమెరికా నిర్ణయం తీసుకుంది. ఈ వీసా కార్యక్రమం కింద భారత్‌కు చెందిన అనేక కంపెనీలు ప్రయోజనం పొందుతున్నాయి. వేలాది మంది నిపుణులను అమెరికాకు పంపిస్తున్నాయి. అమెరికా ఇమిగ్రేషన్ విభాగం గణాంకాల ప్రకారం ఈ ఏడాది హెచ్-1బీ వీసా ఆమోదం పొందిన వాటిల్లో అమెజాన్ (10,044) అగ్రస్థానంలో నిలిచింది. టీసీఎస్ (5505), మైక్రోసాఫ్ట్ (5189), మెటా (5123), యాపిల్ (4202), గూగుల్ (4181), కాగ్నిజెంట్ (2493), జేపీ మోర్గాన్ చేజ్ (2440), వాల్‌మార్ట్ (2390), డెలాయిట్ కన్సల్టింగ్ (2353) టాప్ 10 జాబితాలో ఉన్నాయి. ఇన్ఫోసిస్ (2004), ఎల్‌టీఐమైండ్‌ట్రీ (1807), హెచ్‌సీఎల్ అమెరికా (1728) టాప్-20 జాబితాలో ఉన్నాయి.

అమెరికాకే భారీ నష్టం

వీసా ఫీజుపై అమితాబ్ కాంత్

న్యూఢిల్లీ: హెచ్-1బీ వీసాల దరఖాస్తు రుసుమును లక్ష డాలర్లకు పెంచుతూ డొనాల్డ్ ట్రంప్ యంత్రాంగం నిర్ణయం తీసుకోవడంపై నీతి ఆయోగ్ మాజీ సీఈఓ అమితాబ్ కాంత్ స్పందించారు. ఆ చర్య అమెరికానే ఉక్కిరిబిక్కిరి చేస్తుందని వ్యాఖ్యానించారు. 'ట్రంప్ విధించిన లక్ష డాలర్ల హెచ్-1బీ వీసా ఫీజు అమెరికా ఆవిష్కరణలకు ఊపిరాడకుండా చేస్తుంది. భారతదేశాన్ని టర్బోఛార్జ్ చేస్తుంది. ప్రపంచస్థాయి ప్రతిభకు తలుపులు మూసేయడం వల్ల అమెరికాలో ఏర్పడాల్సిన ల్యాబ్‌లు, పేటెంట్లు, ఆవిష్కరణలు, స్టార్టప్‌లు బెంగళూరు, హైదరాబాద్, పూణె, గురుగ్రామ్‌కు వచ్చేస్తాయి. దాంతో భారతదేశంలో అత్యుత్తమ వైద్యులు, ఇంజినీర్లు, శాస్త్రవేత్తలు, ఆవిష్కర్తలు వికసిత్ భారత్ దిశగా దేశ పురోగతికి దోహదం చేసే అవకాశం ఉంది. అమెరికాకు నష్టం కలిగించే ఈ నిర్ణయం భారత్‌కు లాభం చేకూర్చనుంది' అని అమితాబ్‌కాంత్ ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. మన దేశానికి మేలు చేకూర్చుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. కాగా, ఈ నిర్ణయం దురదృష్టకరమని పలువురు నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సాఫ్ట్‌వేర్, టెక్ పరిశ్రమకు నష్టం చేకూర్చనుందని అంచనా వేస్తున్నారు. స్టెమ్ కోర్సు ద్వారా అమెరికా విద్యాభ్యాసం చేసినవారిపై ఇప్పటికే ఏఐ, టారిఫ్‌లు ప్రభావం చూపుతుండగా, ఈ ఫీజు మరింతభారం కానుందని చెబుతున్నారు. ఇకపై అమెరికా వేదికగా పనిచేస్తున్న కంపెనీలు విదేశీ నిపుణులను నియమించుకునేందుకు జారీ చేసే ఒక్కో వీసాపై ఏడాదికి లక్ష డాలర్లు చెల్లించాల్సి వస్తుంది. దాంతో ఆ సంస్థలు వారిని నియమించుకునేందుకు మొగ్గు చూపకపోవచ్చని భావిస్తున్నారు.

మోదీ బలహీన ప్రధాని

హెచ్-1బీ వీసాలపై రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ: హెచ్ 1బీ వీసాలకు సంబంధించి లక్ష డాలర్ల దరఖాస్తు రుసుము ఉత్తర్వులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంతకం చేయడం, ఆ ఉత్తర్వులు ఈనెల 21వ తేదీ నుంచి అమల్లోకి రానుండటంపై విపక్ష కాంగ్రెస్ పార్టీ విమర్శల దాడి చేసింది. ఈ పరిణామంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ శనివారం తప్పుపట్టారు. ట్రంప్ తొలిసారి దేశాధ్యక్షుడుగా ఉన్నప్పుడు ఈ అంశాన్ని ట్రంప్ దృష్టికి తీసుకురాకపోవడంపై మోదీని తాను 2017లోనే ప్రశ్నించానని రాహుల్ గుర్తుచేశారు. 'మోదీ బలహీన ప్రధాని. మళ్లీ ఇదే మాట చెబుతున్నా' అని రాహుల్ తాజా ట్వీట్‌లో విమర్శించారు. రాహుల్ అభిప్రాయాన్నే కాంగ్రెస్ నేత పవన్ ఖేరా వ్యక్తం చేశారు. ట్రంప్ కుట్రలపై రాహుల్ 2017లోనే హెచ్చరించారని, ఇవాళ యావద్దేశం మోదీని ప్రశ్నిస్తోందని అన్నారు. 'ఇదేమీ కొత్త పరిణామం కాదు. 2017 జులై 5న ఇలాంటి కుట్ర జరుగుతోందని మోదీని రాహుల్ హెచ్చరించారు. ఏదైనా చేయాలని సూచించారు. కానీ మోదీ బలహీన ప్రధాని. అప్పుడు ఏమీ చేయలేదు. ఇప్పుడు కూడా అంతే. దీని ఫలితం ఈరోజు చూడబోతున్నాం. లక్షలాది మంది దేశ యువత నష్టపోనున్నారు. ట్రంప్ ప్రతిరోజూ అవమానిస్తూనే ఉన్నారు. కానీ మోదీ మౌనం వహిస్తున్నారు. ట్రంప్ మోసగాడని పార్లమెంటులో చెప్పాలని మోదీకి రాహుల్ ఒక అవకాశం ఇచ్చారు. ఆయన ఆ మాట చెప్పి ఉంటే యావద్దేశం ఆయన వెనుకే ఉండేది. ఇవాళ యావద్దేశం మోదీని ప్రశ్నిస్తోంది' అని పవన్ ఖేరా అన్నారు. భారతదేశంపై పద్ధతి ప్రకారం అమెరికా పట్టు బిగిస్తోందని కాంగ్రెస్ సీనియర్ నేత మనీష్ తివారీ ఆరోపించారు. హెచ్-1బి వీసాపై ఇప్పుడు జరుగుతున్నది యాదృచ్ఛికం కాదని అన్నారు. వరుస పరిణామాలను గమనిస్తే... పాకిస్థాన్ ప్రేరేపణతోనే అమెరికా ముందుగానే కాల్పుల విరమణ ప్రకటన చేసిందని అన్నారు. పాకిస్థాన్ సైన్యాధ్యక్షుడికి వైట్‌హౌస్‌లో ఆతిథ్యం ఇచ్చారని, ఆ తర్వాత భారత్‌పై 50 శాతం సుంకాలు విధించారని గుర్తుచేశారు. అమెరికా ఆశీర్వాదం లేకుండా సౌదీ-పాకిస్థాన్ రక్షణ భాగస్వామ్యం కుదిరే అవకాశం ఎంతమాత్రం లేదని తివారీ అన్నారు. పద్ధతి ప్రకారం భారత్‌తో అమెరికా కయ్యానికి కాలుదువ్వుతోందన్నారు.

మోదీకి ట్రంప్ రిటర్న్ గిఫ్ట్: ఖర్గే

న్యూఢిల్లీ: హెచ్ -1 బి వీసా దరఖాస్తుల వార్షిక రుసుము లక్ష డాలర్లకు పెంచాలనే అమెరికా నిర్ణయాన్ని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్రంగా విమర్శించారు. ఇది ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవల జరుపుకున్న పుట్టినరోజు సందర్భంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇచ్చిన రిటర్న్ గిఫ్ట్ అని ఖర్గే అభివర్ణించారు. 'మీరందుకున్న రిటర్న్ గిఫ్ట్‌తో భారతీయులు బాధపడుతున్నారు. మీ అబ్కి బార్ ట్రంప్ సర్కార్ ప్రభుత్వం నుండి ట్రంప్ ఇచ్చిన రిటర్న్ గిఫ్ట్ హెచ్ 1బి వీసా లక్ష డాలర్ల పెంపు వల్ల భారతీయ టెక్ కార్మికులను తీవ్రంగా దెబ్బతీసింది. అమెరికాలో హెచ్-1బి వీసాదారుల్లో 70 శాతం మంది భారతీయులే' అని ఖర్గే శనివారం తన ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. 'భారత జాతీయ ప్రయోజనాలే అత్యున్నతమైనవి. బేర్ హగ్స్, హాలో నినాదాలు, మోదీ... మోదీ అని జపించేలా చేయడం విదేశాంగ విధానం కాదు. విదేశాంగ విధానం అంటే... మన జాతీయ ప్రయోజనాలు కాపాడడం. భారతదేశాన్ని మొదటి స్థానంలో ఉంచడం. జ్ఞానం, సమతుల్యతతో స్నేహాలు నడిపించడం. దీనిని మన దీర్ఘకాలిక స్థితిని దెబ్బతీసే ప్రమాదం ఉన్న ఉపరితల ధైర్యసాహసాలకు తగ్గించలేము' అని ఖర్గే హితవు పలికారు. పహల్గాం దాడి సందర్భంగా భారత్ తలపెట్టిన ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత్-పాకిస్తాన్ మధ్య యుద్ధాన్ని తానే ఆపినట్లు ట్రంప్ పదేపదే చెబుతున్నారు. భారత్ ఎగుమతులపై 50 శాతం సుంకాలు విధించారు. దీంతో దాదాపు పది రంగాల్లో భారత్ 2.17 లక్షల కోట్ల డాలర్లు నష్టపోయినట్లు అంచనా వేసినట్లు ఖర్గే గుర్తుచేశారు. భారతీయ అవుట్‌సోర్సింగ్‌ను లక్ష్యంగా చేసుకుని హెచ్‌ఐఆర్‌ఇ (ఉపాధి పునరుద్ధరణకు ప్రోత్సాహకాల నియామకం) చట్టం, చాబహార్ పోర్టు మినహాయింపు ఎత్తివేయడంతో మన వ్యూహాత్మక ప్రయోజనాలకు నష్టం వాటిల్లింది. భారతీయ వస్తువులపై వందశాతం సుంకం విధించాలని ఈయూ ఇచ్చిన పిలుపు కూడా అంతే అని ఖర్గే తీవ్రస్థాయిలో విమర్శించారు.

ఇతర దేశాలపై ఆధారపడొద్దు

- అదే భారత్‌కు అతిపెద్ద శత్రువు
- స్వావలంబన ఏకైక పరిష్కారం: మోదీ

భావ్‌నగర్ (గుజరాత్): భారతదేశానికి ప్రధాన శత్రువు ఇతర దేశాలపై ఆధారపడటమేనని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శనివారం అన్నారు. 'ఆత్మనిర్భరత' కోసం నినాదాలు చేస్తూ, (సెమీకండక్టర్) చిప్‌ల నుంచి నౌకల వరకు ప్రతి దానినీ స్వదేశీ ఉత్పత్తికి పిలుపునిచ్చారు. భావ్‌నగర్‌లోని గాంధీ మైదానంలో జరిగిన 'సముద్ర సే సమృద్ధి' కార్యక్రమంలో రూ.34,200 కోట్ల వ్యయంతో కూడిన ప్రాజెక్టులను ప్రారంభించి... శంకుస్థాపన చేసి మోదీ ప్రసంగించారు. భారతదేశంలోని అన్ని సమస్యలకు ఒకే ఒక పరిష్కారం ఉందని, అది స్వావలంబన మాత్రమేనని అన్నారు. 'భారతదేశం ప్రపంచ సోదరభావం స్ఫూర్తితో ముందుకు సాగుతోంది. నేడు ప్రపంచంలో భారతదేశానికి ప్రధాన శత్రువు ఎవరూ లేరు. కానీ నిజానికి భారతదేశానికి అతిపెద్ద శత్రువు ఇతర దేశాలపై ఆధారపడటమే' అని ప్రధాని తెలిపారు. ఈ ఆధారపడటాన్ని సమష్టిగా ఓడించాలని నొక్కి చెప్పారు. 'ప్రపంచ శాంతి, స్థిరత్వం, శ్రేయస్సు కోసం ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన దేశం స్వావలంబన పొందాలి' అని మోదీ అన్నారు. ఇతరులపై ఆధారపడటం జాతీయ ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తుందని హెచ్చరించారు. 'జాతీయ అభివృద్ధి కోసం సంకల్పాన్ని విదేశీయులపై ఆధారపడి ఉండకూడదు. రాబోయే తరాల భవిష్యత్‌ను ఇతరులకు వదిలివేయకూడదు. 140 కోట్ల జనాభా ఉన్న దేశం ఇతరులపై ఆధారపడి ఉంటే అది జాతీయ ఆత్మగౌరవాన్ని రాజీ చేస్తుంది' అని తెలిపారు. కాంగ్రెస్‌ను లక్ష్యంగా చేసుకుని మోదీ మాట్లాడుతూ స్వాతంత్ర్యం తర్వాత యువకుల ప్రతిభను అప్పటి పాలక పార్టీ అణచివేసిందని, అది 'లైసెన్స్ రాజ్' వంటి ఆంక్షలను తీసుకువచ్చిందని అన్నారు. 'లైసెన్స్-కోటా పాలనలో దీర్ఘకాలిక చిక్కుముడు, ప్రపంచ మార్కెట్ల నుంచి ఒంటరిగా చూడటం' ప్రధాన కారకాలుగా ఆరోపించారు. ప్రపంచీకరణ యుగం ప్రారంభమైనప్పుడు అప్పటి ప్రభుత్వాలు దిగుమతులపై మాత్రమే దృష్టి సారించాయని, అది వేల కోట్ల కుంభకోణాలకు దారితీసిందని మోదీ అన్నారు. 'ఈ విధానాలు భారతదేశ యువతకు గణనీయమైన హాని కలిగించాయి. దేశం నిజమైన సామర్థ్యం బయటపడకుండా నిరోధించాయి' అని తెలిపారు. విదేశీ షిప్పింగ్ కంపెనీల సేవల కోసం భారతదేశం ప్రతి సంవత్సరం 75 బిలియన్ డాలర్లు లేదా దాదాపు రూ. 6 లక్షల కోట్లు చెల్లిస్తున్నదని ఆయన అన్నారు. 'గత ఏడు దశాబ్దాలుగా ఇతర దేశాలకు సరుకు రవాణాలో ఎంత డబ్బు చెల్లించబడిందో ప్రజలు ఊహించగలరా? ఈ నిధుల ప్రవాహం విదేశాలలో లక్షలాది ఉద్యోగాలను సృష్టించింది. ఈ ఖర్చులో ఒక చిన్న భాగాన్ని కూడా మునుపటి ప్రభుత్వాలు దేశీయ షిప్పింగ్ పరిశ్రమలో పెట్టుబడి పెట్టి ఉంటే, ప్రపంచం నేడు భారతీయ నౌకలను ఉపయోగించుకునేది భారతదేశం షిప్పింగ్ సేవలలో లక్షల కోట్లు సంపాదిస్తూ ఉండేది' అని ప్రధాని తెలిపారు.

ఆగని బాంబు బెదిరింపులు

ముంబై/న్యూఢిల్లీ: దేశంలో బాంబు బెదిరింపులకు అంతం లేకుండా పోతోంది. నిత్యం పాఠశాలలు, విమానాశ్రయాలు, విమానాలకు బాంబు బెదిరింపులు వస్తూనే ఉన్నాయి. తాజాగా శనివారం మహారాష్ట్రలో విమానానికి, న్యూఢిల్లీలోని పాఠశాలలకు బాంబు బెదిరింపు కాల్స్ వచ్చాయి. ముంబై నుంచి థాయ్‌లాండ్ వెళ్తున్న ఇండిగో విమానానికి బాంబు బెదిరింపులు రావడంతో అప్రమత్తమైన పైలట్ విమానాన్ని చెన్నైకి దారి మళ్లించారు. ఇండిగోకు చెందిన 6 ఈ 1089 విమానం శుక్రవారం రాత్రి ముంబై నుంచి థాయ్‌లాండ్‌లోని పుకెట్ దీవులకు బయల్దేరింది. విమానం గాల్లో ఉండగా... బాంబు బెదిరింపులు రావడంతో అప్రమత్తమైన పైలట్ సంబంధిత అధికారులకు సమాచారం అందించారు. ముందు జాగ్రత్త చర్యగా విమానాన్ని చెన్నైకి దారి మళ్లించారు. అక్కడ విమానం సురక్షితంగా దిగినట్టు అధికారులు తెలిపారు. ఈ ఘటనతో ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. దేశ రాజధాని దిల్లీలో శనివారం ఉదయాన్నే వివిధ పాఠశాలలకు బాంబు బెదిరింపు ఫోన్లు వచ్చాయి. దీంతో పోలీసులు, ఇతర అత్యవసర సంస్థలు తనిఖీలు ప్రారంభించాయని దిల్లీ అగ్నిమాపక సేవల అధికారి తెలిపారు. ఆంధ్రా స్కూల్, బీసీఎస్ ఇంటర్నేషనల్ స్కూల్, రావు మాన్ సింగ్ స్కూల్, కాన్వెంట్ స్కూల్, మాక్స్ ఫోర్ట్ స్కూల్ ద్వారకలోని ఇంద్రప్రస్థ ఇంటర్నేషనల్ తదితర పాఠశాలలకు బాంబు బెదిరింపు కాల్స్ వచ్చాయి. అగ్నిమాపక సిబ్బంది, బాంబు డిస్పోజల్ స్క్వాడ్‌లు, పోలీసు బృందాలు ఆయా పాఠశాలల్లో తనిఖీలు చేశాయి.

ప్రజలు నాతోనే ఉన్నారు

ర్యాలీలకు షరతులతో డీఎంకే ప్రభుత్వంపై విజయ్ విమర్శలు



నాగపట్నం: డీఎంకే ప్రభుత్వం తన రాజకీయ సమావేశాలకు అనేక షరతులు విధించిందని, ప్రధాన మంత్రి లేదా హోం మంత్రి సందర్శనల సమయంలో ప్రభుత్వం అలాంటి షరతులు విధించే ధైర్యం చేస్తుందా అని నటుడు, తమిళగ వెట్రి కజగం (టీవీకే) వ్యవస్థాపకుడు విజయ్ ప్రశ్నించారు. శనివారం పుత్తూరులో జరిగిన భారీ ర్యాలీలో ఆయన ప్రసంగిస్తూ ప్రభుత్వం తన స్వేచ్ఛా కదలికను అడ్డుకుందని, విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగించిందని అన్నారు. 'సీఎం సర్, మీరు ప్రధాన మంత్రి, హోం మంత్రి సందర్శన సమయంలో షరతులు విధిస్తారా, లేదా టీవీకేకి చేసినట్లుగా విద్యుత్‌కు అంతరాయం కలిగిస్తారా? నాపై అనేక ఆంక్షలు విధించారు. నేను నా చేతులను కదపలేకపోతున్నా' అని విజయ్ అన్నారు. ప్రధాన మంత్రి లేదా హోం మంత్రి సందర్శనల సమయంలో డీఎంకే ప్రభుత్వం అలాంటి వ్యూహాలను ఆశ్రయిస్తే అది ఇబ్బందులను ఎదుర్కొంటుందని ఆయన అన్నారు. 'ప్రజలను కలవాలనుకునే నాపై మీరు ఎందుకు షరతులు విధిస్తారు. మళ్లీ చెబుతున్నా... 2026లో పోటీ టీవీకే, డీఎంకే మధ్య మాత్రమే' అని స్పష్టం చేశారు. టీవీకే బెదిరింపులకు లొంగిపోదని, దానికి ప్రజల నుంచి గట్టి మద్దతు లభించిందని విజయ్ అన్నారు. తిరుచిరాపల్లి సమావేశంలో తన ప్రసంగం సందర్భంగా స్పీకర్ వైర్ తెగిపోయిందని, అరియలూర్‌లో విద్యుత్ అంతరాయం ఏర్పడిందని, తన రాజకీయ సమావేశాల్లో కేవలం మూడు నిమిషాలు మాత్రమే మాట్లాడగలిగానని ఆయన ఆరోపించారు. టీవీకే పట్ల 'నిరంకుశంగా' వ్యవహరించవద్దని డీఎంకే ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రాష్ట్రానికి పెట్టుబడులు పెట్టడానికి ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ విదేశీ పర్యటనల గురించి మాట్లాడుతూ, ఈ పర్యటనలు నిజంగా తమిళనాడుకు పెట్టుబడులు తీసుకురావడానికేనా లేదా మీ కుటుంబం విదేశాల్లోని కంపెనీల్లో పెట్టుబడులు పెట్టడానికేనా అని విజయ్ వ్యక్తం చేశారు. నాగపట్నం తీరప్రాంత అభివృద్ధికి డీఎంకే ప్రభుత్వం చాలా తక్కువ చేసిందని టీవీకే నాయకుడు ఆరోపించారు. మత్స్యకారులు, శ్రీలంక తమిళుల సమస్యలపై డీఎంకేను విమర్శిస్తూ, తమిళనాడు మత్స్యకారులపై దాడి జరుగుతుండటంపై ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రధాన మంత్రికి లేఖలు రాశారని, కానీ ఆ తర్వాత మౌనంగా ఉన్నారని విమర్శించారు.

సీపీఎం కార్యాలయంపై బీజేపీ గూండాల దాడి

అగర్తల: పశ్చిమ త్రిపురలోని ప్రతాప్‌గఢ్ ప్రాంతంలో బీజేపీ మద్దతు గూండాలు బుల్డోజర్‌తో తమ పార్టీ కార్యాలయాన్ని ధ్వంసం చేశారని ప్రతిపక్ష సీపీఎం శనివారం ఆరోపించింది. అర్ధరాత్రి వేళ 1.30 గంటల ప్రాంతంలో గూండాలు బుల్డోజర్‌తో సీపీఎం స్థానిక కమిటీ కార్యాలయానికి వచ్చి ధ్వంసం చేశారని ప్రతిపక్ష నాయకుడు జితేంద్ర చౌదరి తెలిపారు. 'బీజేపీ మద్దతు ఉన్న దుండగులు చేసిన విధ్వంసాన్ని చూపించే వీడియో దృశ్యాలు మా వద్ద ఉన్నాయి' అని ఆయన అన్నారు. ఈ విధ్వంసం బీజేపీ, ఆర్ఎస్ఎస్ 'ప్రజాస్వామ్య విలువల పట్ల గౌరవాన్ని' చూపిస్తుందని తెలిపారు. 'తప్పుడు ప్రకటనలు చేసి అధికారంలోకి వచ్చిన బీజేపీ 'ప్రజా నిధులను దోచుకుంటూ, రాష్ట్ర ప్రజాస్వామ్య వాతావరణాన్ని నాశనం చేస్తున్నారు' అని ఆయన ఆరోపించారు. ఈ సంఘటనను పిరికి చర్యగా అభివర్ణిస్తూ... దీనికి సంబంధించి దాఖలయిన ఫిర్యాదుపై పోలీసులు ఇంకా చర్య తీసుకోలేదని అన్నారు.

ఏజెంట్ల ఉచ్చులో చిక్కుకోవద్దు

ఇరాన్‌లో ఉద్యోగ అవకాశాలపై కేంద్రం హెచ్చరిక

న్యూఢిల్లీ: ఉద్యోగాలు ఇప్పిస్తామని ఆశపెట్టి... భారతీయ పౌరులను ఇరాన్ తీసుకెళ్లి కిడ్నాప్ చేసిన ఘటనలపై భారత విదేశాంగశాఖ స్పందించింది. అలాంటి ట్రాప్‌లో పడొద్దని హెచ్చరికలు జారీ చేసింది. 'భారతీయ పౌరులకు ఉద్యోగం ఇప్పిస్తామని, ఇరాన్ వెళ్లమని ప్రలోభాలకు గురిచేసిన కేసులు ఇటీవల కొన్ని వెలుగు చూశాయి. ఇరాన్‌కు చేరుకున్నాక వారిని క్రిమినల్ ముఠాలు కిడ్నాప్ చేశాయి. వారిని విడుదల చేయాలంటే డబ్బులు ఇవ్వాలని బాధిత కుటుంబాలను డిమాండ్ చేస్తున్నాయి. ఇలాంటి ఉద్యోగ ప్రతిపాదనల విషయంలో కచ్చితమైన అప్రమత్తత పాటించాలని భారతీయులను కోరుతున్నాం. పర్యాటక ప్రయోజనాల కోసం మాత్రమే ఇరాన్ ప్రభుత్వం భారతీయులకు వీసా రహిత ప్రవేశాన్ని అనుమతిస్తోందనే విషయాన్ని గమనించాలి. ఉపాధి లేదా ఇతర ప్రయోజనాల కోసం ఇరాన్ వెళ్లాలని సూచించే ఏజెంట్‌లు క్రిమినల్ ముఠాలతో కుమ్మక్కై ఉండవచ్చు. కాబట్టి వారి ట్రాప్‌లో పడకుండా అప్రమత్తంగా ఉండాలని కోరుతున్నాం' అని విదేశాంగశాఖ ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ హెచ్చరించారు. ఆస్ట్రేలియాలో ఉద్యోగం వస్తుందనే ఆశతో వెళ్లిన కేరళకు చెందిన ఓ వ్యక్తిని ఇరాన్‌లో ఓ ముఠా కిడ్నాప్ చేసిన సంగతి తెలిసిందే. హర్యానాలో ఇమిగ్రేషన్ సేవలు అందిస్తున్నట్లు అమన్ అనే వ్యక్తి కేరళకు చెందిన హిమాన్షు మాథుర్‌కు పరిచయమయ్యాడు. ఆస్ట్రేలియాలో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి... కొంత డబ్బు తీసుకొని ఇరాన్ తీసుకెళ్లాడు. అక్కడ ఓ గ్యాంగ్ వీరిని కిడ్నాప్ చేసింది. అమన్ కూడా ఆ గ్యాంగ్‌లో భాగమేనని పోలీసులు తెలిపారు. ఆ తర్వాత మాథుర్ కుటుంబానికి కిడ్నాపర్లు ఫోన్ చేసి... రూ.కోటి డిమాండ్ చేశారు. చివరకు రూ.20 లక్షలు తీసుకొని విడుదల చేశారు. అంతకుముందు కూడా ముగ్గురు భారతీయ యువకులు టెహ్రాన్‌లో కిడ్నాప్‌కు గురయ్యారు. ఉద్యోగం కోసం ఏజెంట్ల సాయంతో దిల్లీ మీదుగా ఆస్ట్రేలియాకు బయలుదేరిన యువకులను ఇరాన్‌లో ఓ ముఠా వారిని కిడ్నాప్ చేసి డబ్బులు డిమాండ్ చేసింది. ఇరాన్‌లోని భారత రాయబార కార్యాలయం అక్కడి పోలీసుల సాయంతో బందీలుగా ఉన్న యువకులను విడిపించింది.

శిథిలాల కింద తుదిశ్వాస విడిచిన తల్లీపిల్లలు

డెహ్రాడూన్: ఉత్తరాఖండ్‌లోని చమోలీ జిల్లాలో కొన్ని రోజుల క్రితం భారీ వర్షాలకు కొండచరియలు విరిగిపడగా... ఆ భారీ వరదల ధాటికి సమీప గ్రామాలు ధ్వంసం అయ్యాయి. కుంటారి లగాపాలి గ్రామంలో శిథిలాల కింద తల్లి, ఆమె ఇద్దరు కవల పిల్లలను సహాయక దళాలు గుర్తించాయి. కాంతా దేవి(38)తో పాటు ఆమెకు చెందిన పదేళ్ల కవల పిల్లలు కూడా ప్రాణాలు విడిచారు. ఇద్దరు పిల్లలను ఓ చేతితో పట్టుకుని ఆ తల్లి తుది శ్వాస విడిచింది. చివరి నిమిషం వరకు తన పిల్లలను కాపాడుకునేందుకు ఆమె తీవ్రంగా ప్రయత్నించింది. ఆ తల్లీ, పిల్లల శవాలను చూసిన స్థానికులు కన్నీరుమున్నీరయ్యారు. ఇంటి భారీ గోడలు కూలడంతో వారు మరణించారు. కాంతా దేవి భర్త కున్వర్ సింగ్ కొండచరియల్లో చిక్కుకున్నా... అతను అదృష్టవశాత్తు ప్రాణాలతో బయటపడ్డాడు. 16 గంటల తర్వాత ఆ ఇంటిని ఎన్డీఆర్ఎఫ్ దళాలు అన్వేషించాయి. కాంతా దేవి భర్త ప్రాణాలతోనే ఉన్నా... అతడికి ఇప్పుడు కుటుంబం, ఇల్లు లేదు.

కుల సర్వే అసాధ్యం

కుమారస్వామి

బెంగళూరు: రాష్ట్రంలో మరోసారి కులసర్వే నిర్వహించాలని కర్నాటక ప్రభుత్వం నిర్ణయించింది. ఆ మేరకు ఈ నెల 22 నుంచి సర్వే ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో బలంగా ఉన్న ఒక్కలిగ సామాజిక వర్గానికి చెందిన నాయకులు శనివారం సమావేశమయ్యారు. రెండు రోజుల్లో మొదలుకానున్న కులసర్వేపై చర్చించారు. ఈ సమావేశానికి కర్నాటక ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్, కేంద్ర మంత్రి కుమారస్వామి, బీజేపీ ఎమ్మెల్సీ సీటీ రవి హాజరయ్యారు. సమావేశం అనంతరం బయటకు వెళ్తున్న కేంద్ర మంత్రి కుమారస్వామిని మీడియా ప్రశ్నించగా... సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో రాష్ట్రంలో కులసర్వే సాధ్యం కాదని అన్నారు. కులసర్వే అనేది ఒక పిల్లకాలి నిర్ణయమని ఎద్దేవా చేశారు.

బెంగుళూరు రహదారులు గుంతలమయం

రోడ్లపై జనం నిరసన

బెంగళూరు: గుంతలమయంగా మారిన బెంగళూరు రోడ్ల గురించి స్థానికులు నిరసన తెలిపారు. ప్లకార్డులు చేతపట్టి నినాదాలు చేశారు. సమాచారం అందుకున్న పోలసులు అక్కడకు చేరుకుని నిరసన నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు, పోలీసుల మధ్య ఘర్షణ జరిగింది. బెంగళూరు రోడ్లు గుంతలమయంగా మారాయి. దీంతో వివిధ చోట్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్ల సమస్యను అధికారుల దృష్టికి జనం తీసుకెళ్లినప్పటికీ వారు పట్టించుకోవడం లేదంటూ శనివారం ఉదయం బెంగళూరులోని వివిధ కాలనీవాసుల్లో నిరసనలు మిన్నంటాయి. ఐటీ నగరంలో అధ్వానంగా ఉన్న రోడ్ల పరిస్థితిపై ఆందోళన చేపట్టారు. 'బెంగళూరు రోడ్లను కాపాడండి', 'రోడ్లను బాగుచేయండి' అన్న ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. మరోవైపు పోలీసులు ఆయా ప్రాంతాలకు చేరుకుని నిరసనలకు అనుమతి లేదని ... నిరసనలు ఆపాలని కాలనీవాసులను డిమాండ్ చేశారు. నిరసన ముగించకపోతే అరెస్టు చేస్తామని వారిని పోలీసులు బెదిరించారు. ఈ నేపథ్యంలో కాలనీవాసులు, పోలీసుల మధ్య వాగ్వాదం, ఘర్షణ జరిగింది. ఈ వీడియో క్లిప్స్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

ప్రకృతి వల్లే గుంతలు: డీకే

బెంగళూరులో గంతల రోడ్లపై డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ స్పందించారు. ప్రకృతి వల్లే రోడ్లపై గుంతలు ఏర్పడ్డాయని అన్నారు. శనివారం మీడియాతో ఆయన మాట్లాడారు. 'ప్రకృతి వల్లే రోడ్లపై గుంతలు ఏర్పడతాయి. ఎవరూ వాటిని సృష్టించాలని అనుకోరు. వాహనాల పెరుగుదల, భారీ ట్రాఫిక్, అధిక వర్షం కారణంగా మరిన్ని గుంతలు ఏర్పడ్డాయి' అని అన్నారు. కాగా, తాము ఇప్పటికే బెంగళూరు రోడ్లపై ఉన్న ఏడువేలకు పైగా గుంతలను పూడ్చినట్లు డీకే తెలిపారు. ఇంకా ఐదువేలకు పైగా గుంతలు మిగిలి ఉన్నాయని చెప్పారు. గుంతల పరిస్థితిపై నివేదిక ఇవ్వాలని పోలీస్ కమిషనర్‌ను కోరామన్నారు. మరోవైపు వివక్షత లేకుండా బీజేపీ ఎమ్మెల్యేలకూ గ్రాంట్లను విడుదల చేసినట్లు డీకే శివకుమార్ తెలిపారు. వారికి డబ్బు ఇచ్చిన తర్వాత బీజేపీ ఎమ్మెల్యేలు గుంతలను ఎందుకు పూడ్చలేదు అని ప్రశ్నించారు. ఇప్పుడు కూడా వారికి రూ.25 కోట్లు విడుదల చేస్తున్నామని తెలిపారు. కాగా, రోడ్ల దుస్థితిపై ఈ నెల 24న బెంగళూరుతో సహా కర్నాటకలోని అన్ని నియోజకవర్గాల్లో గంట పాటు రోడ్లు నిర్బంధిస్తామన్న బీజేపీ ప్రకటనపై డీకే స్పందిస్తూ 'సమస్యను పరిష్కరించడానికి మేం ఇక్కడ ఉన్నాం. బీజేపీ రాజకీయాలు చేస్తోంది. వారు ఏమి చేయాలనుకుంటే అది చేయనివ్వండి' అని మీడియాతో అన్నారు.

సీపీఐ జాతీయ మహాసభలు ఆదివారం నుంచి చండీగఢ్‌లో ప్రారంభం కానున్నాయి. దీనికి సంబంధించి ఏర్పాట్లు చేస్తున్న ఏఐఎస్‌ఎఫ్, ఏఐవైఎఫ్ కార్యకర్తలు.

కేంద్రం నియంత్రణలో వ్యవస్థలు

మహాసభల్లో భవిష్యత్ కార్యాచరణ: నారాయణ

న్యూఢిల్లీ: చండీగఢ్‌లో ఆదివారం నుంచి ఐదు రోజులపాటు సీపీఐ జాతీయ మహాసభలు జరగనున్నాయి. దాదాపు 750 మంది ప్రతినిధులు ఈ సమావేశాలకు హాజరు కానున్నారు. ఈ సందర్భంగా సీపీఐ జాతీయ కార్యదర్శి డా.కె.నారాయణ మీడియాతో మాట్లాడుతూ బీజేపీ ప్రజావ్యతిరేక విధానాలపై జాతీయ మహాసభల్లో చర్చించి... భవిష్యత్ కార్యాచరణ నిర్ణయిస్తామని తెలిపారు. యువత రాజకీయాల్లోకి రావాలని పిలుపునిచ్చారు. సీపీఐలో 75 ఏళ్ల వయోపరిమితి అమలుపై మహాసభల్లో చర్చిస్తామని చెప్పారు. నేపాల్, బంగ్లాదేశ్, శ్రీలంకలో అవినీతి, నిరుద్యోగం పెరిగి యువత తిరగబడ్డారన్నారు. కేంద్రం అన్ని వ్యవస్థలను తమ చెప్పుచేతల్లో పెట్టుకుందని విమర్శించారు. అదానీ గ్రూప్‌కు సెబీ క్లీన్‌చిట్ ఇచ్చిందని, అండమాన్ నికోబర్ దీవులను అదానీకి అప్పగించారన్నారు. అదానీకి మద్దతుగా ప్రధాని మోదీ నిలుస్తున్నారని ఆరోపించారు. అదానీకి వచ్చే ఆదాయాన్ని సగటుగా వచ్చే ఆదాయంతో పోల్చి తలసరి ఆదాయం లెక్కగడతారా అని ప్రశ్నించారు. సెల్ ఫోన్లు, కార్లు పెరిగాయని, రేషన్ బియ్యం తినేవారు లేరంటూ రేషన్ కార్డులను తొలగించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. రేషన్ బియ్యం అమ్మేవారిని పట్టుకోకుండా రేషన్ కార్డులు తొలగించాలని చూస్తున్నారని విమర్శించారు. గతంలో కాకినాడలో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అక్రమ రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారని అన్నారు. ఫుట్ పాత్‌పై పడుకునే వాడు కూడా సెల్ ఫోన్ వాడుతున్నారని తెలిపారు. ఫోన్ వాడినంత మాత్రాన పేదరికం లేనట్లా అంటూ నారాయణ ప్రశ్నించారు.

వెంకన్న సొత్తు దోచిన వైసీపీ గజదొంగలు: లోకేశ్ ధ్వజం

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: జగన్ ఐదేళ్ల పాలనలో అవినీతి రాజ్యమేలింది. అరాచకం పెచ్చరిల్లింది. దొంగలు, దోపిడీదారులు, మాఫియా డాన్లకు ఏపీని కేరాఫ్ అడ్రస్ చేశారు అని మంత్రి నారా లోకేశ్ ధ్వజమెత్తారు. గనులు, భూములు, అడవులు, సమస్త వనరులతోపాటు జనాన్ని దోచుకున్న జగన్ గ్యాంగ్...చివరకు తిరుమల శ్రీవారి సొత్తునూ వదలలేదన్నారు. జగన్ హయాంలో తిరుమల శ్రీవారి పరకామణిలో సిబ్బంది కానుకలను తస్కరిస్తున్న వీడియో ఒకటి బయటకు వచ్చింది. సీసీ కెమెరా ద్వారా రికార్డు అయిన ఈ వీడియోను లోకేశ్ తన ఎక్స్ ఖాతాలో పోస్టు చేస్తూ విమర్శలు గుప్పించారు. తాడేపల్లి ప్యాలెస్ ఆశీస్సులు, నాటి టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి అండదండలతో తిరుమల పరకామణిలో దొంగలు పడ్డారని, కోట్ల సొత్తు కొల్లగొట్టారని, ఈ డబ్బు రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడులు పెట్టారని, ఇందులో వాటాలను తిరుపతిలో భూమన నుంచి తాడేపల్లి ప్యాలెస్ వరకు అందాయని నిందితులే చెబుతున్నారన్నారు. భక్తులు కట్టిన ముడుపులు, హుండీలో వేసిన కానుకలు వందల కోట్లు రవికుమార్ దోచుకుని వెళ్లినప్పుడు భూమన ...అతడి మనుషులు ఈ కేసును లోక్ అదాలత్‌లో రాజీ చేయడానికి ప్రయత్నించారన్నారు. భక్తులు మహా ప్రసాదంగా భావించే లడ్డూని కల్తీ చేశారని, అన్న ప్రసాదాన్ని భ్రష్టు పట్టించారని మండిపడ్డారు. తిరుమల దర్శనాలను అమ్మేసి సామాన్య భక్తులకు స్వామి దర్శనం దుర్లభం చేశారని విమర్శించారు. ఏడుకొండలవాడు చాలా శక్తిమంతమైన స్వామి...ఆయనకు అపచారం తలపెట్టినా, ఆయన సన్నిధిలో అవినీతికి పాల్పడినా...ఏం జరుగుతుందో తెలిసినా జగన్, భూమన ఏకంగా పరకామణినే దోచేశారని ధ్వజమెత్తారు. రేపు నిందితులే వైసీపీ పాపాల చిట్టా విప్పబోతున్నారన్నారు.

అంబేద్కర్ స్టడీ సర్కిళ్ల ద్వారా పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అంబేద్కర్ స్టడీ సర్కిళ్ల ద్వారా నిరుద్యోగ ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ యువతకు పోటీ పరీక్షల కోసం ఉచితంగా ఇచ్చే శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఏపీ అంబేద్కర్ స్టడీ సర్కిల్ డైరెక్టర్ ప్రసన్న వెంకటేశ్ శనివారం తెలిపారు. ఐబీపీఎస్, ఆర్‌ఆర్‌బీ, ఎస్ఎస్‌సీ వంటి పరీక్షల కోసం తిరుపతి, విశాఖపట్నం కేంద్రాలుగా ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు వెల్లడించారు. శిక్షణా కాలంలో అభ్యర్థులకు ఉచిత వసతి, భోజన సౌకర్యం కలిస్తామన్నారు. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో ఈ నెల 24 నుంచి అక్టోబరు 6 వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని, అభ్యర్థులకు ఆయా జిల్లా కేంద్రాల్లో అక్టోబరు 12న స్క్రీనింగ్ టెస్ట్ ఉంటుందని, మెరిట్ సాధించిన వారికి రిజర్వేషన్ల ఆధారంగా సీట్లు కేటాయిస్తామన్నారు. మరిన్ని వివరాలకు https://apstdc.apcfss.in వెబ్‌సైట్ లేదా సెల్ నం.9949686306కు సంప్రదించాలని వెంకటేశ్ సూచించారు.

రైతులకు 'ఎస్ఎంఎస్ సలహా' సేవలు ప్రారంభం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రైతులకు మరింత చేరువగా సాంకేతిక సలహాలను అందించేందుకు ప్రభుత్వం కొత్త పద్ధతిని ప్రవేశపెట్టింది. రాష్ట్ర వ్యవసాయ సంచాలకులు డిల్లీ రావు ప్రారంభించిన ఏపీఏఐఎంఎస్ 2.0 (ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ సమాచార యాజమాన్య వ్యవస్థ 2.0)లో భాగంగా రైతులకు ఎస్ఎంఎస్ ద్వారా సాగు సూచనలు ఇవ్వనున్నారు. ఈ పద్ధతిలో వాతావరణ పరిస్థితులు, సాగునీటి లభ్యత, పురుగులు-తెగుళ్ల యాజమాన్యం, పోషకలోపం సమస్యలపై కృత్రిమ మేధ ఆధారంగా రైతులకు ముందస్తు హెచ్చరికలు చేస్తారు. బల్క్ ఎస్ఎంఎస్ పుల్ డౌన్ విధానం ద్వారా ఒకేసారి వేలాది మంది రైతులకు తక్షణ సలహాలు అందుతాయని డిల్లీరావు తెలిపారు. వాసర్ లాబ్స్ అభివృద్ధి చేసిన ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ద్వారా పంటల వారీగా, ప్రాంతాల వారీగా సలహాలు రూపొందుతాయన్నారు.

మరిన్ని అరెస్టులు తప్పవా?

- ఈడీ రాకతో వైసీపీ నేతల్లో గుబులు
- మద్యం కేసు దర్యాప్తు వేగవంతం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ మద్యం కుంభకోణంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దూకుడు పెంచింది. మనీలాండరింగ్ కోణంలో ఈ కేసును దర్యాప్తు చేస్తున్న ఈడీ... ఇప్పటికే అనేక నగరాల్లో సోదాలు నిర్వహించింది. ఢిల్లీ, హైదరాబాద్, విజయవాడ, అమరావతి సహా అనేక ప్రాంతాల్లో జరిగిన సోదాల్లో కీలక పత్రాలు, డిజిటల్ ఆధారాలను ఈడీ స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఈడీ దర్యాప్తు వేగం పెరగడంతో నిందితుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. త్వరలో మరిన్ని అరెస్టులు జరిగే అవకాశం ఉన్నట్లు సమాచారం అందుతోంది. ఏపీ మద్యం విధానాల్లో 2019 తర్వాత రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మార్పులపై బహిరంగంగా విమర్శలు రావడం, కొద్దిమందికి లాభాలు వచ్చేలా వ్యవస్థను మలచినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. ప్రైవేట్ మద్యం దుకాణాలను తొలగించి... ప్రభుత్వ నియంత్రిత విక్రయాన్ని ప్రవేశపెట్టడంలో పారదర్శకత కొరవడిందని అనేక మంది పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా మద్యం ఆర్డర్ల వ్యవహారంలో కొద్ది కంపెనీలకే అవకాశం కల్పించడంలో భారీ అవకతవకలు జరిగాయనే ఆరోపణలు ఉన్నాయి. ఈ కుంభకోణంలో సుమారు రూ.4 వేల కోట్ల లావాదేవీలు జరిగాయనే అనుమానంతో ఈడీ విచారణ చేపట్టింది. షెల్ కంపెనీల ద్వారా నిధుల మళ్లింపు, హవాలా లావాదేవీలు, బ్యాంకు ఖాతాల్లో అనుమానాస్పద డిపాజిట్లు మొదలయిన అంశాలపై ఈడీ ప్రత్యేక దృష్టి సారించింది. ఇప్పటికే కొంతమంది వ్యాపార వేత్తలు, బినామీ కంపెనీలు, మధ్యవర్తులపై ఏపీ సీఐడీ కేసు నమోదు చేసి విచారణ జరుపుతోంది. 12 మందిని అరెస్టు చేసింది. ఇందులో నలుగురు బెయిల్‌పై విడుదల కాగా... మిగిలిన నిందితులు వివిధ జైళ్లలో రిమాండ్ ఖైదీలుగా ఉన్నారు. ఈ వ్యవహారంలో రాజకీయ నేతల ప్రమేయం ఉందన్న సంకేతాలు స్పష్టమవుతున్నాయి. నాటి ప్రభుత్వ పెద్దలతో అనుబంధాలు ఉన్న వ్యాపారవేత్తలు మద్యం ముడుపుల సొమ్మును షెల్ కంపెనీల ద్వారా విదేశాలకు తరలించినట్లు ఆధారాలు లభించినట్లు తెలుస్తోంది. దీంతో ఈడీ రంగంలోకి దిగింది. ప్రస్తుతం ఈడీ మూడు దశల్లో దర్యాప్తు సాగిస్తోంది. మొదటగా సోదాలు, రెండవ దశలో డేటా విశ్లేషణ, మూడవ దశలో నేరుగా అరెస్టులు జరగనున్నాయి. ఇప్పటికే దాదాపు 40కు పైగా బ్యాంకు ఖాతాలను గుర్తించిన ఈడీ... వాటిలో లావాదేవీలపై సమగ్రంగా పరిశీలన చేపట్టింది. డిజిటల్ డేటా నుంచి కొంతమంది పేర్లు స్పష్టంగా వెలుగులోకి వచ్చినట్లు తెలుస్తోంది. ఈ కేసుపై అధికార పార్టీ స్పందించకపోవడం రాజకీయంగా గమనార్హం. ప్రతిపక్షం మాత్రం ఇది రాజకీయ ప్రేరేపిత కేసుగా అభివర్ణిస్తోంది. అయితే ఈ కేసు దర్యాప్తు ప్రక్రియ కేవలం వ్యాపారుల వరకే పరిమితం కాకుండా అసలు వ్యవస్థను నడిపించిన వారి వరకు వెళ్లాలని డిమాండ్ వినబడుతోంది. మద్యం పాలసీలో జరిగిన అవకతవకలు కేవలం ఆర్థిక కుంభకోణంగా కాదు. సామాజికంగా, ఆర్థికంగా ప్రజలపై తీవ్ర ప్రభావం చూపిన సంఘటనగా ముద్రపడుతోంది. వేలాదిమంది అసంఘటిత మద్యం విక్రేతలు ఉపాధి కోల్పోయారు. ప్రభుత్వ ఆదాయం ఆశించిన స్థాయిలో రాలేదు. ప్రజలు అధిక ధరలకు మద్యం కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఎదురైంది. ఇప్పుడు ఈడీ దర్యాప్తు కీలక మలుపు తిరగబోతున్నది. అరెస్టులు ఎప్పుడయినా సంభవించవచ్చన్న చర్చ రాజకీయవర్గాల్లో నెలకొంది. ఈ కుంభకోణంలో అంతిమ లబ్ధిదారు ఎవరనేది రాబోయే రోజులలో స్పష్టత రానుంది. ఇప్పటికే నాటి ప్రభుత్వంలో కీలకంగా పని చేసి ఈ కేసులో నిందితులుగా ఉన్న అనేక మంది ఉన్నతాధికారులు, నాటి అధికార పార్టీ ప్రజాప్రతినిధులు కొందరిని సిట్ అధికారులు అరెస్టు చేయడం, కేసులో నిందితులుగా గుర్తించడం తెలిసిందే. ఈ క్రమంలో ఈడీ దర్యాప్తు రాజకీయంగా ప్రకంపనలు సృష్టించే అవకాశం ఉందని అంటున్నారు. ఈ పరిణామాలు వైసీపీ శ్రేణుల్లో గుబులు రేకెత్తిస్తున్నాయి.

జడ్జిలకు నిష్పాక్షికత అవశ్యం

- ప్రభుత్వానికి వ్యతిరేకంగా తీర్పులు ఇవ్వడంలో విముఖత తగదు
- అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ సదస్సులో సీజేఐ గవాయ్

న్యూఢిల్లీ: న్యాయమూర్తులు నిష్పక్షంగా వ్యవహరించాలని భారత ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాల్ అన్నారు. అవసరమైనప్పుడు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆదేశాలు ఇవ్వడానికి విముఖత వద్దని సూచించారు. అలాంటి వారు ఆత్మవిమర్శ చేసుకోవడం ఎంతో అవసరమని ట్రిబ్యునళ్ల నాన్-జ్యుడిషియల్ సభ్యులకు సూచించారు. న్యాయమూర్తులు, న్యాయవాదులు సమానమని, కలిసి పని చేస్తేనే చివరి వ్యక్తికి న్యాయం జరుగుతుందని తెలిపారు. ఢిల్లీలో శనివారం జరిగిన సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ 2025 10వ అఖిలభారత సదస్సులో న్యాయ వ్యవస్థ, ట్రిబ్యునళ్ల పనితీరు, సమస్యలపై సీజేఐ మాట్లాడారు. కోర్టులకు అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునళ్లకు తేడా ఉంటుందని, పరిపాలన యంత్రాంగానికి, న్యాయ వ్యవస్థకు మధ్య అసాధారణ స్థానాన్ని అవి కలిగివుంటాయని చెప్పారు. ట్రిబ్యునళ్ల సభ్యుల్లో చాలా వరకు ప్రభుత్వ పదవుల్లో పనిచేసిన వారు ఉంటారని, మిగతా వారు న్యాయ వ్యవస్థ నేపథ్యం నుంచి వచ్చిన వారు ఉంటారన్నారు. పాలనా యంత్రాంగాన్ని, న్యాయ వ్యవస్థ అనుభవాన్ని ఐక్యవేదిక కల్పించే ఈ వైవిధ్యత శక్తికి సంకేతమే అయినప్పటికీ, సభ్యులు ఎప్పటికప్పుడు శిక్షణ పొందడం, ఏకరూప పరిణామాలను పాటించడం, ప్రవర్తనా నిబంధనావళికి కట్టుబడటం ప్రధానమని సీజేఐ గవాయ్ వెల్లడించారు. 'ఒక జడ్జిగా నేను ఓ విషయాన్ని గమనించాను. అడ్మినిస్ట్రేటివ్ సభ్యులలో, జడ్జిలలో కొందరు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆదేశాలివ్వడానికి ఇష్టపడటం లేదని గుర్తించాను. ఇలాంటి వారు ఆత్మపరిశీలన చేసుకోవడం అవసరమని చెబుతాను. న్యాయ విద్యా నిపుణులతో వర్క్‌షాపులు, సదస్సులు, శిక్షణా కార్యక్రమాలను తరచూ నిర్వహించడం వల్ల ఈ పరిస్థితిలో మార్పు వస్తుంది. ట్రిబ్యునల్ సభ్యులు మరింత సమర్థంగా పనిచేసే వీలు కలుగుతుంది' అని సీజేఐ సూచించారు. నియామకాల్లోనూ పారదర్శకత పద్ధతిని అనుసరించడం, సమర్థులను నియమించడం ద్వారా ట్రిబ్యునళ్లపై ప్రజల విశ్వాసాన్ని పునరుద్ధరించవచ్చన్నారు. అదే విధంగా కోర్టురూమ్‌లలో కొందరు జడ్జిలు, న్యాయాధికారుల ప్రవర్తనపై సీజేఐ అభ్యంతరం తెలిపారు. న్యాయమూర్తులు తమ అధికారాల వినియోగంలో వినయంగా, బాధ్యతగా వ్యవహరించాలని అన్నారు. 'ఇటీవల కొందరు జడ్జిల తీరుపై బార్ అసంతృప్తి వ్యక్తంచేసింది. నేను ఈ మధ్య ఓ వార్తాపత్రికలో హైకోర్టు న్యాయమూర్తి గురించి వార్త చూశాను. ఆ జడ్జి ఎవరు, అది ఏ హైకోర్టు అనేది చెప్పను కానీ న్యాయమూర్తి ధాటికి యువ న్యాయవాది స్పృహ కోల్పోయారని అందులో ఉంది. జడ్జిలుగా మనం మనం హుందాగా వ్యవహరించాలి. మన హోదాను గౌరవించాలి. న్యాయమూర్తులు, న్యాయవాదులు న్యాయ వ్యవస్థ స్వర్ణరథానికి రెండు చక్రాల వంటివారు. ఎవరూ ఎక్కువ-తక్కువ కాదు. జడ్జిలు, లాయర్లు కలిసి పనిచేస్తేనే న్యాయ వ్యవస్థ సమర్థంగా పని చేయగలదు. చివరి పౌరునికి న్యాయం చేకూర్చగలదు' అని సీజేఐ అన్నారు. తమ సమస్యలతో మన వద్దకు వచ్చే వ్యాజ్యదారుల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని న్యాయం జరిగేలా నిష్పాక్షికంగా తీర్పులు ఇవ్వాలని సీజేఐ గవాయ్ సూచించారు. సదస్సులో కేంద్రమంత్రులు అర్జున్ రామ్ మేఘవాల్, జితేంద్ర సింగ్ పాల్గొన్నారు.

రాష్ట్రాలను చంపేస్తున్న కేంద్రం: సూర్జేవాలా

న్యూఢిల్లీ: రాష్ట్రాలను అధికారంలేని మున్సిపాలిటీలుగా మార్చేందుకు మోదీ ప్రభుత్వం యత్నిస్తోందని, వాటి స్వయంప్రతిపత్తిని హరించే కఠిన ఫెడరలిజాన్ని ప్రదర్శిస్తోందని కాంగ్రెస్ శనివారం విమర్శించింది. గత పదేళ్లలో రాష్ట్రాలపై అప్పు రూ.60లక్షల కోట్లకు పెరిగిందన్న కాగ్ నివేదిక పేర్కొనడంతో కేంద్రాన్ని దుయ్యబట్టింది. ద్వంద్వ ప్రమాదం (డబుల్ జియోపార్డీ) వల్ల అప్పులు పెరిగి ఆదాయం కుదిరించుకుపోతోందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రణదీప్ సూర్జేవాలా విమర్శించారు. భారత సమాఖ్యవాదం కళంకితమవుతోందని అన్నారు. రాష్ట్రాలపై ఉన్న అప్పు గత దశాబ్దంలో మూడు రెట్లు పెరిగిందని, జీఎస్టీ పరిహార సెస్, ఏకపక్షంగా విధించే కేంద్ర లెవీల వల్ల ఆర్థిక స్వాతంత్ర్యాన్ని రాష్ట్రాలు కోల్పోయాయని ఆయన ఎక్స్‌లో పేర్కొన్నారు. సహకార సమాఖ్యవాదం, అధికార వికేంద్రీకరణ పణంగా పెట్టబడ్డాయని, రాష్ట్ర పరిపాలన అంతానికి, కేంద్రం వద్ద అధికారం కేంద్రీకృతమయ్యేలా ప్రయత్నాలు జరుగుతున్నాయని వ్యాఖ్యానించారు.

జగన్ సోదరుడి నివాసంలో ముగిసిన సిట్ సోదాలు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి : మద్యం ముడుపుల కుంభకోణం కేసులో చెన్నై, హైదరాబాద్‌లో సిట్ అధికారులు చేపట్టిన సోదాలు ముగిశాయి. చెన్నైలో మూడు కంపెనీల్లో శనివారం మధ్యాహ్నం వరకూ సోదాలు జరిగాయి. జగన్ సోదరుడు (పెద్దనాన్న కుమారుడు) వైఎస్ అనిల్ రెడ్డికి చెందిన మొత్తం ఎనిమిది కంపెనీలు, ఆయన నివాసాలపై సిట్ దాడులు చేసింది. కీలక డేటాను స్వాధీనం చేసుకుంది. చెన్నైలో ఆయా కంపెనీలకు చెందిన బ్యాంక్ లావాదేవీలు చూసే అకౌంటెంట్లు ఆడిటర్లను విచారణకు రావాల్సిందిగా నోటీసులు ఇవ్వాలని సిట్ అధికారులు భావిస్తున్నారు. ఇటీవల హైదరాబాద్, విశాఖపట్నంలో సునీల్ రెడ్డి కంపెనీలపై నిర్వహించిన సోదాల్లో అనిల్ రెడ్డి కంపెనీలకు నగదు బదిలీ అయినట్లు అధికారులు గుర్తించారు. ఈ సమాచారం ఆధారంగానే సిట్ బృందాలు చెన్నై, హైదరాబాద్‌లో అనిల్ రెడ్డి నివాసాలు, కంపెనీలపై సోదాలు చేపట్టింది. మద్యం ముడుపులను అనిల్ రెడ్డి ఈ కంపెనీల ద్వారా విదేశాల్లోని షెల్ కంపెనీలకు పంపారని సిట్ భావిస్తోంది. 2019 నుంచి 2024 వరకు ఈ కంపెనీల్లోకి వచ్చిన పెట్టుబడులు, అనిల్ రెడ్డి కొనుగోలు చేసిన ఆస్తులు తదితర వివరాలపై అధికారులు ఆరా తీశారు. చెన్నై, హైదరాబాద్‌లో ఉన్న ఏడు బృందాలు విజయవాడకు బయలుదేరాయి. ఆది, సోమవారాల్లో సోదాలకు సంబంధించి డేటాను విశ్లేషించి తదనంతర దర్యాప్తును చేపట్టాలని సిట్ ఉన్నతాధికారులు భావిస్తున్నారు.

గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష నిర్వహించాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీ హైకోర్టు రద్దు చేసిన ఏపీపీఎస్సీ గ్రూప్-1 పరీక్షను తిరిగి నిర్వహించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఆయన ప్రకటన విడుదల చేశారు. '2018లో ఏపీపీఎస్సీ నిర్వహించిన గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష మూల్యాంకనంలో లోపాల వల్ల ఏపీ హైకోర్టు గ్రూప్-1 మెయిన్స్ పరీక్షను రద్దు చేస్తూ తీర్పునిచ్చింది. ఆంధ్ర ప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ 2018లో నిర్వహించిన గ్రూప్-1 పరీక్షల ఫలితాలను 2022 మే 26న ప్రకటించింది. ఈ ఫలితాలలో అక్రమాలు చోటుచేసుకున్నాయనే ఆరోపణలతో ప్రశ్నాపత్రాల డిజిటల్ వాల్యుయేషన్‌పై అనేక మంది అభ్యర్థులు ఏపీ హైకోర్టును ఆశ్రయించారు. 2024 మార్చి 13న గ్రూప్-1 మెయిన్స్ పరీక్షను హైకోర్టు రద్దు చేస్తూ, మరో 6 నెలల్లో మెయిన్స్ పరీక్ష నిర్వహించాలని ఏపీపీఎస్సీని ఆదేశించింది. ప్రభుత్వరంగమైన ఏపీపీఎస్సీకి సంబంధించిన ఉద్యోగాల వాల్యుయేషన్‌ను ప్రైవేటు కంపెనీ మాదిరిగా హ్యాయ్‌ల్యాండ్ రిసార్ట్స్‌లో చేయడం, అందుకు రూ.1.19 కోట్లు ఖర్చు చేయడం, అప్పటి ఏపీపీఎస్సీ కార్యదర్శి పి.ఎస్.ఆర్.ఆంజనేయులు మూల్యాంకనం బాధ్యతను ఒక థర్డ్ పార్టీ ఏజెన్సీకి అప్పగించడం అనేక వివాదాలకు దారితీసింది. ఈ ఉద్యోగాలకు సంబంధించి కోట్లాది రూపాయలు చేతులు మారినట్లు ఆరోపణలొచ్చాయి. ఇందులో ఎవరెవరి పాత్ర ఉందో, ఎంత మొత్తాలు చేతులు మారాయో సీబీఐతో సమగ్ర విచారణ జరిపించాలని సీపీఐ డిమాండ్ చేసింది. అప్పట్లో ప్రతిపక్షంగా ఉన్న తెలుగుదేశం పార్టీ కూడా ఏపీపీఎస్సీ అక్రమాలపై ఆందోళన చేయడం గమనార్హం. అయినప్పటికీ ప్రతిపక్షాలు చెప్పేది ఏమాత్రం ఖాతరు చేయకుండా జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం మూర్ఖంగా ఫలితాలను ప్రకటించింది. చివరకు రాష్ట్ర హైకోర్టు ఆ ఫలితాలను రద్దు చేస్తూ మళ్లీ పరీక్షలు నిర్వహించాలని తీర్పు ఇచ్చింది. కానీ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది కాలానికిపైగా గడుస్తున్నా గ్రూప్-1 పరీక్ష నిర్వహించకుండా తాత్సారం చేయడం విచారకరం' అని రామకృష్ణ పేర్కొన్నారు. ఉద్యోగాల సాధన కోసం ఏళ్ల తరబడి శిక్షణ తీసుకుని, నిరీక్షిస్తున్న అభ్యర్థులను తగు న్యాయం చేసేందుకు, తక్షణమే ఏపీపీఎస్సీ గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు నిర్వహించాలని రామకృష్ణ డిమాండ్ చేశారు.

కర్నాటక సీఐడీకి ఈసీ సమాచారం ఇవ్వలేదు

ఓట్ల దొంగతనంపై రాహుల్ గాంధీ

వయనాడ్ (కేరళ): రాష్ట్రంలో 'ఓట్ల దొంగతనం' ఆరోపణలకు సంబంధించి కర్నాటక సీఐడీ కోరిన సమాచారాన్ని భారత ఎన్నికల సంఘం అందించలేదని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ శనివారం ఆరోపించారు. శుక్రవారం తన తల్లి సోనియా గాంధీతో కలిసి వయనాడ్‌కు వచ్చిన రాహుల్ ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ 'ఓటు చోరీ'లో ఉపయోగించిన సంఖ్యల గురించి సమాచారం కోరుతూ కర్నాటక సీఐడీ ఈసీకి అనేక లేఖలు పంపిందని, కానీ ఎన్నికల సంఘం దానిని అందించడం లేదని అన్నారు. జ్ఞానేశ్ కుమార్ ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) పోలీసులు కోరిన సమాచారాన్ని ఆయన అందించడం లేదని కాంగ్రెస్ ఎంపీ తెలిపారు. సీఈసీపై ఇంతకంటే పెద్ద నేరారోపణ మరొకటి ఉండదు. పోలీసులు సమాచారం అడుగుతున్నారు. ఆయన దానిని అందించడం లేదు. ఇది నా ప్రకటన కాదు. ఇది వాస్తవం. ఇది నలుపు, తెలుపులో ఉంది' అని ఆయన అన్నారు. ఆరోపించిన 'ఓటు చోరీ'కి కాంగ్రెస్ సాక్ష్యాలను చూపుతుంది. ప్రధాని నరేంద్ర మోదీ అది చేశాడు. ఎన్నికలలో గెలిచాడనే విషయంలో ఎవరికీ అనుమానం లేదని తెలిపారు. 'నేను నా రెండు విలేకరుల సమావేశాలలో చెప్పినట్లుగా పరిస్థితి వాస్తవికతను పూర్తిగా నాశనం చేసే హైడ్రోజన్ బాంబును మేము బహిర్గతం చేయబోతున్నాము. మేము ఏమి చెబుతున్నామో దానికి మా వద్ద బహిరంగ, రుజువులు ఉన్నాయి' అని అన్నారు. 'మేము రుజువు లేకుండా ఏమీ చెప్పడం లేదు. నా పని నేను చేస్తాను' అని తెలిపారు.

రాంచిలో బాంబులు తయారీ...

విద్యార్థి అరెస్టు

రాంచి: హోటల్ పేరుతో ఐసిస్ ఉగ్రవాదుల కోసం బాంబులు, ఇతర పేలుడు పదార్థాలు తయారు చేస్తున్న విద్యార్థిని పోలీసులు అరెస్టు చేశారు. రాంచీలోని ఓ మారుమూల ప్రాంతంలో శిథిలావస్థలో ఉన్న భవనాన్ని హోటల్‌గా నడుపుతున్నారని పోలీసులు తెలిపారు. పైకి హోటల్‌గా చెప్పుకుంటున్నప్పటికీ అందులోని భూగర్భ గదుల్లో ఉగ్రవాదుల కోసం బాంబులు తయారు చేస్తున్నట్లు సమాచారం అందిందన్నారు. హోటల్‌లో పని చేస్తూ... ప్రభుత్వ ఉద్యోగం కోసం సిద్ధమవుతున్న అషర్ డానిష్ అనే విద్యార్థిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కొన్నేళ్లుగా రహస్యంగా బాంబులు తయారు చేస్తూ... ఉగ్ర ముఠాలకు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. దేశంలోని కొంతమంది రాజకీయ నాయకులను లక్ష్యంగా చేసుకొని దాడులు చేయడానికి ఈ ఉగ్రముఠా ప్రణాళికలు రచించినట్లు పోలీసులు వెల్లడించారు. డానిష్ గది నుంచి గన్‌పౌడర్, బాంబులు,పెద్ద మొత్తంలో పొటాషియం నైట్రేట్, ఇతర ఆయుధాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎవరికీ అనుమానం రాకుండా ఈ పేలుడు పదార్థాలను స్థానికంగా ఉన్న సుబర్ణరేఖ నదిలో పేల్చి... పరీక్షించేవారని అధికారులు వెల్లడించారు. కేవలం బాంబులు తయారు చేయడమే కాకుండా డానిష్, మరికొంతమంది ఉగ్ర మద్దతుదారులు స్థానికంగా ఉన్న యువతను ఉగ్రవాదం వైపు ప్రోత్సహిస్తున్నట్లు గుర్తించామని అధికారులు పేర్కొన్నారు. సిగ్నల్ యాప్ ద్వారా ఐసిస్ ఉగ్రవాదులతో వీరు నిరంతరం సంప్రదింపులు చేస్తున్నట్లు తెలిపారు. రాంచీలోని ఇస్లామ్‌నగర్‌లో ఇటీవల పోలీసులు అరెస్టు చేసిన ఐసిస్ అనుమానిత ఉగ్రవాది అజార్‌తో డానిష్‌కు సంబంధాలు ఉన్నట్లు గుర్తించామన్నారు. ఇప్పటివరకు 8 మంది అనుమానిత ఉగ్రవాదులను పట్టుకున్నామని, వారిని విచారిస్తున్నామని తెలిపారు.

ఉగ్ర కుట్ర భగ్నం

శ్రీనగర్: జమ్ముకశ్మీర్‌లో ఉగ్రవాద కుట్రను భద్రతా దళాలు భగ్నం చేశాయి. 20 చైనా హ్యాండ్ గ్రెనేడ్‌లతో పాటు కొన్ని ఆయుధాలు స్వాధీనం చేసుకున్నాయి. పూంచ్ సెక్టార్‌లోని ఒక చోట ఆయుధాలున్నట్లు నిఘా సమాచారం అందింది. దీంతో భద్రతా దళాలు సెర్చ్ ఆపరేషన్ చేపట్టారు. ఉగ్రవాద కార్యకలాపాల కోసం తరలించేందుకు వాటిని అక్కడ దాచినట్లు గుర్తించి స్వాధీనం చేసుకోవడంతో ఉగ్ర కుట్రను భగ్నం చేసినట్లు అధికారులు తెలిపారు. శ్రీనగర్, బారాముల్లా, అనంత్‌నాగ్, కుప్వారా, హంద్వారా, పుల్వామా, షోపియన్‌లో జమ్ముకశ్మీర్ పోలీసులు, కౌంటర్ ఇంటెలిజెన్స్ సిబ్బంది సోదాలు నిర్వహించారు. ఉగ్రవాద నేరాలకు సంబంధించిన డిజిటల్ పరికరాలు, పత్రాలు స్వాధీనం చేసుకున్నారు.

PRINTED & PUBLISHED BY EDUPUGANTI NAGESHWARA RAO, On Behalf of VISALAANDHARA VIGANANA SAMITI, PRINTED AT AMODA PUBLICATIONS PVT. LTD, AMODA PRESS, Andhra Jyothi Buildings, S.No: 1/1 & 1/2, Near Indus High School,Gooty Road, Pandipadu Grama Panchayati, KURNOOL, ANDHRA PRADESH, PUBLISHED AT VISALAANDHRA VIGNANA SAMITI, C.R.BHAVAN, SAPTAGIRINAGAR, KURNOOL, ANDHRA PRADESH. EDITOR : R.V. RAMARAO. RNI NO:APTEL/2013/54446. Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : 08518-255522,255555, Fax No. 277721, E-Mail : visknl@ yahoo.com